


ఆంధ్రసచిత్రవార


పత్రిక





శ్రీ అనసూయాపా ఫిలిమ్స్
పల్నాటి యుద్ధము
స్క్రీన్‌ప్లే డైరెక్షన్
రామినీడు
ఆంధ్ర-సీడెడ్: పూర్ణా
నైజాం: ఉషా ఫిలిమ్సు
మైసూరు: వాణి
ఉస్త్రన్ ఈస్ట్రన్ సర్క్యూట్సు: శ్రీ వాణీ పిక్చర్స్
నిర్మాతలు
టి. హనుమంతరావు
వై. లక్ష్మయ్య చౌదరి
డి. సూర్యనారాయణ




తప్పక చూడండి
గౌరి ప్రొడక్షన్స్
అద్భుత అపరాధ పరిశోధక చిత్రం
నిర్వహణ: క. భావనారాయణ దర్శకత్వం: K.S.R.
పూర్ణా రిలీజ్



సుప్రసిద్ధమైన ప్లేయర్స్ వారి నాణ్యతకోసం
ప్లేయర్స్
నేవీ
బ్లూ
తీసుకోండి
మీ ప్లేయర్స్ నేవీ బ్లూ తీసుకొని, ప్లేయర్స్ వారి సుప్రసిద్ధమైన నాణ్యతను అతి సరసమైన ధరలో ఆనందించండి. అవి అతి మృదువు, నిండైన సువాసన, మీకు ఎంతో సంతృప్తినిచ్చే రుచి, కలిగిన అత్యుత్తమమైన సిగరెట్లు.
25 పైసలకే
పది సిగరెట్లు
స్థానిక పన్ను అదనం
PLAYER'S
NAVY BLUE
CIGARETTES
MADE IN INDIA

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 11-2-'66

శ్రీ విశ్వావసునామ సం॥ మాఘ మాస బహుళ సప్తమి

సంపుటము . 58 సంచిక : 24

స్థాపితము:
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

క్రొత్తరేట్ల ననుసరించి 14-1-1966 మొదలు ఆంధ్రసచిత్ర వారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

	పోష్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతర దేశాలకు

ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	24.50
అర్ధసంవత్సర చందా	12.25

రచయితలకు విజ్ఞప్తి

తమ రచనలతో కాక విడిగా స్టాంపులు పంపే వారి రచనలు తిప్పి పంపడం సాధ్యం కాదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశం కూడా లేదని గుర్తించ ప్రార్థన.

సం॥

మన లో మాట

ఈ సంచిక తయారయ్యేసమయానికి రష్యా 'లూనిక్' అంతరిక్షనావని చంద్రమండలంమీదకి సురక్షితంగా దింపగలిగింది. ఇది ఏవిధంగా చూసినా వైజ్ఞానికాభివృద్ధిలో ఒక పెద్ద ముందడుగు. అంతరిక్షయానంలో అమెరికాకన్నా ముందుకు సాగిపోయినట్లు రష్యా మరొకసారి నిరూపించుకుంది. త్వరలో లూనిక్ చంద్రమండలంనుంచి పంపుతూ ఉన్న సమాచారం వివరాలు వెలువడవచ్చు. వీలయితే పైవారం కొన్ని వివరాలు ప్రచురించగలమని అనుకుంటున్నాము....

* * *

బర్మాదేశంలోకి విదేశీయులని సాధారణంగా రానివ్వరుట. ఎంతో కష్టంమీదనే 'వీసా'లు దొరుకుతాయుట. ఇటువంటి పరిస్థితులలో భారత ప్రధాన మంత్రి కీ. శే. లాల్‌బహదూర్‌శాస్త్రిగారిని బర్మా పర్యటించమని అక్కడి నాయకులు పిలవటం భారతదేశానికే గౌరవం. బర్మాగురించి ఈవారం అక్కడ చాలాకాలం ఉన్న శ్రీ భీశెట్టి లక్ష్మణరావుగారి మొదటి వ్యాసం వేస్తున్నాము. వచ్చేవారం మరొక వ్యాసం వేస్తాము. ఈ వ్యాసాలతో పడే బొమ్మలు రచయిత పంపినవే.

* * *

60వ పేజీలో శ్రీ ధర్మాజీ తెలుగు చిత్ర పరిశ్రమలో ఏర్పడిన ఒక పరిణామానికి సంబంధించిన చిన్న వ్యాసం ఒకటి రాశారు. ఇదే విషయముపై కొంత కాలం కింద సుప్రసిద్ధ తెలుగు నటుడు శ్రీ ఎన్. టి. రామారావుగారు రాసిన కొన్ని వ్యాసాలు మేము ప్రచురించిన సంగతి పాఠకులకి జ్ఞాపకం ఉండే ఉంటుంది....

విషయానుక్రమణిక

ముఖచిత్రం : నటుడు శోభన్‌బాబు.


ధనవంతులు
నిరుపేదలు
సమానత్వసాధనకు
కామరాజ్
కలలు
నేను కుంటివాణ్ణి
కానే
కాను!
సుకర్ణో
లోగడి ధోరణులు
తాష్కెంట్
ఒప్పందం!
ఈశినాడాయుని
ఆత్మవిరోధం!
చైనా
ప్రజలు
చైనా
సంక్షేమ
పథకాలు
ఆవును
మేపవయ్యా
పాలు
నంక్కొవాలి
చైనా
సేన

11-2-66

[illegible]

దుబారా కర్చు జాతీయ ఆశయమా?

"తిండీ, వినోదాలూ ఇప్పిస్తే చాలు, ప్రజలు ఏ గొడవా లేకుండా పడి ఉంటారు" అనేవాళ్ళు ట రోమన్లు. భారత దేశానికి సంబంధించినంతదాకా తిండి అమెరికా, వినోదాలు కాంగ్రెసు ప్రభుత్వమూ ఇవ్వటం జరుగుతోంది. ఇది ఇప్పటివాటకాదు. 1947లో కాంగ్రెసు వర్గ రహిత, కుల రహిత సమాజాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చింది.

అధికారంలోకి వచ్చిన తర్వాత, "వి. ఐ. పి."(అతి ముఖ్యవ్యక్తులు!) అనే కొత్త వర్గాన్ని సృష్టించింది. ఈ అ. ము. వ్య. లు తాము ఏ, ఏ వర్గాల నుంచి వచ్చారో ఆ, ఆ వర్గాలవారితో కలవటానికి అంగీకరించరు. చనిపోయిన తర్వాత కూడా వారికి ప్రత్యేక స్మశానాలు ఉండవలసిందే.

ముందు ముందు రాబోయే పరిపాలనా పద్ధతుల సంస్కరణ కమిషన్ ఉదాహరణగా తీసుకుందాము. దీని అధ్యక్షులు శ్రీ మొరార్జీ దేశాయికి ప్రధాన మంత్రికన్నా కొంచెం తక్కువమెట్టులో ఉండే స్థాయి కావాలిట—ఇలా వార్తాపత్రికలు చెప్తున్నాయి. తక్కినమెంబర్లకి మంత్రులకి ఉండే ప్రాముఖ్యత ఇవ్వాలిట. ఈమాత్రం అట్టహాసం లేకపోతే కమిషన్ పని చెయ్యలేదుట! కొంత కాలం ముందు లార్డ్ లిన్‌లిత్‌గో అధ్యక్షత కింద "రాయల్ కమిషన్ ఆఫ్ లేబర్" అనేది ఏర్పడటం జరిగింది. ఆయన ఇటువంటి కోరికలని కోరలేదు. కోరితే పై అధికారులు కాదని తోసివేసేవారే. వర్గ రహిత సమాజాన్ని ఇలా చూస్తున్నాము.

ఇక—కుల విభేదాలు—నేడు వీటికి ఉన్న ప్రాముఖ్యత ఈమధ్య చరిత్రలో చూడమేమో!

వినోదాల సంగతి ఎలా ఉంది? రిపబ్లిక్ దినం వేడుక అన్నిటికన్నా పెద్దది. వీటికోసం ఏటా లక్షరూపాయలపైన ఖర్చు పెడ్తారు. ఇదొక పెద్ద తమాషా. దీనికోసం చేసే సన్నాహాలు డిసెంబర్‌లోనే ప్రారంభిస్తారు. రోజుల వెంబడి సాధారణ దిన సరి కార్యక్రమాన్ని అశ్రద్ధ చేస్తారు. సెక్రటేరియట్‌లో ఏ పనీ సరిగ్గా జరగదు. జానపద నృత్యాల వింత తగ్గిపోయి చాలా రోజులయింది కాని వాటిని మానివెయ్యరు. ఒక్క రష్యాలో తప్ప ఇటువంటి ఉత్సవాలు ఇంత గొప్పగా చెయ్యరు. కాని రష్యాలో ఈ ఈ ఉత్సవాల్లో ఆ దేశం సైనిక శక్తిని ప్రదర్శిస్తారు. ఇటువంటి శక్తి భారతదేశానికిలేదు. సంపాదించుకోవాలనీలేదు. అప్పుడు ఇంత అట్టహాసం దేనికి? అంతేకాక ఇదొక్కటే తమాషా కాదుకదా! సంవత్సరం పొడుగునా ఏదో ఒక హడావుడి ఉండనే ఉంటుంది. తపాలా బిళ్ళ విడుదల అయినా ఏదో కార్యక్రమం ఏర్పరచవలసిందే.

న్యూఢిల్లీలో ఉండేవారికి దేశం ఆర్థికంగా ప్రమాదకరమయిన పరిస్థితిలో ఉందని అనిపించదు.

ఎక్కడ చూచినా మంత్రుల, అధికారుల ఆవిష్కరణలే!

ఏ పత్రికలో చూసినా మంత్రుల ఉపన్యాసాల వార్తలే! కంపెనీ అధ్యక్షుల ఉపన్యాసాలు ప్రకటనలకింద వేస్తారు కదా! అలాగే మంత్రుల ఉపన్యాసాలకీ 'ఛార్జి' వేసి పత్రికలవాళ్ళు కొంత డబ్బుసంపాదించుకోవచ్చుకదా! మంత్రులకి తమని గురించిన వార్తలు, ఫోటోలు పడకపోతే తోచదు. సినిమాస్టార్ల కన్నా ఎక్కువ కీర్తి కండూతి వీరికి ఉంది. దీనిని తీర్చటానికి ప్రజల డబ్బు వెచ్చిస్తారు.

ఈ కింద ఒక చిన్న వార్త ఇస్తాను.

"దండుగ తగ్గించాలనే ఉద్యమం నెల రోజులకింద ప్రారంభంఅయింది. కాంటక్ మునిసిపాలిటీలో మొదలైన ఈ ఉద్యమం ఇంకా ఇంకా చొచ్చుకుపోతోంది.

"ఉదాహరణకి—వస్త్ర వ్యాపారం వారు ఎనిమిది ఫ్యాక్టరీలలో మూడు సంవత్సరాలలో తమ స్థిరాస్తితో సమానమయిన మొత్తాన్ని దండుగ చేశారని తెలిసింది. ఇలాగే ఎనిమిది యంత్ర కర్మాగారాలలో చాలా దండుగ అయిందని తెలిసింది.

"చెడిపోయిన వికృత వస్త్రాలకి బిల్లులు పాడిచే అలవాటు 50 వేల 'యువాన్'ల విలువచేసే వస్త్రాలని దండుగ చేయించిందని అంచనావేశారు.

"ఈవిధంగా వివిధ కర్మాగారాలలో జరిగే దండుగని అంచనావేసి, అరికట్టే ప్రయత్నాలు జరగాలని అన్ని వర్గాల వారి అభిప్రాయాలని సేకరించటం జరిగింది."

ఇది చైనాకి సంబంధించిన వార్త అని నేను వేరే చెప్పటం అనవసరం. 21,500 కోట్ల రూపాయల కట్టు లేకపోతే నాల్గవ ప్రణాళిక ఉపయోగం లేదని శ్రీ మెహతా అన్నారు. శ్రీశచీంద్ర చౌదరి బడ్జెట్ ఇంద్రజాలంలోమునిగి ఉన్నారు. ఆదా చెయ్యాలనే కోరికని కూడా నశింప చేస్తున్నారు, కాంగ్రెసు పరిపాలకులు. వీలయినంతగా ప్రజల ధనాన్ని వెచ్చిస్తున్నారు.

సాధారణంగా అదనంగా డబ్బు కావలసినప్పుడు పార్లమెంటుని అడిగి పొదుపుచెయ్యటం అనేది ఏ ప్రభుత్వానికయినా ధ్యేయం. కాని, ఇప్పుడు పార్లమెంటులోనే అశ్రద్ధలేదు. ఎంత ఖర్చు చెయ్యగలిగితే అంత మంచిదన్నట్లు ప్రవర్తిస్తున్నారు కొందరు సభ్యులు. దుబారా కర్చు మన జాతీయాశయాలలో ఒకటయిపోయింది.

* * *

రాజస్థాన్, గుజరాత్, మైసూరు,

న్యూఢిల్లీ లేఖ

మహారాష్ట్ర ప్రదేశాలలోని కొన్నిజిల్లాలలో కసువు నిలువ పథకాలని అక్కడి అరణ్యశాఖల వారు తయారు చేస్తున్నారు. ఈ నిలువలలోనుంచి క్షామ ప్రదేశాలకి అవసరమయిన సహాయం పంపాలని ఈ పథకాలు తయారు చేసేవారి ఉద్దేశం. గుజరాత్ ఫారెస్టు డిపార్టుమెంటువారు 19 లక్షల టన్నుల గడ్డి నిలువ చేశారు. కాని ఎక్కువచోట్ల కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ నిల్వలు చాలవు. అందుకనే పశువులని మేతకోసం దట్టంగా అడవులు ఎదిగినచోటికి తీసుకువెళ్ళాలని కొందరు అంటున్నారు. రాజస్థాన్ ఈ విషయంలో చాలా కష్టాలని ఎదుర్కోనవలసి వస్తుంది. అసలు కసువు రవాణా పద్ధతులని బాగా అభివృద్ధిచెయ్యాలి.

ఈ నిలువ పథకాలు చాలాకర్చుతో కూడిన పనులు. ఉదాహరణకి రాజస్థాన్ పథకాన్ని కింద ఇస్తున్నాను:—

నివారణ ప్రణాళికలు	4.5	కోట్లరూ.
గడ్డి ఏర్పాట్లు	0.5	,,
మంచినీటి సరపరా	0.2	,,
ధాన్యాలకి సబ్సిడీ	0.7	,,
కరువు అప్పులు	1.0	,,
చిల్లర కర్చులు	1.6	,,
మొత్తం	7.5	కోట్లరూ.

—శ్రీకృష్ణ

రాష్ట్రనాయకుడు, మహారాష్ట్ర నాయక్!


ఇరవై అయిదు సంవత్సరములు నిండిన ఆంధ్రా అసోసియేషన్, పూనా తన రజతోత్సవాన్ని యీ సంవత్సరము జనవరి 9, 10 తేదీలలో అత్యంత వైభవంగా జరుపుకున్నది. ఈ శుభ సమయంలో గౌ, శ్రీ బ్రహ్మానందరెడ్డి (ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి.) గౌ. శ్రీ నాయక్‌గారు (మహారాష్ట్ర ముఖ్యమంత్రి) కృష్ణా గోదావరి సంగమంవలె అసోసియేషన్ ఆవరణలో కలుసుకోవడం ఆంధ్ర, మహారాష్ట్రుల కలయికా అన్నట్లుంది. పూనా నగరంలో గతంలో ఎప్పుడూ జరగనంత ఘనంగా రజతోత్సవాలు నిర్వహించబడినవి. తెలుగు రచయిత శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రి గారిని, మరాటీ రచయిత శ్రీ మహా మహోపాధ్యాయ్ గారిని సత్కరించి రెండు విశిష్ట సాహిత్యాలకు సత్కారం జరిపించడం మొదటిరోజు కార్యక్రమంలో నో ప్రత్యేక ఘట్టం. ముమ్మొందుగా పూర్ణకుంభం జరిపి పిమ్మట శాస్త్రయుక్తంగా ముఖ్య అతిధులైన శ్రీ నాయక్‌గారిని శ్రీ రెడ్డిగారిని వేదికపైకి ఆహ్వానించడం, అదిపరి సన్మానోత్సవం, ఆ తరువాత శ్రీ రెడ్డిగారిచే అసోసియేషన్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన శ్రీ నాయక్‌గారిచే కళా ప్రదర్శన ప్రారంభోత్సవం "తెలుగు పలుకు" (అసోసియేషన్‌చే వెలువరింపబడుతున్న ద్వైమాస పత్రిక) రజతోత్సవ సంచికగా విడుదల చేయడం ఆనాటి కార్యక్రమాల ముఖ్య ఆకర్షణ. అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహింపనున్న పాఠశాలకు తదితర కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము తగినంత సహాయం చేస్తుందని శ్రీ రెడ్డిగారు వాగ్దానం చేశారు. శ్రీ నాయక్‌గారు పాఠశాల నిర్మాణానికి పది వేల రూపాయలు విరాళంగా యిచ్చారు. ప్రేక్షకుల మనసుల్లో ఆనందం వెల్లి విరిసేలా యీ యిద్దరు మహనీయుల సత్ సమ్మేళనంతో ఆనాటి ఉదయపు కార్యక్రమాలు సాఫీగాను, వైభవంగాను సమాప్తమయినవి. ప్రవాసాంధ్రులుగా అంత శోభాయమానంగా సాంస్కృతికోత్సవాలను జరుపుకోవడం ఆంధ్రజాతికే గర్వకారణం.

రజతోత్సవాలను పురస్కరించుకొని నాటికల పోటీలు, సంగీత పాటలు, కథానిక, ఆట పోటీలను అతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆ యీ పోటీలలో గెలుపొందిన వారికి శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి బహుమతి ప్రదానము చేసారు. ఆ సాయంకాలము కుమారి పుండోల్, కుమారి నిర్మలారాణి గారలు నృత్య ప్రదర్శనలు యిచ్చారు. ఆనాటి తుది కార్యక్రమంగా ప్రసిద్ధ హార్మోనియ్యాక్కరు శ్రీ సేరెళ్ళ వేణుమాధవ్ వివిధ రకముల గొంతులను పలుపురు ప్రముఖులననుకరించి అభినయించి ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించారు.

10—1—66 నాటి సాయంకాలం "విముక్తుడు" నాటికను మనోరంజకంగా ప్రదర్శించారు. అనేక మంది పెద్దలు పై కార్యక్రమాలలో సహకరించి రజతోత్సవములు జయప్రదం కావడానికి శాయశక్తులా పాటుపడ్డారు.

—ఒక విలేఖరి

రచన : శ్రీశెట్టి లక్ష్మణరావు



పగోడా

బర్మాదేశంలో తెలుగువారు - సంస్కృతి

పుత్తడిబొమ్మకు మారుపేరు బర్మాదేశం. దీన్నే మన తెలుగువారు 'బ్రహ్మ' దేశమని కూడా అంటుంటారు. ఇది భారతదేశానికి తూర్పు దిక్కుగా వుంది. జనాభా సంఖ్య రెండుకోట్లకు పైగా. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో మహోన్నత స్థానాన్ని ఆక్రమించుకొని వెళ్ళిపోయినా సుభిక్షంగా పాడిపంటలు-కాలువాలతో అలరారుతుంటుంది దేశం.

మన పొరుగు దేశాల్లో ఒకటైన యీ బర్మా సుమారు యాభై ఏళ్ళ క్రిందటివరకూ భారతదేశం యొక్క అంతర్భాగం. 1934లో బ్రిటిషువారు దీన్ని భారతదేశం నుంచి వేరు చేశారు.

సమశీతోష్ణస్థితి గల దేశం బర్మా. ఆరునెలలు పుష్కలంగా వర్షాలు కురుస్తే మిగతా అర్ధభాగం, మంచి ఎండలు కాస్తాయి. అందుకే అక్కడి 'వరిపంట'కు పెట్టింది పేరు. గంగభద్ర, కృష్ణా, గోదావరి నదుల్లాగే అక్కడి 'ఇరావతి'—'సిండ్విన్' — 'సిర్విన్' మొదలైన జీవనదులు పంటపొలాల్ని 'ధాన్యరాసుల'తో నింపెత్తి బర్మాను సువర్ణ సీమ'గా విఖ్యాతి కెక్కించాయి.

చాలాకాలం వరకు 'మాండలే' నగరం బర్మాకు రాజధాని. అయితే 1948లో స్వరాజ్యం సంపాదించాక, బర్మా రాజధాని, వాణిజ్యానికి ముఖ్యకూడలి అయిన 'రంగూన్'కి మార్చబడింది.

బియ్యం, గోధుమ, జవుళి, కిరోసిన్ ఆయిల్, పెట్రోలు—యీ దేశపు ముఖ్యోత్పత్తులు. ఈ దేశపు ద్రవ్యం మనదేశ కరెన్సీని పోలి వుంటుంది. రూపాయల్ని 'క్యా' అని, పైసల్ని, 'ప్యా' అని పిలుస్తుంటారు.

బర్మీయులు మాట్లాడేది 'పాళీ' భాష. ఇది సంస్కృత జన్యం. భగవాన్ బుద్ధుడు వారి ఆరాధ్య దైవం. వారవలంబించేది బౌద్ధమతమే అయినా యితర మతాల ప్రాధాన్యతను గుర్తించి గౌరవిస్తారు. హిందూ, క్రైస్తవ, ముస్లిం, మతాలకు సంబంధించిన దేవాలయాలు, చర్చిలు, మసీదులు అడుగడుగునా మనకు కన్పిస్తుంటాయి.

ఈ దేశానికి వలస వెళ్ళిన ప్రవాసీయుల్లో ఒక్క భారతీయులేగాక అన్ని దేశాలకు అన్ని జాతులకు అన్ని మతాలకు చెందిన వారు కూడా వున్నారు.

ఆర్థిక, వాణిజ్య రంగాల్లోనూ, ఉన్నత స్థానాల్లోనూ ఉత్తర హిందూస్థానీయులుంటే—మేస్త్రీ, కాంట్రాక్టర్లుగను కష్టజీవులుగను దక్షిణ భారతీయులు (తెలుగు, తమిళులు) పరిగణన కొస్తారు.

బర్మాకు తెలుగువారి వలస

అనాది కాలంనుంచీ, అంటే బర్మా భారత దేశాల మధ్య, సముద్ర మార్గం ద్వారా రాకపోకలు ఏర్పడిన్నాటి నుంచీ, మన తెలుగువారు, కోరంగి, యానాం (ఫ్రెంచికాలనీ), తాళ్ళరేవు మొదలగు ప్రాంతాల నుంచి తెరచాపలుగల నాటు పడవల మీద ఉప్పు, మిరపకాయలు, కారం, మొదలగు దినుసులు వేసుకొని బర్మాకు వర్తకానికి వెళ్ళేవారు. ఈ నాటు పడవల వ్యాపారస్తులలో మొట్టమొదటి తెలుగువారు 'కోరంగి' అనే చిన్న పల్లెరేవు నుంచి బయల్దేరడం వల్ల, వీరిని కలుసుకున్న బర్మీయులు 'మీరెక్కడ్నుంచి వస్తున్నా'రంటే, 'కోరంగి నుంచి' అని బదులు చెప్పడం వల్ల, యిప్పటికీ, బర్మాలో తెలుగువార్ని 'కోరంగికలా' (కోరంగి దేశం నుంచి వచ్చిన తెలుగువాడా!) అనిపిలుస్తుండడం పరిపాటైంది.

ఇలా నాటుపడవల మీద వ్యాపారం కోసం వెళ్ళిన తెలుగువారు, పగోడా, మాండలే, మౌల్మైన్, బస్సీన్, హెంజడా మొదలగు పూళ్ళలో స్థిరపడి క్రమేపీ బర్మా స్త్రీలను వివాహమాడి సంసార సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇట్లా, బర్మా—తెలుగు జాతులకు కలిగిన సంతతి 'తల్లైంగ్స్'



బర్మీయ వనిత నృత్యం.

అనే ఒకకొత్త జాతిగా నామకరణం జరిగింది. కాలక్రమేణా ఈ 'తలైంగ్', తెగవారు బర్మాలో 'మూన్' జాతియులుగా పరిణామం చెందారు. రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం యీలా వలస వెళ్లిన తెలుగువారు బర్మాలో లక్షకు పైచిలుకుగా వుండేవారు.

ఆ దేశచరిత్రలో ఆంధ్రుల పాత్ర

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు బర్మా, బ్రిటిష్‌వారి అధీనంలో వుండేది. ఆ దేశాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో బ్రిటిష్‌వారు కష్టించి పనిచేసే కార్మికుల కోసం అన్వేషించే సమయాన భారతదేశం తూర్పుకోస్తా జిల్లాలో ఆర్థిక దుస్థితితో అలమటించే ఆంధ్ర కార్మికులు కన్పించారు. చేతినిండా పని, కడుపు నిండా తిండి దొరుకుతుందనే ఎరజూపి, తెలుగువార్ని వందలా వేలూ సంఖ్యలో బర్మాకు తరలించుకపోయారు. వీరిలో తెలుగు ముస్లిములు కూడా వున్నారు. అన్నానికి మొఖంవాచిన అభాగ్య ఆంధ్ర కార్మికులు పిలిచిందే తడవుగా కుటుంబాలతో సహా బర్మాకు వలస పోయి, కీకారణ్యంగా వున్న 'రంగూన్'— ప్రాంతాన్ని తెలుగువారు, చెమట, రక్తం ధారపోసి చదును చేసారు. కట్టడాలు, భవనాలు, రోడ్లు, తటాకాలు నిర్మించారు. నీటి వనరులను ఏర్పరచి, బీడు భూముల్ని పంట పొలాలుగా మార్చారు. రంగూన్ నగరంలో ప్రతి ముఖ్యకట్టడం, తెలుగువారి కాయకష్టానికి ప్రత్యక్ష నిదర్శనం. హార్బరు, సూరత్ బజారు, భవంతులు అందుకు ఉదాహరణలు.

తెలుగువారి వలస 1934 వరకు నిరాటంకంగా కొనసాగింది. ఆ తర్వాత, రానురాను 'ఇమిగ్రేషన్' నిబంధనలూ — 'పాస్‌పోర్టు' లాంఛనాలు విధించింది బ్రిటిష్ ప్రభుత్వం. స్వతంత్రం పొందిన అనంతరం బర్మాకు వలస వచ్చే, ప్రవాసీయులంతా, (పద్దెనిమిదేళ్లకు పైబడ్డవారు) ఫారినర్స్ రిజిస్ట్రేషన్ ఏక్ట్ కింద సంవత్సరానికి ఏభై రూపాయలు విధిగా ప్రభుత్వానికి చెల్లించాలనే షరతు పెట్టింది. బర్మా ప్రభుత్వం. ఇది ఇప్పటికీ అమల్లో వుంది. అయితే ఈ చట్టం బర్మా పౌరసత్వం పొందినవారికి మాత్రం వర్తించదు.

బర్మీయుల ఆచార వ్యవహారాలు పండుగలు

మనకు మల్లే బర్మీయులకు కూడా ఎన్నో ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు పండుగలూ వున్నాయి. స్వతహాగా, మానవాళి అంతా వసుధైక కుటుంబంగా భావించి, వివిధమైన—భేదభావం దరిరానీయని ఆదర్శజాతి బర్మీయులది. జాతిభేదాలున్నట్టు కన్పించదు. ఏ జాతీయులైనా, ఏ మతస్థులైనా 'దేహి' అంటే చాలు తనకున్న దాంట్లో నుంచి ఏ కొద్దిగొప్పో యిచ్చి, సహకరిస్తుంటారు. అందుకే యీ దేశానికి వలస వెళ్లిన మనవారు బర్మాను, 'కామధేను' అని కూడా అంటుంటారు. స్త్రీలు ఉల్లిపొరల్లాంటి జాకెట్లు (ఎక్కువ తెలుపు) ధరించి, లుంగీలు కట్టుకుంటారు. చీరధారణ వుండదు. పురుషులకు తలగుడ్డ (గౌంబ్వే) తప్పనిసరి. మీసా లుండడం అరుదు. చొక్కా, (ఏంజి) లుంగీ (లవుంజీ) కట్టుకుంటారు. పాదరక్షలు (సన్నా) కలపతో తయారు చేసినవి ఎక్కువగా ఉపయోగిస్తారు. స్త్రీ, పురుషుల దేహచ్ఛాయ తళతళ మెరిసే బంగారు కాంతితో వుంటుంది. అన్ని కాలాల్లోనూ సెంట్లు, అత్తర్లు మొదలైన సుగంధ ద్రవ్యాలు వాడడం అంటే బర్మావారికి చాలా యిష్టం. గుండ్రని ముఖం, సన్నని పెదవులు, అందమైన చక్రాల్లాంటి కళ్లతో, మన పురాణ యుగంలోని మునికన్యల్లా బర్మీయ స్త్రీలు శిగలు పైకెత్తి, ముడికట్టి, శిరోజాలు అలంకరించుకొని, దేవలోకం నుంచి దిగి వచ్చిన అప్సరసల్లా మరులు గొల్పుతూ వుంటారు. పొడవైన వీరి శిరోజాలు అందంగా చూడ ముచ్చటగా వుంటాయి.

వీరి వంటకాల్లో ముఖ్యమైనవి "మొహింగా"—"కాప్స్వే" అనబడు పిండి వంటలు. పై రెండు వంటకాలకు చాలా యిష్టపడతారు. వీరిలో మాంసాహారులు కూడా వున్నారు. వీరు ప్రాముఖ్యత నిచ్చే పండుగలు మూడు. అవి 1. సంక్రాంతి

బర్మా


(దడురిజాట్)2.వసంతోత్సవం (ఈరాబో_ తింజాన్) 3. ఉపవాస మహాత్సవాలు (ఉబూసోండే.)

దీపావళి, ఉపవాస మహోత్సవ పండగలు విశిష్టమైనవే అయినా, వసంతోత్సవ పండుగకు మాత్రం వారు ప్రత్యేకత జూపుతారు. మనకు ఉగాదితో కొత్త సంవత్సరం ఆరంభమైనట్లే, వీరికి 'ఈరాబో' లేక 'తింజాన్' నీళ్ళ పండుగతో కొత్త సంవత్సరం ఆరంభమవుతుంది. ఇది ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో వస్తుంది. ఈ జల క్రీడోత్సవాలలో తర, తమ భేదాలుపూర్తిగా మరిచి పోయి, ధనికులూ, నిర్ధనులూ, ఉన్నతోద్యోగులూ—కార్మికులూ అనే స్థాయీ, హోదా విస్మరించి అంతా సమాన స్థాయిలో కలిసి వినోదిస్తారు. ఒకరిపైనొకరు చిల్లు గొట్టాలతో నీళ్ళు చిమ్ముకుంటూ కేరింతలు కొడతారు. ఈ తింజాన్ జల క్రీడో త్సవంలో మన తెలుగు వారూ, తెలుగు సంస్థలూ కూడా, విరివిగా పాల్గొని బర్మీయులతో కలిసి ఆత్మీయత ప్రదర్శిస్తారు. ఈ ఉత్సవంలో వున్న విశిష్టత ఏమంటే—అంత వరకు ప్రేమించుకుంటున్న యువతీ యువకులు ఈ జల క్రీడోత్సవ పండుగ నాడు బయటికొచ్చి, నిచ్చెలి విడిగా తిరుగుతూ — తమ తమ ప్రేయసీ ప్రియులతో దూరప్రాంతాలకు పలాయన మవుతారు. నెల, రెండు నెలల తర్వాతతిరిగి స్వగృహాలకు చేరుకునే నూతన దంపతులకు తల్లిదండ్రులు—పెద్దలు కలిసి (మింగ్లాహెం) వివాహం చేస్తారు. దీనికి తల్లిదండ్రులు గాని—ఇతరులు గాని ఏ అభ్యంతరం చెప్పరు. వివాహం, పెండ్లి కుమార్తె యింట్లో జరిగినా, పెండ్లి కుమారుని యింట్లో జరిగినా వరుడు మాత్రం, యావజ్జీవితం అత్తారింట్లో వుండాల్సిందే! పురుషులతో పాటు స్త్రీలు కూడా ఉద్యోగాలు చేస్తూ గృహజీవితంలో భర్తలకు సహకరిస్తుంటారు. ఎయిర్ హోస్టెస్, బస్సుకండక్టర్, స్టెనో, టైపిస్టులుగ ఉద్యోగాలు నిర్వహిస్తుంటారు. ఈ పండుగలో వున్న ఇంకో విచిత్ర మేమంటే— ఏప్రియల్ నెలలో ఎక్కడా వర్షాలంటూ వుండవు. అయితే పై నెల రెండవ వారంలో ప్రారంభమయ్యే మూడు రోజుల ఉత్సవంలో ఏదో రోజు తప్పని సరిగా వర్షంకురుస్తుంది. ఒక వేళ అలా వర్షం పడకపోతే స్త్రీలంతా బారులు తీరి పెద్ద దేవాలయము (గబాయేసయా) దగ్గరకు వెళ్లి ప్రార్థనలు చేసి, జేగంట మోయిస్తారు. వెంటనే ఆకాశం మేఘావృతమై వర్షిస్తుంది.

తెలుగు సంస్కృతి—మాతృ భాషాభిమానం :

"ఏదేశమేగినా—ఎందుకాలిడినా పొగడరా నీతల్లి భూమి భారతిని..' అన్న రాయప్రోలు వారి సూక్త్యనుసారం— చుట్టూ ఎన్నో, జాతుల—భాషలూ ఉన్నా—మన తెలుగు వారు మాత్రం కన్న తల్లి లాంటి మాతృభాషను ఎన్నడూ విస్మరించ లేదు. "రెడ్డి యువజన సంఘం—వేమన పుస్తక భాండాగారం" అన్న పేరుతో ఒక గ్రంథాలయాన్ని నెలకొల్పారు. భారత దేశమునుంచి అనేక గ్రంథాల్ని రప్పించి తెలుగు భాషాపోషకు దేశంలో జీవం పోశారు. దానికి తోడు—జయభేరి, ప్రజావతి—కర్షక—తెలుగు బిడ్డ—ఆంధ్రమిత్ర,—తెలుగు వెలుగు మొదలైన దిన, వార, పక్ష మాస పత్రికలు వెలసి అక్కడి తెలుగు వారి సమైక్యకు—సాంస్కృతిక వికాసానికి ఎంతో కృషి చేస్తాయి. కాని రానురాను మిగిలిన పత్రికలన్నీ కాల గర్భంలో కలిసి పోయినా ఆరని జ్యోతిగా, "ఆంధ్రమిత్ర" దినపత్రిక మాత్రంనేటికీ బర్మా ఆంధ్రుల ఏకైక వాణిగా ప్రకాశిస్తోంది. రంగూన్ నగరంలో తెలుగు వారి కంటూ ఒక హైస్కూలు, దాదాపు ఒక వంద ఎలిమెంటరీ పాఠశాలలూ బర్మా అంతటా వున్నాయి. (ఇంకావుంది)

వైజ్ఞానిక గాథాశతి-48



ఒక రాజకుమారుడు అడవిలో ఒక రావి చెట్టు కింద కూర్చుని బ్రహ్మదేవుడి కోసం తపస్సు చేశాడట. ఆ చెట్టు మీద చిరకాలంగా వున్న ఒక బ్రహ్మరాక్షసి ఆయన గారి దీక్షకు మెచ్చి తన పని నిమిత్తము అతనికి ప్రత్యక్షమైనదట. వైజ్ఞానికులు ఒక సమస్యను తీర్చే ఉద్దేశంతో కృషి చేస్తూంటే వారికి ఇంకొక ఫలితము తారసిల్లుతుంది. పైన చెప్పిన రాజకుమారుడు లాగ మొదటలో వారు తాము అన్వేషించినట్టిదే లభించిందనుకుంటారు; ప్రకటిస్తారు కూడాను.

'ఎన్రికో ఫెర్మీ' యురేనియమునకు అవతలి రకాల పదార్థాన్ని కృత్రిమంగా నిర్మించే యత్నము చేసినప్పుడు అంతే జరిగింది. సృష్టిలో 92 రకాల మూలపదార్థాలున్నాయన్నారు రసాయనికులు. మూలపదార్థమంటే, విడగొట్టి రెండు వేరు పదార్థాలు తియ్యడానికి రాని ఒకే రకపు పదార్థము. బంగారమూ, వెండీ, రాగీ, బొగ్గూ, గంధకమూ, ఆక్సిజనూ, హైడ్రోజనూ మూలపదార్థాలు. వీటిని విడగొట్టి ఇలాంటి పదార్థాలు రెండింటిని తియ్యడానికి వీలుకాదు. నీరూ, ఇసుకా, సోడాగ్యాసూ వంటివి విడగొట్టితే (మళ్లీ ఇలాగ విడని) మూలపదార్థాలు వస్తాయి. కనుక అవి రసాయన సంయోగాలు, మూలపదార్థాలు కావు. మూలపదార్థాల రకాలు 92 ఉన్నాయి. అన్నిటి

అన్నిటి కంటే తేలికైన మూలపదార్థము హైడ్రోజను, ఉదజని అంటాము తెలుగులో. ఉదజనిని పల్చన చేసి దాని లోంచి పెద్ద ఒత్తిడిలో విద్యుత్ప్రవాహాన్ని పంపితే అది శకలములుగా విడింది. ఇవే ఎలక్ట్రానులూ ప్రోటానులూను. ఎలక్ట్రానుకు ఋణ (Negative) విద్యుదావేశమూ, ప్రోటానుకు ధన (Positive) విద్యుదావేశమూ ఉంటాయి. ఇవికాక న్యూట్రానులన్న తటస్థ (Neutral) కణాలూ ఉన్నాయి మూలపదార్థాల పరమాణువులలో. పరమాణువు సూర్యమండలము వలె వుంటుంది. కేంద్రంలో న్యూక్లియస (కేంద్రకమంటారు తెలుగులో) అన్న ప్రోటానూ న్యూట్రానుల ముద్ద వుంటుంది. ఉదజని పరమాణువులో ఒక ప్రోటానూ దానిచుట్టూ గ్రహమువలె తిరుగుతూ ఒకే ఎలక్ట్రానూ ఉంటుంది. కనుక ఆ పరమాణువుకి ఎలక్ట్రాను కక్ష్యకు చేరువున ఋణవిద్యుదావేశమున్నూ కేంద్రకము చేరువన ధనవిద్యుదావేశమూ వున్నా, మొత్తంగా చూచినప్పుడు ఆ రెండు విద్యుదావేశాలూ చేరికవల్ల చెల్లిపోయినట్టై పరమాణువు తటస్థ మవుతుంది. హీలియము అన్నది రెండో పరమాణువు. దాని కేంద్రకంలో రెండు ప్రోటానులూ రెండు న్యూట్రానులూ ఉంటాయి, మొత్తపు బరువు నాలుగు ప్రోటానుల బరువుకి సమానము

ఎలక్ట్రానులు. లిథియము తర్వాతి మూడో పరమాణువు. దీని కేంద్రకములో మూడు ప్రోటానులూ నాలుగు న్యూట్రానులూ వుంటాయి, బరువు 7—తిరిగే ఎలక్ట్రాను గ్రహములు మూడు. ఇలాగ 92వ పరమాణువు యురేనియమును చేరుకుంటే దానిలో కేంద్రకమందు 92 ప్రోటానులూ 146 న్యూట్రానులూన్నూ పైన 92 తిరిగే ఎలక్ట్రానులూ అవుతాయి.

ఫెర్మీ గొప్ప ఆలోచన చేశాడు. "పరమాణువుల వరుసలో పైకి వెళ్తున్న కొద్దీ, కేంద్రకంలోని న్యూట్రానులసంఖ్య బాగా పెరుగుతోంది కనక న్యూట్రానులను ధరించడమన్నది కేంద్రకానికి సహజ గుణము. అన్నిటికంటె ఎక్కువ న్యూట్రానుల సంఖ్య యురేనియముది. దాని పరమాణువుకి ఇంకా న్యూట్రానులను చేర్చడం సృష్టికి విరుద్ధమేమీ కాదు. అలాచేస్తే న్యూట్రానుల బరువు పెరిగి యురేనియ పరమాణువు, వరుసలో ఇంకొక మెట్టు పైకి ఎక్కి యురేనియమానంతర పరమాణువుగా తయారు కావచ్చును. తెలిసిన 92 పరమాణువులకు కొత్త పరమాణువులను చేర్చవచ్చును" అని ఈ ఊహా ప్రకారము యురేనియమును న్యూట్రానులతో కొట్టుతూ ప్రయోగించాడు.

యురేనియము అంటే మూడురకాల యురేనియముల కలగలపు. న్యూట్రానులతో కొట్టి చూసినప్పుడు థోరియమువంటి మూలకాలు కొన్నిటికి, వాటికి సహజంగా లేని రేడియో తీవ్రత అనే గుణము అలవడింది. యురేనియమును న్యూట్రానులతో కొట్టి చూచినప్పుడు దానిలో వున్న మూడు రకాల యురేనియములకూ చెందిన మూడు విధాల రేడియో తీవ్రతలకు తోడు నాలుగో కొత్త రేడియో తీవ్రత ఒకటి అదనంగా కనబడింది. ఇది యురేనియ జన్యమే కనక వింతగా కనపడలేదు, నాలుగోది వేరైనది కనక ఇంకొక మూలకాన్ని ధరింపించిందని, యురేనియానంతర మూలక నిర్మాణ యత్నము విజయవంతమైనదని అనుకున్నారు.

ఇటలీ దేశపు విక్టర్ ఇమాన్యువల్

వైజ్ఞానిక గాథాశతి


కార్బినో ప్రకటించాడు "కొత్తమూలకము, యురేనియానంతర మూలకము తయారు చేయబడింది" అని. ఇంతకుముందు ఇలాగే ఎందరో ప్రకటించారూ, అవేవీ కొత్తమూలకాలు కాకపోయాయి. కనుక కొందరు పెదవి విరిచారు. ఇతరులు ఈ మూలకానికి ఇటాలియమ్ అనిపేరు పెట్టమన్నారు.

వాస్తవానికి కొత్తమూలకము ఏర్పడలేదు. దానికి బదులు అంతకన్న వింత యురేనియ మూలక విచ్ఛేదము జరిగింది. దాని నుంచి ఏర్పడ్డ బేరియము యురేనియముతో పాటు మిగిలింది. ఇంతకుముందు పరమాణువులను ఆల్ఫాకణాలతో కొట్టి చూస్తే, కొట్టబడ్డ పరమాణు కేంద్రకాల నుంచి చిన్నచిన్న శకలాలు—ప్రోటానులు— ఊడడమూ, లిథియము పరమాణువు, మూడవది, రెండుముక్కలవడమూ విన్నారు, వైజ్ఞానికులు. యురేనియమంతటి పరమాణువు రెండు పెద్ద ముక్కలవడం చాలా వింత. కనక 1939 వ సంవత్సరము జనవరి ఆరవ తేదీని హాన్, స్ట్రాస్‌మన్ అన్న వైజ్ఞానికులు "యురేనియ పరమాణువు న్యూట్రానుు చేరికతో రెండు తునకలైనది" అని ప్రకటించినప్పుడు ప్రపంచమంతటా గొప్ప సంచలనము కలిగింది. అమెరికాలో ప్రొద్దుట సగము జరిగిన వైజ్ఞానిక సభ, ఈ ప్రకటన అంది, మధ్యాహ్నానికి హరించుకుపోయింది. అందరూ ఈ నిజము తేల్చుకోడానికి ప్రయోగశాలలకు వెళ్ళిపోయారు.

"అయితే, ఈ కథకు శీర్ష కేవిట్ అలాటిది పెట్టారూ" అని అడుగుతారు పాఠకులు. మనవి చేస్తున్నా, ఫెర్మి చేయ యత్నించినది బ్రహ్మదేవుడి పని, నవసృష్టి. తయారైనదేమిటి? పరమాణు విచ్ఛేదము. ఇలాగ జరిగిన విచ్ఛేదములో చిన్న శకలము శక్తిగా మారిపోయి పరమాణు శక్తి అన్న బ్రహ్మరాక్షసిని సృష్టించింది. అది హిరోషిమా, నగాసాకి నగరాలలో లక్ష మందిని మింగి తిన్నది. అయితే ఈ రాక్షసి ప్రత్యక్షమైనది ఫెర్మితపస్సుకి కాదు, అదే తేడా. ●

సీరియల్

కరుణ



కొండముది శ్రీరామచంద్రమూర్తి

జరిగిన కథ

జమదగ్ని భార్య శారదాంబ తన కుమారుడు ప్రసన్నతోబాటు విశ్వనాథంగారమ్మాయి కరుణను కూడా పెంచి పెద్దచేస్తుంది. పెద్దకుమారుడైన మన్మథను జమదగ్ని తమ్ముడు చలపతి పెంచుకుంటాడు. కరుణను మన్మథ చేసుకోవాలని జమదగ్ని కోరినా కరుణ ప్రసన్నలు ప్రేమించుకున్నందువల్ల ప్రసన్నకే ఇచ్చి చేయడానికి మన్మథ ఇష్టపడతాడు. ఇబ్బందుల్లో ఉన్న ఆ స్నేహితుని కొడుకు వీరభద్రానికి, తన కూతురు కళ్యాణినిచ్చి వివాహం జరిపించి సహాయపడాలనుకుంటాడు జమదగ్ని. ప్రసన్న కరుణకు వివాహం జరుగుతుంది. మన్మథ కూడా పై చదువుల చదవటానికి నిశ్చయించుకుంటాడు. చలపతి మన్మథను చదివించాలని పట్టుపట్టటంతో ప్రసన్న చదువు మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

16

ప్రసన్న కరుణను ప్రసన్నను చేసుకోవడానికి ఆమె చెప్పినట్లు చేయక తప్పింది కాదు. కాళ్లు కడుక్కుని హాల్లోకి వస్తూ "నువ్వు బయలుదేరడం ఎప్పుడు? రేపేనా?" అని అడిగాడు. పీటలు వేసి కంచాలు పెట్టడానికి వంటింట్లోకి వెళ్లబోతున్నది కరుణ. వంట యింటి గుమ్మం మీద కాలు వేసిన మనిషి అక్కడే ఆగి మెడ వోరగా వంచి భర్తను చూస్తూ "మీరు వచ్చేవరకు రేపు రాత్రికే మన ప్రయాణం అనుకున్నాను. ఇప్పుడే ఒక నిర్ణయానికి వచ్చాను. ఇహ మన చదువు వచ్చేయేటికే!" అన్నది. ప్రసన్న రెండంగల్లో ఆమెను సమీపించాడు. ఆమె బుజాలను పట్టుకుని కుదిపేస్తూ "అదేమిటి? ఎందుకని? ఎందుకువెళ్లవ్?" అని రెట్టించి అడిగాడు. కరుణ ఏదో సమాధానం చెప్పబోయింది లోపలకు వస్తున్న తండ్రిని చూచి ఆగిపోయింది.

విశ్వనాథం ఉస్సురని నిట్టూరుస్తూ "వానాకాలంలో కూడా ఎండలు ఎక్కువగానే వుంటాయి యివాళ!" అంటూ ఉత్తరీయం. పంకెన పడేసి ప్రసన్నను చూచి "సరి. నువ్విక్కడ వున్నావటయ్యా? నేను మీ ఇంటి నుంచే వస్తున్నాను." అన్నాడు ఫాను వేసుకుని దానికి ఎదురుగా కూచుంటూ.

"నేనిక్కడకు వచ్చాను." ప్రసన్న మెల్లగా సమాధానం చెప్పాడు.

"నాన్నారూ! ఇప్పటికే ఆలస్యమై పోయింది. ఇద్దరికీ వడ్డించ చేస్తున్నాను. కాళ్ళు కడుక్కోండి." కరుణ లోపలి నుంచే కేక వేసింది. విశ్వనాథం లేచి థావళి కట్టుకుంటూ "అబ్బాయ్! రేపు రాత్రే గామోసు ప్రయణం. అన్నీ సర్దుకున్నావా?" అని అడిగాడు.

మళ్లీ వ్యవహారమంతా మొదటికి వచ్చింది. తను ఎందుకు మానివేయవలసి వచ్చిందీ ఎవరి మీదా దోషారోపణ లేకుండా చెప్పవలసి వచ్చేసరికి తల్లప్రాణం తోకకు వచ్చింది. అంతా విన్న తర్వాత విశ్వనాథం నిట్టూర్చాడు. ముద్ద నోట్లో పెట్టుకోబోతున్నవాడల్లా ఆగి "నువ్వొక నిర్ణయానికి వచ్చేసినట్టేనా? లేక ఎవరైనా ఆదుకుంటామంటే నీ నిర్ణయం మార్చుకొనే అవకాశం వుందా?" అని అడిగాడు.

ప్రసన్నకు విశ్వనాథం మనసులోని ఉద్దేశ్యం అర్థమైంది. తనకు ఆయన సహాయం చేస్తానని దానికి దాపం. "లేదండి! ఆ అవకాశం లేదు. ఇది కొందరి మనస్తత్వాలతో కలిసిన సున్నితమైన చిక్కుసమస్య అయి పోయింది. విధిగా నేను చదువు లేకుండా ఇంట వుండితీరాలి."

"అయితే అమ్మాయి విషయమై ఏం ఆలోచించావ్?"

"ఆలోచించే దేముంది? అనుకొన్నట్టే కరుణ రేపు రాత్రికి బయల్దేరుతుంది. యం. ఏ. చదువుకొంటుంది." పులుసు గిన్నె చేతో పట్టుకు తీసుకొని వస్తున్న కరుణ వేడికి ఆ గిన్నెను కింద పెట్టేసింది. అది చూసి "అదేమిటి తల్లీ! ఏదన్నా కాయితం ముక్క పెట్టి పట్టుకోవద్దా?" అన్నాడు బాధపడుతూ.

"లేదులెండి నాన్నగారు! చెయ్యేం కాల లేదు. మీరు కంగారు పడకండి." తండ్రికి. ముక్కల గుజ్జు పులుసు వేస్తున్నది కరుణ. "మీరు కాస్త నిర్ణయం చేసుకోవాలి. కంగారు పడకుండా ఆలోచించాలి. ఏంలేదు నేను కూడా చదవడం మానుకుందామనుకొంటున్నాను."

ప్రసన్న చేతిలోంచి ముద్ద కంచంలోకి జారిపోయింది. విశ్వనాథం తలఎత్తి కూతురుగా వైపు చూశాడు. కరుణ అక్కడలేదు. పెరుగు తీసుకు రావడానికని వంట ఇంట్లోకి వెళ్లింది. వచ్చింతర్వాత అడిగాడు.

"కారణం ఏమిటి?"


"పెద్దగా కారణాలూ లేవు. ఆయన చదవకుండా నేను చదవడం నాకు ఇష్టం లేదు."

"కానీ నేను చదవకపోయినా నువ్వు చదవడమే నాకు ఇష్టం." ప్రసన్న కంఠంలో వేదన అంతర్వాహినిగా వుంది. కరుణ ఆమాట విని కూడా జవాబు చెప్పలేద

విశ్వనాథం కరుణను సమాధానం చెప్పమని
నిర్బంధించి అడగనూ లేదు.

కరుణ తాంబూలం ఇవ్వడానికి వచ్చి
నప్పుడు గదిలో వాలుకుర్చీలో పడుకొన్న
ప్రసన్న మళ్ళీ ఆ ప్రసక్తి తీసుకు వచ్చాడు.

ఠమ్మన్నాడు. అట్లాగే కరుణ భోంచేసిం
తర్వాత ఆమెతో అన్నాడు. "పిచ్చిదానా!
ఎందుకు నీకా పట్టుదల? నేను ఇంట్లో



కరుణ అతని నోటికి తాంబూలం అందిస్తూ
నిరాఖండిగా చెప్పింది.

"మీరిక్కడ ఇంట్లో! నేను అక్కడ
యూనివర్సిటీలో. నాకది చచ్చిన చావుగా
ఉంటుంది."

వుంటే ఖాళీగా కూచుంటాననుకొన్నావా?
ఏదో ఉద్యోగం చూసుకుంటాను. ఈ అను
భవాన్ని కూడా మనసులో నిల్పుకుని వచ్చే
యేడు యూనివర్సిటీకి వస్తాను లేకపోతే
ఆ పైఏడు నువ్వు యూనివర్సిటీలో

ఆ సంపాదనంలోంచి నీకు కొంత పంపిం
చడం నువ్వు బయటకు వచ్చేసిం తర్వాత
ఎక్కడో లెక్చరరుగా చేరి నీ జీతంలోంచి
కొంత నాకు పంపించడం. నిజానికి నిన్ను
నేనూ నన్ను నీవూ పోషించుకోగల అదృష్టం
కన్నా మరొకటి ఏముంటుంది? నేను
ఛాందసుణ్ణి కాదు కరుణా! తనకన్నా తన
భార్య ఎక్కువ స్థితిలో వుంటే సహించ
లేని మగమహారాజుల కోవలోని వాణ్ణి
కాను. సమానత్వం సౌశీల్యం సహనం
ఈ మూడు గుణాల మీదా సంసారం ఆధార
పడి వుందని నమ్మేవాణ్ణి. నువ్వు చదువు
కుంటేనే ఎక్కువగా సంతోషించేవాణ్ణి.
నువ్వు ఛాందసాలకు పోతే బాధపడేవాణ్ణి!
రాత్రి విశాఖపట్నానికి యూనివర్సిటీలో
చేరడానికి నువ్వు బయలుదేరడమే నేను
ఎక్కువ ఇష్టపడతాను. ఆతర్వాత నీ ఇష్టం."
అంతటి విశాలహృదయం గల భర్త లభించి
నందుకు కరుణ లోలోపల ఎంతగానో సం
తోషపడింది. ఆమె హృదయం ఆర్ద్ర
మైంది ఆమె కన్నులార్ద్రములైనాయి.
కృతజ్ఞత తలముక్కలు కాగా మెచ్చికోలు
భావం మనసు నాక్రమించుకోనగా ప్రసన్న
హృదయం మీద తల ఆనించి పడుకుని
"మీరు దేవతా గణానికి చెందినవారు. అంత
మంచివారు." అన్నది. ప్రసన్న ఆమెను
ముక్కుపట్టుకుని ఇంకా తనకు దగ్గరగా
తన పెదవులకు దగ్గరగా లాక్కున్నాడు.

"నువ్వు! రాక్షస గణానికా!?"

"ఉస్. నాన్నగారు."...

ఇద్దరు సర్దుకు కూచున్నారు. విశ్వనాథం
గదిలోకి వచ్చి చేతికర్ర తీసుకుంటూ "నేను
బ్యాంకీదాకా వెళ్ళి రావలసిన పని వున్నది
నాయనా. మరి వస్తాను." అని వెళ్ళి
పోయాడు.

"నేను కూడా వస్తానుండండి" ప్రసన్న,
కరుణకు కళ్ళతోనే వీడ్కోలు చెప్పి మామ
గారితో కలసి వచ్చేయబోతూ పెద్దగా
కరుణకు వినబడేటట్లు "యూనివర్సిటీకి
వెళ్ళడానికి మీ అమ్మాయి ఒప్పుకుంది
మాష్టారు! మీరింక ఆ ప్రయత్నాల్లో
వుండండి." అన్నాడు. అతని హెచ్చరిక
చూసి కరుణ నవ్వుకొని వీధి తలుపు గడియ
వేసుకుంది.

కలిసి నడిచి ఆతర్వాత ఎవరి దారిన వారు విడిపోయ్యారు. ప్రసన్న ఇంటికి వచ్చేసరికి శారదాంబ చాపవాల్చుకుని నిద్రపోతూ కన్పించింది. కళ్యాణి గదిలో ఎంబ్రాయిడరీ కుట్టుకొంటూ కన్పించింది. అన్నయ్యను చూసి లేచివచ్చి "అన్నంపెట్తా పద" అన్నది వంటింట్లోకి నడుస్తూ. ప్రసన్న కళ్యాణిని జడపట్టుకు గుంజి కుర్చీలో కుచోపెట్టి నోటితో మాట్లాడకుండా భోజనం చేశాను అన్నట్లు సంజ్ఞ చేసి చూపించాడు. "మామ గారింట్లోనేనా?" ప్రసన్న అవునన్నట్లుగా తలూపాడు. "అంతే అనుకున్నాంలే మేమందరమూనూ!"

ప్రసన్నకు మన్మథతో మాట్లాడాలనిపించింది. "పెద్దన్నయ్యేడీ?" అని కళ్యాణిని అడిగాడు.

"ఇక్కడెందుకుంటాడు ఆ కాటేజ్‌లో గాని"

ప్రసన్న ఆవిరిగడ్డి పాక దగ్గరకు వెళ్లాడు. లోపల్నుంచి మాటలు వినబడుతున్నాయి. కంఠస్వరాలను బట్టి చలపతి మన్మథా మాట్లాడుకొంటున్నట్టుగా వూహించుకొన్నాడు. ఆ కంఠాలు గుసగుసలుగా వున్నాయి.

"ఈ డబ్బు నీ దగ్గరుంచు నాయనా! ఎందుకైనా ఉపయోగపడుతుంది."

"పదిహేను వందలే! ఇంత డబ్బు మీ దగ్గరెక్కడిదండీ?"

"వెర్రి నాయనా! ఇటువంటి అవసరం వస్తుందని నాకు ముందే తెలుసు. అందుకనే చేనువాళ్లకు ఇవ్వకుండా ఆట్టే పెట్టాను."

"మళ్లీ వాళ్ళ నాన్నార్ని బాధపెడతారేమో?"

"బాధపెడితే ఆయన తంటాలు ఆయన పడుతాడు లెద్దూ! ప్రొద్దుటినుంచీ తిరుగుతున్నాడు నీకు డబ్బు కోసమని. ఎక్కడా దొరకలేదు. ఈ డబ్బు నేనూ ఇవ్వకపోతే నువ్వన్యాయం అయిపోవూ?" చలపతికి మన్మథమీద ప్రేమో తన తండ్రిమీద అలక్ష్యమో పూర్తిగా తెలీలేదు. ఏమైనా ఇదివరకటి తన బాబాయ్ కాడు ఆ మనిషి! ఆలోచించుకొంటూ అక్కడ నిలబడ్డ ప్రసన్నను డబ్బు లెక్కపెట్టుకుంటూ బయటికి వచ్చిన మన్మథ చూచి తెల్లబోయాడు. ప్రసన్నే చెయ్యిజాపాడు "రా అన్నయ్యా" అని. మన్మథ యాంత్రికంగా ముందుకు నడిచాడు. ప్రసన్న మన్మథ బుజం మీదుగా చెయ్యివేసి ముందుకు తీసుకు వెడుతూ "అన్నయ్యా! ఇక్కడ వుంటేనే నువ్వంతంత మాత్రం? అక్కడికి వెళ్తే ఇహ నన్ను పూర్తిగా మర్చిపోతావేమో!" అన్నాడు.

"మనుష్యుల్ని మర్చిపోవడం మన్మథకు చేతకాదు."

"ఇది ఏ నాటకంలో డైలాగన్నయ్యా?"

ఇద్దరు నవ్వుకున్నారు. వాతావరణం తేలికైంది. అన్నదమ్ములిద్దరూ లోపలకు వచ్చేసరికి జమదగ్ని శారదాంబతో మాటాడుతూ కన్పించాడు.

"ఏమిట్రా? భోజనానికి రాలేదు?" అని అడిగింది శారదాంబ ప్రసన్నను చూడగానే.

"అమ్మా! ఇంకా అన్నయ్యను ఇదివరకటి అన్నయ్యే అనుకుంటున్నావు గామోను. అదేంకాదు. కరుణ అన్నయ్యను తన కొంగుకు కట్టేసుకుంది."

"అవునవును. నువ్వు వీరభద్రాన్ని కట్టేసుకున్నట్టు."

"ఛీ పో." కళ్యాణి అవతలకు వెళ్లిపోయింది.

కొడుకు లిద్దర్నీ దగ్గరకు రమ్మనమని, చెరో ప్రక్కన కూచోపెట్టుకుని, "అనుకోకుండా మన ఇంట్లో పరిస్థితులు మారిపోయాయి. ప్రసన్నా, నిన్ను పై చదువులకు పంపించలేక పోతున్నందుకు నాకు చాలా బాధగా వుందిరా! ఈ ముసలివాడి మీద నీకు కోపంగా వుందికదూ? అన్నాడు."

"ఛీ, ఛీ, అట్లా అనుకోకండి మీరు. నాకు ఎవ్వరిమీదా కోపంలేదు. ఇవ్వాళ అన్నయ్య వెళుతున్నాడు. రేపు నేను వెళ్తాను. అంతే తేడా, ఇందులో బాధ పడవలసింది ఏముంది?"

"నీ మనసు నాకు తెలుసు తండ్రీ,"

ఉత్తరీయంతో కళ్లచివర జారుతున్న నీటి బిందువుల్ని తుడుచుకొంటూ 'మన్మథా, ప్రొద్దుటి నుంచి తిరిగాను. రెండొందల కన్నా దొరకలేదు. నీతమ్ముడి మామగార్ని అడుగుదామా అనుకొన్నాను. అభిమానం అడ్డువచ్చి వూరుకొన్నాను. ఈ రెండువందలు పట్టుకు వెళ్లు. వారం పదిరోజుల్లో ఇంకొంచెం డబ్బు పంపిస్తాను." మాటాపలుకు లేకుండా మన్మథ ఆ డబ్బు తీసుకొని వెళ్లిపోయాడు. మన్మథ అవతలకు వెళ్లిపోయిం తర్వాత, ప్రసన్న తను అంతకుముందు చూచిన విషయం చెప్పకుండా వుండలేకపోయాడు.

"భగవంతుడా! ఈ ప్రమాదమొకటి నామెడకు తీసుకొచ్చి పెట్టావా? ఆ కూలి వాళ్లతో అసలే వేగలేం."

"పెద్దవాడెందుకో మారిపోయినాడ్రా, ఆ పెంపుడు ఇవ్వకుండా వున్నా బావుండేది" అని నిట్టూర్చింది శారదాంబ.

* * *

రైలు కూత కూసి బయలుదేరబోతున్నది. ప్రపంచంలో వున్న తాపత్రయమంతా స్టేషన్లోనే గూడు కట్టుకొన్నట్టుగా కన్పిస్తున్నది. విశ్వనాథం పై బెర్తుమీద తుండుగుడ్డ పర్చి, క్రిందనే వున్న సీటుమీద హోల్డాలు పర్చి వచ్చి, కంపార్టుమెంటు గేటులో నిలబడి, క్రింద నిలబడ్డ వాళ్లతో మాట్లాడుతున్నాడు. కిటికీ దగ్గరగా నిల్చుని, కిటికీ వూచలకు అవతల వున్న కరుణతో అంటున్నాడు ప్రసన్న. "చూడు. మన వాళ్లింతమంది వస్తున్నారు. నువ్విట్లా విచారంగా వుండడం నాకు బావుండలేదు."

ఒక్కమాట మాట్లాడితే కన్నీరు కాల్వలై ప్రవహించేట్లుగా వున్నది ఆమె పరిస్థితి. విశ్వనాథం, జమదగ్నితో అంటున్నాడు. "నాకూ అక్కడే, అమ్మాయి దగ్గరే వుందామని వుంది కాని, ఈమాత్రానికి కొంపాగోడూ వదిలిపెట్టి వెళ్లిపోవడం అనవసరం అనిపిస్తోంది. దానికేం? ఎక్కడో అక్కడ, హాస్టల్లో వుంటుంది. పదిమంది మధ్యా కలసి చదువుకుంటుంది." మాటల ధోరణి ఆపి, ప్రసన్న వేపు చూచి, "కాకి చేత కబురు పంపితే రెక్కలు కట్టుకొ

వాళ్ళొంది? ఎక్కారేమో. చూసింది కిటికీ వేపు కళ్యాణి.

వీరభద్రాన్ని పంపించడానికి ఎవరూ రాలేదు. అతనొక్కడూ బిక్కుబిక్కుమంటూ వాళ్ళ దగ్గర నిల్చున్నాడు. మధ్యమధ్య, జమదగ్ని కల్పించుకుని ఆమాటా ఈమాటా మాట్లాడుతున్నాడు. "డబ్బు కోసం ఇబ్బంది పడకు. నాన్నపోయినా, నాన్నవంటి వాణ్ని నేనొకణ్ని ఇక్కడ వున్నానని జ్ఞాపకం వుంచుకో," మన్మథకు ఇవేమీ పట్టినట్టు లేదు. కళ్ళు మూసుకుని, ఓమూలకు చేరగిలబడ్డాడు. వీరభద్రం వేపు దొంగ దొంగగా చూస్తున్నది కళ్యాణి. రైలు మెల్లగా బయలుదేరుతుండగా, శారదాంబ పరుగెత్తుకుంటూ వచ్చింది. "ఓరేయ్, పెద్దవాడా, నీ కిష్టమని చేగోడీలు చేసి తీసుకొచ్చాను. తీసుకో, తీసుకో," మన్మథ ఉలిక్కిపడి, కళ్ళుతెరచి, కిటికీలో నుండి చెయ్యి బయటకు జాపాడు. రైలు వేగాన్ని పుంజుకుంటున్నప్పటికీ, రైలుతో పాటు పరుగెత్తి శారదాంబ ఆ చేగోడీల పొట్లం మన్మథకు అందించగలిగింది. "జాగర్త" "డబ్బు కోసం ఇబ్బంది పడకు." "వెళ్ళగానే ఉత్తరం రాయ్," "అబ్బాయీ, వీరభద్రాన్ని కాస్త కనిపెట్టి చూస్తుండు." "అందరూ కలిసే వుండండి." "బావగారు వీళ్ళ సంగతి కూడా కాస్త చూసిరండి." లాంటిమాటలు గాలిలో నుంచి వచ్చి వాళ్ళకు విన్పిస్తూ అంతకంతకు దూరమైపోతున్నాయి. మనుషుల రూపాలు మసకవుతున్నాయి. ప్రసన్న కనిపిస్తున్నంతవరకూ కరుణ కర్చీఫ్ వూపుతూనే వున్నది.

హడావిడి తగ్గింతర్వాత, మన్మథ తిరిగి తన పుస్తక ప్రపంచంలోకి వెళ్ళబోతూ అక్కడ కూచుని వున్న చలపతిని చూసి ఆశ్చర్యపోతూ, "అదేమిటి? ఇంటి దగ్గర్నుంచి ఎప్పుడు వచ్చారు? పెట్టెలో వుండి పోయారేం?" అంటూ అడిగాడు.

"కంగారు పడకు బాబూ, అందరూ నిన్ను సాగనంపడానికి వచ్చారా? ఒక్కణ్ని ఇంట్లో వుండలేకపోయాను. వచ్చే సరికల్లా రైలు కదులుతోందన్నారు. హడావిడిగా, పక్క స్టేషన్లో దిగిపోవచ్చు కదా అని, నీతో

కరుణ

మాట్లాడలేదే అని, పెట్టెలో ఎక్కేశాను జనంతో పాటు."

"మిమ్మల్ని చాలా శ్రమ పెట్టేశాను."

చలపతి, ఉత్తరీయంలో మూటగట్టిన జామపళ్లను తీసి "వస్తూ, వస్తూ, నీ కిష్టమని దారిలో కనబడితే కొనుకొచ్చాను. ఎవరికీ పెట్టకుండా నువ్వే తినాలి సుమా," అంటూ మన్మథ హ్యాండ్‌బ్యాగ్‌లో సర్దేశాడు వాటి నన్నింటినీ. పెట్టెలో వాళ్లంతా ఆయన వైపే చూడడం మొదలెట్టారు. ఆయన మాత్రం అది గమనించినట్లు లేదు. "నా ఆశలేమిటో నీకు తెలుసు, మళ్లీ భయంగా, భారంగా వున్నది, నువు దూరంగా వెళ్లిపోతున్నావంటే. రోజు విడిచి రోజు ఓ ఉత్తరం వ్రాయాలి సుమా, అందులో ఏం రాయద్దు. శ్రీరామ, నేను క్షేమం మీ క్షేమం తెలుపవలసింది. ఈ మూడు. మాటలూ నాకు చాలు." మన్మథ పుస్తకం ప్రక్కన పెట్టి, ఆయన చేతులు పట్టుకొని "ఉత్తరం నా దగ్గర నుండి రాకపోతే, నేను కులాసా అనుకోండి. ఉత్తరం రాశానంటే, ఏదో విశేషం వుందన్నమాట." అన్నాడు.

"పోనీ, డబ్బు కావలసి వచ్చినప్పుడైనా రాయి తండ్రీ,"

"అది తప్పదు కదా నాన్నగారూ,"

'నాన్నగారూ,' అన్న సంబోధం విని విశ్వనాథం ఉలిక్కిపడ్డాడు. కరుణ వైపు 'విన్నావటమ్మా,' అన్నట్టు అర్థవంతంగా చూశాడు. కరుణ తెలిసిందన్నట్టు తలాడించింది.

పెద్దస్టేషన్లో బండీ ఆగంగానే, చలపతి మెల్లగా దిగిపోయి, కమ్ములు పట్టుకు ఫ్లాట్‌ఫారం మీద నిలబడ్డాడు. "ఇంక వెళ్లి రండి మీరు. ఇప్పటికే ప్రొద్దుబోయింది."

"వెళ్లి మాత్రం చేసేదేమిటిలే నాయనా, ఇంటికి వెళ్తే, మళ్లీ ఒక్కణ్నే బిక్కు బిక్కుమంటూ, నిన్ను గూర్చి తల్చుకొంటూ కూచోవలసిందే కదా, బండిని వెళ్లనిచ్చే వెళ్తాన్లే"

రైలుబండి అలసట దీర్చుకుని బయలు దేరేవరకూ ఆయన అక్కడే నిలబడ్డాడు.

మనసులో వున్న వ్యధనంతా వొలకబోశాడు బండి కదిలింతర్వాత, వంటరిగా, దిగులుగా వెనక దిగడిపోయిన ఆ ముసలివాణ్ని చూసి మన్మథకు చెప్పలేని జాలి వేసింది. వీరభద్రం, మన్మథ దగ్గరకు వచ్చి కూచున్నాడు. "బావగారూ, ఏమన్నా సినిమా పత్రికలుంటే 'ఇటూ' పడెయ్యండి" అని అడిగాడు.

మన్మథ పెదివి విరిచాడు. "బ్రార్ద్వా శ్రమంలో సినిమాలు చూసేవాణ్ని. అపుడు కొనేవాణ్ని అడపాదడపా. ఇప్పుడు మానేశాను."

"పోనీ, కథల పుస్తకా లేమైనా వున్నాయా?"

"లేదు. జామకాయ లున్నాయి. తీసుకోండి."

కరుణ, విశ్వనాథం నవ్వారు. వీరభద్రం సిగ్గుపడ్డాడు. "అవి మీ నాన్నగారు మిమ్మల్ని తినమన్నారుగా?"

"అని ఆయనఅన్నమాటనిజమే. అట్లాగే నేను చేయాలని ఎక్కడుంది బావగారూ?" మన్మథ, బలవంతంగా ఓ రెండుపళ్లను వీరభద్రానికిచ్చి,మరో రెండు విశ్వనాథానికి ఇచ్చి, కరుణకు ఇయ్యబోయి, చెయ్యిజాపి, సందేహించి చెయ్యి వెనక్కు తీసుకున్నాడు. కరుణకు అతని సందేహం అర్థమైంది."బంతిలో బలపక్షం చేయడం మంచిది కాదు బావగారూ!" అన్నది తానే చొరవ తీసుకుంటూ, మన్మథ, ఆమె కివ్వమని, ఓ రెండు ముగ్గిన జామపళ్ళు విశ్వనాథం చేతికియ్యబోయాడు.

"నేనేం పళ్ళు తేనిదాన్నికాదు. దోర కాయలంటేనే నాకు ఇష్టం." మన్మథ తన దగ్గర వున్న పళ్లన్నీ ఆమె ముందుకు తోసి "ఇష్టమైనవి ఏరుకోవచ్చు."అన్నాడు.

వీరభద్రం తన కిచ్చిన రెండుపళ్ళూ తినేసి ఇంకొకటి తీసుకుందునా వద్దా అని ఆలోచిస్తున్నాడు. అతని ఆలోచన గ్రహించి "బావగారు హామ్లెట్ స్వగతం చదువుతున్నారా?" అని అడిగాడు మన్మథ. వీరభద్రం తెల్లమొహం వేయవలసి వచ్చింది. "హామ్లెట్ ఎవరు?" విశ్వనాథానికి ఆశ్చర్య వాడు విశాఖపట్నం దాకా రావడం అనవసరం

అనిపించింది. "ఏ కోర్సులో చేరుతున్నావ్ నాయనా?" అని అడిగాడు అసలు సంగతి తెల్సుకుందామని.

"హిష్టరీ యం. ఏలో చేరుదామనుకొంటున్నానండి."

"హిష్టరీ కొందరి హిష్టరీలనే మార్చేసింది. నీ స్టోరీని మార్చవచ్చు. మంచిదే నాయనా! అదే చదువు." అన్నాడు—జామపండు ముక్కలుగా చాకుపెట్టి కోసుకుంటూ తన తండ్రి తింటున్న జామపండుకేసి ఆశగా చూస్తున్న వీరభద్రం కేసి "అన్నగారూ! మరో కాయ తీసుకోండి." అంటూ అతనికో జామకాయ నందించింది కరుణ.

"కంగ్రాచ్యులేషన్స్" వీరభద్రం జామకాయ నందుకుని మళ్ళీ మన్మథ కూచున్న చోటికి వచ్చాడు. కంగ్రాచ్యులేషన్స్ అన్న మాట విని కరుణ తెల్లబోయింది. విశ్వనాథానికి నవ్వు నాపుకోవలసి వచ్చింది. మన్మథ అతనితో గుసగుసలుగా అన్నాడు. "కంగ్రాచ్యులేషన్ అన్నారేమిటి బావగారూ?"

"అవును. జామకాయ తీసుకున్నాంగా అందుకని!"

"అప్పుడు థ్యాంక్స్ అనాలి. కంగ్రాచ్యులేషన్స్ అనికాదు. కంగ్రాచ్యులేషన్, అంటే అభినందనలు. థ్యాంక్స్ అంటే కృతజ్ఞతలు. ఎవరన్నా మనకేదన్నా ఇచ్చినప్పుడు గానీ సహాయం చేసినప్పుడు గానీ కృతజ్ఞతలు చెప్పుకోవాలి అభినందనలుకాదు."

వీరభద్రం వంచిన తల ఎత్తలేదు. కరుణ వైపు చూడడానికే భయం వేసింది. బెడ్ మీదకు వెళ్ళి కూచుని ఆరోజు పేపరు పక్కవాళ్ళ దగ్గర తీసుకొని చూడడం ప్రారంభించాడు. కిటికీలో నుండి ఉండివుండి గాలి బలంగా వీస్తోంది. చెట్లూ చేమలూ పుట్టలూ గుట్టలూ నదీనదాలూ భూతకాలంలోకి పరుగెత్తుతున్నాయి. వెన్నెల కిరణం వచ్చినట్లే వచ్చి వెనక్కు జారిపోతోంది.

వీరభద్రం వంటరితనం చూసి కరుణకు జాలి కల్గింది. "అన్నగారూ! ఏవో పుస్తకాలు కావాలన్నారు ఇందాక. ఇవ్వనా?"

"ఇవ్వండి" వీరభద్రం బలహీనంగా జవాబు చెప్పాడు.

"నవలలు ఇయ్యమ బారా? జేన్

"అబ్బెబ్బే! వాడు బాగా రాయడరేజీ! నాకు నచ్చు."

"వాడు కాదండీ! ఆవిడ...."

వీరభద్రానికి మొహమంతా ఎర్రబడిపోయింది. "అంటే ఏమిటి మీ ఉద్దేశ్యం? నాకేం తెలీదనేగా? నేను వాడి పుస్తకాలు ఎన్ని చదివాను? బావగారూ ఇంతే మీరూ ఇంతే. ఇందాకట్నుంచి చూస్తున్నాను. నన్నో చిన్నపిల్లాడి కింద అడించడం..."

విశ్వనాథం కళ్లు మూసుకొని నిద్ర కుప్రకమిస్తున్న వాడల్లా వీరభద్రం పెద్దగా మాట్లాడడం విని కళ్ళు తెరిచి అసలు సంగతి గ్రహించాడు. "లేదులే నాయనా అమ్మాయికి తెలీదు. ఉరుకో! దాన్ని నేను కోపపడతానుగా?"


మన్మథకు వీరభద్రాన్ని చూసిన కొద్దీ అసహ్యం వేస్తున్నది. ఇతనిలో ఏమి సుగుణం చూసి తన తండ్రి ఇతన్ని వరించాడో అతనికి అర్థం కాలేదు. వీరభద్రం ఉత్త తిండిపోతు, తెలివి తక్కువవాడు, కోపిష్టి అని తెలుసుకో లేకపోయాడాయన. అనుకున్నాడు. వీరభద్రం కొంతసేపటికి నిద్ర పోవడం చూసి "మొహం మీద ఎప్పుడూ నిజం చెప్పకూడదమ్మా? ఆ షాక్‌కి మానపుడు తట్టుకోలేడు." అన్నాడు.

"అవును నాన్నారూ! నాదే పొరపాటు. పాపం కళ్యాణి దురదృష్టం" అని నిట్టూర్చింది. రాత్రల్లా ప్రయాణం చేసిచేసి

తెల్లవారు ఝాముకు ఆ బండి వాల్తేరు స్టేషను చేరుకుంది. ఎవరి తొందర వారిదే అన్నట్లుగా దిగిపోతున్నారు. తూర్పుదిక్కు నుండి అలముకొంటున్న వెలుగు చూసి కాకులు కంతాలు సవరించుకొంటున్నాయి. వాల్తేరు స్టేషను క్రొత్త పెళ్ళికూతుర్లా పెళ్ళి మంటపంలా రాజకీయసభలా రంగుల ప్రపంచంలా కనిపిస్తోంది.

నిద్ర బద్ధకం వదిలించుకొని వీరభద్రం పెట్టె బెడ్డింగు తీసుకొని ముందుగా కిందకు దిగాడు. వీరభద్రానికి వెనగ్గా మన్మథ తన సామానులతో దిగాడు. పెట్టె అంతా ఖాళీ అయిందాకా వుండి అప్పుడు మెల్లగా కరుణను తీసుకొని విశ్వనాథం క్రిందకు దిగి కూలీ కోసం కేకవేశాడు.

"కూలీ ఎందుకు? మన సామాన్లు మనమే మోసుకుందాం పట్టండి." మన్మథ చొరవగా వాళ్ళ పెట్టెలు కూడా క్రిందకు దించాడు. వీరభద్రం కల్పించుకోకుండా చూస్తూ వూరుకున్నాడు. మన్మథ ఒక చేత్తో పెట్టె మరోచేత్తో హోల్డాలూ పట్టుకున్నాడు. సూటుకేస్ పట్టుకున్న చేతికే హాండ్‌బ్యాగ్ తగిలించాడు. అతన్ని చూస్తున్న కొద్దీ విశ్వనాథానికి ఆశ్చర్యం వేస్తున్నది. "ఏమిటీ కుర్రవాడు? మిగిలిన వాళ్ళకన్న భిన్నమైన వ్యక్తిలా కన్పిస్తున్నాడు!" అనుకొని తనో చేత్తో తన సామాన్లు పట్టుకుని నడవబోయాడు. కరుణ కరుణ తను కూడా నంటూ చిన్నచిన్న



సామాన్లు పెట్టిన ప్లాస్టిక్ బకెట్ మరి కెంబా తీసుకొని ముందు నడవబోయింది. మన్మథ ఆమెకు అడ్డంవచ్చి విశ్వనాథం వేపు చూస్తూ అన్నాడు. "పెద్దవాళ్లు మీరు వీటిని మోయడం నాకు ఇష్టం లేదు. అక్కడ పెట్టండి. నేను వీట్ని బయట పెట్టించి మళ్లీ వస్తాను."

"ఫర్వాలేదు నాయనా ఇంకా ఆ చేతులు అంత బలహీనం కాలేదు."

"బావా! నీ సామాన్లు తీసుకో! బయటకు పోదాం."

వీరభద్రం సామాన్లు తీసుకోలేదు. కూలీని కేక వేశాడు. బేరం చేయడానికైనా బద్ధకమున్నట్లుగా అతని నెత్తిన సామాన్లు పెట్టి "పదండి" అన్నాడు. నడుస్తూ "నా కిటువంటి పన్లు అలవాటులేవు" అన్నాడు మన్మథను ఉద్దేశించి విశ్వనాథానికి వినబడాలని. మన్మథ మాట్లాడలేదు. అతని కళ్లలో కన్పించిన తీక్ష్ణతనూ తిరస్కారభావాన్నీ వీరభద్రం గమనించలేదు. సామాన్లు, మనుషులూ స్టేషను బయటకు చేరింతర్వాత విశ్వనాథం మిగిలిన ఇద్దర్నీ చూస్తూ అడిగాడు. "నేనూ ప్రొఫెసర్ నీలకంఠంగారు స్నేహితులం. అక్కడకు వెళ్దామా మనం?"

"ఐయామ్ సారీ! హాస్టల్లో సీటొచ్చే వరకూ ఎక్కడన్నా హోటల్లో వుంటాను" మన్మథ అణకువతో జవాబిచ్చాడు. "నువ్వు సరే. మరి వీరభద్రం?"

"ఈ ఊరినిండా నాకు స్నేహితులే! ఎక్కడో అక్కడ వుంటాను కొంతకాలం పాటు."

"కాదు. మనిద్దరం కలిసి వుందాం." మన్మథ అడిగాడు.

"అట్లా అయితే మీరు నాతో పాటే రండి. నా స్నేహితుల దగ్గరకు తీసుకు వెళ్తాను."

"వద్దు వీరభద్రం! మనం ఎవరికీ భారంగా వుండకూడదు. ఒకరి సహాయాన్ని విధిలేకపోతే తప్ప అనుసరించకూడదు. నామాట విను. ఇద్దరం కొంతకాలంపాటు ఏదన్నా హోటల్లో వుందాం." మన్మథ కంఠంలో వీరభద్రం అసహాయకుడన్న అభిమానం ద్యోతకమైంది.

"ఉహూ! నేనట్లా వుండలేను."

కరుణ

వీరభద్రం టాక్సీని కేకవేసి సామాన్లు అందులో పెట్టించి "మహారాణిపేట పోనీ!" అన్నాడు. అంటూ ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా ఆగి "సాయంత్రం వచ్చి కలుస్తాను ఏ హోటల్లో ఉంటావ్?" అని మన్మథను ప్రశ్నించాడు.

"తెలీదు. నీ అడ్రస్ చెప్పు!"

"ఒక ఫ్రెండయితేగా ఎడ్రస్ చెప్పడానికి? పోనీలే నీలకంఠం గారింటికి వస్తాను రేపు పొద్దున్నో సాయంకాలమో! అక్కడే మనం కలుద్దాం."

వీరభద్రం టాక్సీ ఎక్కి వెళ్లిపోయాడు. అతని తొందరపాటుతనానికీ అమాయకత్వానికీ తెల్లబోయి నిలబడిపోయారు మిగిలిన ముగ్గురూనూ అక్కడ. టాక్సీ వెళ్లిపోయిన వైపే చూస్తూ చేష్టలు దక్కి నిలబడ్డ మన్మథను చూస్తూ కరుణ అన్నది.

"ఆయన వెళ్లిపోయాడు బావగారూ!"

మన్మథ ప్రకృతంలోకి వచ్చాడు. "అవును! వెళ్లిపోయాడు!" అన్నాడు నిట్టూరుస్తూ.

"ఏం నాయనా! మరి మేం వెళ్లిరామా?" విశ్వనాథం అడిగాడు చుట్టూ మూగిన రిక్షావాళ్లను టాక్సీ డ్రైవర్లనుచూస్తూ.

"ఊఁ! వెళ్లిరండి. నేనూ ఏదోహోటలు వెతుక్కుంటాను." అన్నాడు మన్మథ నీరసంగా.

"అమ్మాయి ప్రక్కన లేకపోతే తప్పకుండా నేను హోటల్లోనే దిగేవాణ్ని నాయనా!"

మన్మథ వేపు చూస్తూ అన్నది కరుణ. "చూశారా! ఆడవాళ్లు మగవాళ్ల కాళ్లకు ఎట్లా బంధాలేస్తారో. అన్నగాని తండ్రిగానీ తప్పించుకోవడం కష్టం."

"అట్లా తప్పించుకోకుండా వుండడంలోనే సుఖం వుందమ్మా! "విశ్వనాథం జవాబుగా అని సామాన్లన్నీ టాక్సీలో పెట్టించి నిన్ను డ్రాప్ చేసి వెళ్తాం. రారాదూ? ఎక్కడో చెప్పు?" అన్నాడు.


"వద్దండీ! నేను రిక్షాలో వెళతాను."

టాక్సీ బయలుదేరబోతున్నదనగా అడిగింది కరుణ. "నీలకంఠం గారింట్లో రేపొద్దున్న మీ బావగారు అపాయింట్మెంటు ఇచ్చారు. జ్ఞాపకం వుంచుకుంటారుగా?"

"తప్పకుండాను."

"వస్తాం నాయనా!" అంటున్న విశ్వనాథం మాటలు టాక్సీ చక్రాల శబ్దంలో కలిసిపోయాయి. ఆ తెల్లవారుఝామున ఎవరిదారిన వార్ని పంపించి అట్లా ఒంటరిగా నిలబడిపోయాడు మన్మథ, వాల్తేరు స్టేషను బయట.

(సశేషం



అప్పుడే వెళ్ళొద్దురా బాబూ అంటే విన్నావా? నేనింతా ఆఫీసుపని పూర్తి చేయలేక ఇంటికి తీసుకొ చేస్తాం టే, నువ్వు ఇంటిపని పూర్తి కాక ఆఫీసుకు పట్టుకొచ్చి పూర్తి చేస్తున్నావ్...ప్...హాలియే సంచేస

మానవుడా! జయించేవు

ప్రభంజనం



అమావాస్య రాత్రి 9 గంటలయింది. కాలాంజనం వెదజల్లినట్లు కోలాహలం వర్షిస్తున్నట్లు చిక్కటి చీకటి. నారాయణమ్మ చేతిలో లాంతరుతో వీధి అరుగు మీద నిలబడి కళ్ళల్లో వత్తులు పెట్టుకొని ఎదురు చూస్తున్నది. శ్రమతో నోము హాటించుకుంటూ పెట్టదరికి వచ్చిన కాంతయ్యను ఆత్రంగా అడిగింది.

'సత్తి బాబేడండీ?'

మొదటి మెట్టుపై మోపిన కాలు నెత్తకుండానే నిలబడిపోయ్యాడు కాంతయ్య.

"ఇంకా రాలేదూ' పొద్దువాలగానే పంపేశానే" అన్నాడు తమాయించుకొని. నారాయణమ్మ చేతిలో లాంతరు జారిపోయింది. మొదలునరికిన చెట్టులా కూలబడిపోయింది. అప్పటి వరకూ గుట్టుగా భర్త వెంట వస్తాడనే ఆశను ఆలంబనం చేసుకొని తొక్కిపట్టి ఉంచిన దుఃఖం పెల్లుబికింది. ఒక్కసారిగా గొల్లుమంది. కాంతయ్యకు కంగారుతో మతిపోయింది. రెండు నిముషాల వరకూ కాలు కదపలేదు. పెదవి మెదపలేదు. ఈలోగా పక్కింటి దంపతులు సీతమ్మా, గోపయ్యా లాంతరు పట్టుకొని 'ఏంట్రా' అంటూ హడావుడిగా వచ్చారు.

"అదేమిరా కాంతయ్యా. ఏమైంది" అడిగాడు గోపయ్య. నారాయణమ్మ మరింత బావురుమంది.

"మా సత్తిబాబు మధ్యాహ్నం ఏటవతలికి నాకు అన్నం తెచ్చాడు. పొద్దువాలేటప్పుడే వాణ్ణి పంపేశాను. ఇంటికింకా రాలేదు."

"వాడెక్కడా పెత్తనాలు కూడా చెయ్యడు గదయ్యా. ఎక్కడకు వెళ్ళినట్టున్నా, రోజూ వెలుగుండగానే వచ్చేస్తున్నాడే" అంది సీతమ్మ.

"మరేనమ్మాయ్. వాడెక్కడికీ వెళ్ళడు సీతమ్మక్కాయ్. ఎప్పుడూ ఇంత రాత్రి దాకా ఉండలేదు బాబోయ్" నారాయణమ్మ హడలిపోతున్నది.

"ఒకవేళ అలా రెండడుగుల కొత్తూరు పెద్దమ్మ గారింటికిగాని పోయాడేమో" సీతమ్మ అందించింది.

దీనితో కాంతయ్యా కొంత నిబ్బరం చేసుకున్నాడు. మునిగిపోతున్న వాడికి గడ్డిపరక సైతం మహా మేరువు. కావచ్చునేమోనని కాంతయ్యకు కొంచెం ధైర్యం కలిగింది.

"అలా వెళ్లడమ్మోయ్. ఒకరు దగ్గరుండి బలవంతాన తీసుకెళ్లితే గాని కొత్తూరు వెళ్లడక్కోయ్. నా కొడుకోయ్. నా సత్తి బాబోయ్" నారాయణమ్మ గుండె బాదుకొంది. సత్తిబాబు తత్వం తల్లికి పూర్తిగా తెలుసు. ఆమె గోలతో కాంతయ్యకు అసలు పాలుపోవడంలేదు. అయినా ఏమనడానికీ సాహసం చాలడంలేదు. లోలోన కాంతయ్యకూ అంతంతగానే ఉంది.

"ఏరే పాటిగా ఉందేంరా కాంతయ్యా" గోపయ్య అడిగాడు.

"ఏమీ రూరుకుందురూ ఓ క్షణం ఏ మాట ఎప్పుడనాలో కూడా తెలీదు. బొత్తిగాను." సీతమ్మ గోపయ్య వంక చూసి కస్సుమంది. గోపయ్య నాలుక కొరుక్కున్నాడు. నారాయణమ్మ శోకం దీనితో పూర్తిగా కట్టలుతెంచుకొంది. పైకి తేలడం లేదుగానీ తొలినుండీ ఆమెనీ అనుమానమే రంపాన పెడుతున్నది. పదిమందీ పోగయ్యారు. అర్థాలు, సమాధానాలతో అలజడి ప్రారంభమైంది. కాంతయ్య గుండెలో భయం గుబులుకొంది. కంగారు పట్టుకొంది. నిబ్బరం సడలిపోతున్నది. మాట్లాడిన ఒకటి రెండు మాటలూ తడబడిపోయాయి.

"ఒరే కాంతయ్యా, వూరికే అలా కంగారు పడిపోతావేమిరా. ఆ లాంతరుచ్చుకో. దొరయ గారి పొలందాకా వెళ్లివద్దాం"

"ఒరే రాజూ, నువ్వూ రెడ్డి కొత్తూరు పోయిరండి"

"నువ్వుండమ్మా నారాయణమ్మా. ఎక్కడికి పోతాడు. కొత్తూరే పోయుంటాడు. ఏమీ లేనిదానికి అలా హడలిపోతావేంటి."

చేతిలో లాంతర్లతో సూరయ్యా, కాంతయ్యా సహా యిద్దరూ పొలం వేపు వెళ్లారు. రాజూ, రెడ్డీ కొత్తూరుకు అడ్డదోవ తొక్కారు.

వూరికి సుమారు రెండు మైళ్లల్లో ఏటికి ఆవల పొలం దమ్ము చేయిస్తున్న కాంతయ్యకు [illegible] పట్టుకెళ్లిన సత్తిబాబు ఏమయ్యాడో గాని ఇంటి కింకా రాలేదు. సత్తిబాబు కాంతయ్యకు ఒక్కగా నొక్క కొడుకు. నారాయణమ్మ పది సంవత్సరాలు వెయ్యి వ్రతాలూ, యాత్రలూ చేస్తే సర్వేశ్వరుడు ఒక అమాయకుణ్ణి, అర్భకుణ్ణి ఆ దంపతులకు ప్రసాదించాడు. అవుగాక. మండు టెండారితో దాహంతో ప్రాణం కడబట్టిపోతున్న బాటసారులకు చలి చెలమ కనుపించింది. కన్ను పొడుచుకొన్నా కాని రాని అంధకారంలో అడుగు తీసి అడుగు వెయ్యలేక తడుముకొంటున్న వారికి చేతికి దీపం అందింది. ఒక్కగా నొక్కడవడం, కావక కన్న వాడవడం చేత వాణ్ణి అపురూపంగా అరచేతుల్లో పెంచుతున్నారు. పద్నాలుగేండ్ల సత్తిబాబెంత అమాయకుడో అంత అభిమాని. ఎంత అర్భకుడో అంత పౌరుషం, పట్టుదలా గలవాడు. వేళాకోళానికైనా ఎవరేమన్నా వెర్రికోపంతో విరుచుక పడిపోతాడు. పట్టుక పట్టుక దేనికైనా పట్టుబట్టాడో దాని అంతు తేల్చకుండా వదలిపెట్టడు. తల్లి తండ్రులైనా వాడి విషయంలో జాగ్రత్తగా ఉండవలసిందే. తోటివారితోనైనా చేరడు. ఎవరేనా పల్కరిస్తే ముక్తసరిగా సమాధానం తప్ప తానై ఎప్పుడూ మాట్లాడడు. వాడికి యింటి నుండి చేలోకి, చేను నుండి యింటికి మాత్రమే సరిగా దారి తెలుసు. మరో చోటికి ఎక్కడకు వెళ్లాలన్నా తల్లి బుజ్జగింపూ, తండ్రి పనుపూ, రెండోవాడితోడూ కావాలి. విచిత్రమైన, విలక్షణమైన వ్యక్తిత్వం వాడిలో రూపు దిద్దుకొంటున్నది.

కాంతయ్యా, సూరయ్యా పొలిమేర దాటి పదిగజాలు వెళ్లారు. ఎదురుగా ఒక మనిషిని బుజాన వేసుకొని దొరయ్యగారి పెద పాలేరు గంగన్నా, ఆ వెనుక దొరయ్యా, వారి ఉద్ధారుడు నరసన్నా తలలు దించి వస్తున్నారు. అందరినీ ఆనవాలు పట్టాడు సూరయ్య. గంగన్నను దగ్గరకు రానిచ్చి చేతిలో లాంతరు గంగన్న భుజం మీద ఉన్న మనిషి మీదికి ఎత్తి పట్టుకొని 'వీరెవరు దొరయ్యా బావా' అని అడిగాడు సూరయ్య.

"సుబ్బారావు బావా" అన్నాడు దొరయ్య కంఠంలో దిగులు తొణికింది.

"ఇదేం బావా" ఆశ్చర్యంగా అడిగాడు సూరయ్య.

"ఇదో కర్మమండి. సూరయ్య బావు గారూ" గంగన్న సమాధానం చెప్పాడు.

"అసలేం జరిగింది బావా"

"అవు. అదే మా పెద్దావు లేదూ, తెగ బలిసి పొడి చేసిందట" దొరయ్య మాటల్లో పెద్దావుమీద కసి కళకళ్లాడిపోయింది.

"ఏమా పెద్దావా! సుబ్బారావును పొడి చేసిందా! అసలేంటో వివరంగా చెప్పు" చాలా వింత విషయం విన్నవాడిలా విస్తుపోయాడు సూరయ్య.

"ఒకగంట కింద పేట చేలోంచి వచ్చి సుబ్బారావు కోసం అడిగితే మధ్యాహ్నం పెద్దావును తోలుకొని పాల పొలం వెళ్లాడని అవు వచ్చి చాలా సేపయినా సుబ్బారావు రాలేదనీ మా చెల్లి చెప్పింది. ఇదేమిటాని నేనూ, గంగన్నా, నరసన్నా పొల దగ్గర కెళ్లాం. మేం వెళ్లేటప్పటికి పొల వంచతో పడి ఉన్నాడు సుబ్బారావు కదలా మెదలకుండా. 'ఏంరా' అంటే 'పెద్దావు పెద్దావు'అన్నాడు. సూద్దుంగదా పళ్లంతా కుమ్మి పారేసింది. మాట్లాడలేకపోతుంటేనే. మనిషి యిప్పుడు అంత మనలో లేడనుకో" దొరయ్య వివరించాడు.

సూరయ్య నోరు తెరుచుకొని వింటున్నాడు. సుబ్బారావు మెల్లగా మూలిగాడు.

"పెద్దావంటే మీకోడలు పుట్టింటోరు తోలిపెట్టింది గదూ, అది ఉట్టి సత్తిగోవు కద బావా"

సుబ్బారావు కదిలాడు. బాధగా మూలిగాడు.

"దానికేం పోగాలం వచ్చిందయ్యా. ఇదేదో చిత్రంగా ఉందే. అయితే మరేం ప్రమాదం లేదుగదా"

"సిత్రం ఏంటి బాబూ. మా సిత్రంగా ఉంటేనూ. మరేం పెమాదంనేదులెండి" గంగన్నకూ ఈ విషయం చాలా విడ్డూరంగానే ఉంది మరి.

"నువ్వెందాకా. లాంతరుచ్చుకొని బయల్దేరావు" దొరయ్య అడిగాడు.

"తొలెల్లి మద్దెలతో మొర్రెట్టు ప్రవ

మానవుడా జయం నీకు

చెప్పుతారు చూసావూ కాంతయ్యగారి సత్తిబాబు మధ్యాహ్నం వీడికి భోజనం పట్టుకెళ్లి యింకా తిరిగి రాలేదు. పొద్దువాలగానే పంపించేసాడట కాంతయ్య. అలా మీ పొల దాకా పోయివద్దామనీ'' అన్నాడు సూరయ్య.

గంగన్న భుజం మీద ఉన్న సుబ్బారావు గంగన్న మెడను గట్టిగా పెనవేసుకొన్నాడు. గంగన్నకు ఒక క్షణం ఉపిరాడలేదు.

''సరిసరి. వాడెక్కడా కనిపించలేదే. అయినా వెళ్ళిరండి'' దొరయ్య ముందుకు సాగాడు. గంగన్నా, నరసన్నా అనుసరించారు. సుబ్బారావుకు ఉపిరాడింది.

దొరయ్యా, కాంతయ్యా ఆ గ్రామంలో పంచాయతీ ఎన్నికలైన దగ్గర్నుండీ మాట్లాడకోవటంలేదు. అంతవరకూ వారిద్దరూ కృష్ణార్జునులు. ఇటు స్నేహితుడూ, మోతుబరీ ఐన దొరయ్యకు చేయూత నివ్వలేక అటు వదినెగారి కొడుకు తన భాగ్యానికి మూలకారకుడూ అయిన కృష్ణమూర్తిని సముదాయించనూలేక సతమతమై చివరకు ఇరువురకూ కాకుండా మధ్య నిలబడిపోయాడు కాంతయ్య. అది చాలు కృష్ణమూర్తికి. అధ్యక్షపీఠం అలంకరించాడు. కృష్ణమూర్తి మీదికంటె కాంతయ్య మీదనే వైరం పెంచుకొన్నాడు దొరయ్య. ఈ సాకుతో గ్రామం దగ్ధమైపోయింది. నాటి నుండీ దొరయ్య యింటి మీద కాకి కాంతయ్య ఇంటిమీద వాలదు. వారివారి పాలికాపుల మధ్య కూడా పచ్చగడ్డి భగ్గుమండుతుంది. ఇరుపక్షాలకూ అంటీ ముట్టని సూరయ్యలు ఇద్దరు ముగ్గురే గ్రామానికంతకూ.

ఇల్లు చేరగానే తమ రాక కోసం ఎదురు తెన్నులు చూస్తున్న లక్ష్మమ్మను గద్దించి నట్లు అడిగాడు దొరయ్య. ''పెద్దావు ఎక్కడ చచ్చిందే'' కంఠంలో క్రౌర్యం ఖంగున మోగింది. లక్ష్మమ్మ అదిరిపోయింది. గంగన్న జరిగింది చెబుతున్నాడు. దొరయ్య వీధి కొట్టు గదిలోనికి వెళ్లి కావడి బద్దతో కాలయముడిలా బైటకు వచ్చాడు. సావడిలో మంచం మీద సుబ్బారావును పడుకోబెట్టాడు గంగన్న. లక్ష్మమ్మ సన్నగా ఏడుస్తూ కొడుకు శరీరమంతా తడిమి తడిమి చూసుకొంటున్నది. సుబ్బారావు తలవైపున జయలక్ష్మి పమిట చెంగుతో కళ్లొత్తుకుంటూ గుడెల్లి దుఃఖిస్తున్నది. దొరయ్య ప్రయత్నాన్నంతగా పట్టించుకో లేదు లక్ష్మమ్మ.

''పెద్దావు ఎక్కడుందే'' దొరయ్య ఆవేశంతో ఉగిపోతున్నాడు.

''ఇప్పుడు దాన్నిగాని బాత్తారా ఏంటి'' అంది లక్ష్మమ్మ భర్త వంక భయంగా చూస్తూ.

''బాదటం ఏంటి. చంపేస్తాను దాన్ని వాళ'' అంటూనే దొడ్డివైపు తిరిగి రెండు అడుగులు వేసాడు. లక్ష్మమ్మకు దొరయ్య తిక్క తెలియుందికాదు. గమ్మున వచ్చి కావడి బద్ద పట్టుకొంది రెండు చేతుల్తోనూ.

''ఆవును చంపటం మహాపాపం సుమండీ. అసలే మనరోజులు తిన్నగాలేవు. ఇదంతా మన ఖర్మ. దాన్ని ఏంచేసి ఏంలాభం. పెద్దావు సుబ్బయ్యని పొడిచిందంటే నాకింకా నమ్మకం కుదరడంలేదు'' అన్నది లక్ష్మమ్మ.

''రేపు నిన్ను కూడా వాలుగుపోట్లు, పొడిస్తేగానీ నీకు నమ్మకం కుదరదులే. లే అడ్డురాకు. ఇవ్వాళ దాని అంతు చూస్తాను'' దొరయ్య లక్ష్మమ్మ చేతితో కావడి బద్దను బలంగా విదలించాడు. లక్ష్మమ్మ దొరయ్య రెండుకాళ్లూ పట్టుకొంది.

''నా మాట వినండి. ఆవును చంపటం అందులోనూ చూలుతో ఉంది. మీకు తెలియదూ కోడలు కడుపుతో ఉంది. పదేళ్లకు దేవుడికి దయ కలిగింది. కొంచెం నిదానించండి'' లక్ష్మమ్మ జయలక్ష్మి వంక చూసింది. చివరి మాటతో దొరయ్యకు ఆవేశం వదిలింది. ఆలోచన కలిగింది. నరసన్నకు సైకిలిచ్చి డాక్టరుగారిని ఉన్న పాళంగా తీసుకు రమ్మని పట్నం పంపించాడు దొరయ్య.

సత్తిబాబును వెదక వెళ్ళినవారు తిరిగి తిరిగి ఆందోళనతో నిండిన గుండెలతో యాంత్రికంగా ఇల్లు చేరారు. నారాయణమ్మ తెల్లవార్లూ ఒకేలాగ నెత్తీనోరూ బాదుకొంది.

ఉదయం దొరయ్యగారి ఏటిదరి పొలకు దిగువ ఒకమైలు దూరంలో మాలగని సమీపంలో ఏటి ఒడ్డునే ఉన్న ఈత తుప్పకు తగులుకొని వెల్లకిలా పడిఉన్న శవాన్ని దూరాన్నుండే భయం భయంగా చూస్తున్న వారిలో కాంతయ్యగారి పాలేరు ఒక్క అడుగు ముందుకు వేసి నీరైపోయాడు.

కాంతయ్యగారి యింటిలో వెలుగుతున్న చిన్నదీపం ఆరిపోయింది. ఆ దంపతుల చేయూత జారిపోయింది.

పది రోజులయింది.

సుబ్బారావు యింకా మంచం మీద నుండి లేవలేకపోతున్నాడు. పెద్దావు కొమ్ములతో చేసినగాయాలు మాను పట్టాయి. కనికిపోయిన చోట గడ్డకట్టిన రక్తం పెల్చు బడి పర్చుకొంటున్నది. డాక్టరు రెండు రోజుల కొకసారి చూసి వెడుతున్నాడు. గాయాలు మానుతున్నా మనిషిలో కదలిక లేదు. సరికదా ఒకవిధమైన వెర్రివాలకం కొత్తగా దాపురించింది. చూపుల్లో కలవరం, చేతల్లో తొందర, మాటల్లో తడబాటు కొట్టవచ్చినట్లు కన్పిస్తున్నాయి. ఒక్క లక్ష్మమ్మే లీలగా గమనించినా నీరసంతో ముడి వేసి సరిపెట్టుకుంటున్నది. సుబ్బారావుకు రాత్రంతా నిద్ర ఉండదు. అటు నుండి యిటూ, యిటు నుండి అటూ అనుక్షణమూ ఒత్తిగిలుతూ ఉంటాడు. ఒక నిముషం ఒకలా పడుకోలేడు. ఒక్కొక్కసారి దిగ్గున లేచి కూర్చుని, వెంటనే దాపు జారిపోయిన కట్టెలా ఒరిగిపోతుంటాడు. అతని కళ్ళూ, ముదురూ పరీక్షగా చూస్తే అతని మనసు, అంతా వేదనానిలయమై జలోదనా ప్రశాంతమైనట్లు అనిపిస్తుంది. తరుచూ రెండు చేతులతోనూ కణతలు గట్టిగా నొక్కుకుంటూ ఉండుండి తలను బలంగా గుద్దుకుంటుంటాడు. కొన్ని దృశ్యాలనూ, సంఘటనలనూ, భావాలనూ స్మృతికి దూరంగా ఉంచాలనే ప్రయత్నంలోనే అవి మనస్సులో మరింత చొచ్చుకుపోతాయి. ఒక విషయాన్ని గురించి అసలు ఆలోచించ కూడదనే తాపత్రయంతోనే ఆ విషయాన్ని అన్నికోణాల నుండీ తర్కించటం జరుగుతోంది. ఇలాంటి వ్యధా చిహ్నాలు సుబ్బారావులో నానాటికి ప్రస్ఫుటంగా కనుపిస్తున్నాయి. కానీ చూడగలిగే వారెవరు?

ఒక రోజున మధ్యాహ్నం హార్లిక్సు కలుపుతూ "పెద్దావు నిన్నెందుకు పొడిచింది నాయనా" అని లాలనగా అడిగింది లక్ష్మమ్మ. సుబ్బారావు తల్లి వంక తెల్లబోయి పిచ్చి చూపు చూసాడు. పాలు రంగరించడంలో కొంత నిమగ్నమైన లక్ష్మమ్మ ఈ చూపును సరిగా చూడలేదు. రెండోసారి ప్రశ్నతో సర్దుకొన్నాడు.

"నారుమడి మేసేస్తుంటే అదలించబోతే తిరగబడి కుమ్మేసిందమ్మా" అన్నాడు. వెంటనే తల్లి దృష్టి నుండి ముఖం ప్రక్కకు తిప్పేసుకున్నాడు. జంకకుండా పలికే శక్తి సుబ్బారావులో లేదు, నమ్మితీరాలి లక్ష్మమ్మ! తమకున్న ఆవు లన్నిటిలోనూ పెద్దావు పట్టి 'సత్తిగోవు'. పసిపిల్లలైనా మెడ పట్టుకొని ఉయ్యాలలూగినా కొమ్ములు పట్టుకొని వేలాడినా, కాళ్ళకి కిందకు దూరినా మాట్లాడని పెద్దావు దానిని ప్రాణానికి ప్రాణంగా చూసుకొంటున్న సుబ్బారావును, అదలించినంత మాత్రాన చచ్చేటట్లు కుమ్మి పాతేసిందంటే లక్ష్మమ్మకూ, ఊరందరకూ చాలా వింత విషయం. అయినా నమ్మారు.

"నా ఖర్మ దినాలకొద్దీ ఆ గంగిగోవుకు ఆ బుద్ధి పుట్టింది. దీంట్లో అనుకోవలసింది ఏముందిలే పెద్దమ్మా" అంది లక్ష్మమ్మ సుబ్బారావును చూడవచ్చిన పొరుగు పెద్దమ్మతో.

చుక్కలాడి పడ్డట్టు ఒకరోజున హఠాత్తుగా ఇద్దరు పోలీసులూ, ఎస్‌ఇన్‌స్పెక్టరు గారూ కాంతయ్య యింటికి వచ్చి, కాంతయ్యనూ, ఒకవైపు ఏడుపూ ఒకవైపు ఉన్మాదాల మధ్య ఊగులాడుతున్న నారాయణమ్మనూ, వాళ్ళని, వీళ్ళని అన్ని ప్రశ్నలు వేసి వేధించుకు తిని పెదవులు విరుచుకొని వెళ్ళిపోయారు. ఆ నాడంతా సుబ్బారావు గది విడిచి బైటకు రానేలేదు. ఎప్పుడూ గది తలుపులు గడియ వేసే ఉండేవి. పదిసార్లు పిలిచినా త్వరగా తలుపు తీసేవాడుకాదు. పిలవగా పిలవగా తీస్తే, లక్ష్మమ్మను అలా వెళ్ళనిచ్చి మళ్ళీ గడియ బిగించుకొనేవాడు.

రానురాను అర్ధరాత్రి సమయాల్లో తనతో తనే మాట్లాడుకోవటం ప్రారంభించాడు. మంచం మీద నుండి చివ్వున లేచి నిలబడటం తలుపు వద్దకు వచ్చి సావడిలోకి తొంగి చూడటం లాంటి చేతలు తరుచైనవి. ఈ చేతల వెనుక ఒక తపనా ఈ తపన వెనుక ఒక వేదనా ఉన్నాయి. ఒకటిరెండు సార్లు కెవ్వుమన్నాడు. లక్ష్మమ్మ ఉలిక్కిపడి లేచి వచ్చింది. మంచినీళ్ళిచ్చి వెళ్ళింది. పీడకలలేమోనని తెల్లవారగానే రంభయ్యలింగంగారి చేత రక్షరేకు కూడా కట్టించింది.

'అన్నీ సంచి టానిక్కులూ, పంత పుష్టికరమైన తిండీ ఏమైపోతున్నాయా' అని డాక్టరుగారు ఆశ్చర్యపోతున్నారు. కాని తన అనుమానాన్ని ఏమాత్రం పైకి వ్యక్తపరచ లేదు. పైగా దొరయ్యకూ, లక్ష్మమ్మకూ ఎక్కువగా నచ్చి చెబుతున్నారు.

తెల్లవారు ఝామున పశువుల పాక ఊడ్వడానికి వచ్చిన చిన్న పాలేరు ఎత్తిగాడు సంతోషంతో ఉక్కిరిబిక్కిరైపోయాడు. పెద్దావు ఈనేసింది. వాకిలి ఊడవబోతున్న లక్ష్మమ్మ చీపురుకట్ట అక్కడే పడేసి పాకలోని వెళ్ళింది. పెద్దావు మహా ఆప్యాయతతో దూడను నాకుతున్నది. దూడ లేవడానికి ప్రయత్నం చేస్తున్నది. కాని ఆవు మాటిమాటికీ నొక్కి దూడను లేవనీయడంలేదు. లక్ష్మమ్మ రాగానే తలఎత్తి చూసి మళ్ళీ తన పనిలో నిమగ్నమైపోయింది.

పెద్దావు పాదీ వెండి కరగబోసి పోత పోసినట్లు తెల్లగా సర్వాంగ సుందరంగా ఉంటుంది. ఆ వూళ్ళోనేకాదు, ఆ చుట్టు ప్రక్కల గ్రామాల్లో అంత నిండైన ఆవు లేదు. "ఏ శాపవశాన్నో భూమికి దిగి కామధేనువు కదయ్యా దొరయ్యా' అంటారు పురాణం ఆచార్యులుగారు పెద్దావును చూచినప్పుడల్లా.

ఆ ఆవును నా కివ్వకపోతే మీకూ నాకూ సంబంధమే లేదన్నంతవరకూ పుట్టింటి వారిని బెదిరించి పెద్దావును తోలి తెచ్చుకుంది జయలక్ష్మి. జయలక్ష్మితో తండ్రుడుం మాటలాగ అన్నదమ్ములు

ఈ ఆవునూ జయలక్ష్మికి యిచ్చేయడానికి సుతరామూ యిష్టంలేదు. ఈ ఆవే సుబ్బారావును చచ్చేలా పొడిచిందంటే జయలక్ష్మి చాలా బాధపడింది. మనం చేసే ఏ పని, ఆడే ఏ మాట, ఏ అనర్థానికి దారితీస్తాయో ముందు తెలిస్తే యికనేం. అంతా అయిన తర్వాత "అది చేయకపోతే యిది జరగక పోను గదా" అని వ్యర్థంగా ఖేదపడతాము.

"మాంచి ఎత్తరైన గిత్తదూడ్నే పెట్టేసిందమ్మగారూ. నాసామిరంగా దీన్ని గానీ ఆచ్చేసి అంబోతు కింద వదిలేస్తే కిట్టమూర్తిగారి అంబోతు దీని కాలి కిందకి దాదనుకోండి. ఏందమ్మగారూ" సత్తిగాడు తెగ సంబరపడిపోతున్నాడు. కృష్ణమూర్తి గారి అంబోతూ ఈ కాబోయే అంబోతూ డీ కొనగా కృష్ణమూర్తిగారి అంబోతు తోకముడుచుకొని పారిపోయే దృశ్యం పరవా పోయింది సత్తిగాడి ఆలో నా.

లక్ష్మమ్మ కొంతసేపు కళ్లింతలు చేసుకొని ఆవునూ దూడనూ చూసి రెండడుగుల్లో యింట్లో ప్రవేశించి అప్పుడే నిద్ర లేస్తున్న కోడలితో అంది.

"పెద్దావు ఈనేసిందే గయా."

మానవుడా జయించేవు

లక్ష్మమ్మ సుబ్బారావు గదిలోనికి వెళ్లింది. తల్లి రాకకోసమే ఎదురుచూస్తున్న వాడల్లే సుబ్బారావు గుమ్మం వంకే చూస్తున్నాడు. అయితే ఆ చూపులో ఆత్రంలేదు. సంతోషం అంతకంటే లేదు. పైగా భయం దోబూచులాడుతున్నది.

"పెద్దావు ఈనేసిందిరా సుబ్బయ్యా" ఈ ఆవే కొడుకుని చిత్తుగా పొడిచి యింత చేసిందని లక్ష్మమ్మ ఆ క్షణకాలం మరిచిపోయింది.

"ఎప్పుడమ్మా" తెచ్చి పెట్టుకున్న ఉత్సాహంతో అన్నాడు సుబ్బారావు.

"ఏమో. రాత్రి ఏవేళ యీనేసిందో మరి. మన సత్తిగాడు పాక తుడ్వానికి వచ్చి చూసాడు."

సుబ్బారావు గుండెలో ఎవరో ఒప్పున పొడిచినట్లు మెలికలు తిరిగిపోయాడు. దాచలేని బాధతో ముఖం వివర్ణమైపోయింది. నిర్జీవంగా తల్లి వంక చూడసాగాడు. కొడుకు కలవరాన్ని తల్లి గమనించింది. గమనించలేదు. కొందరికి కొన్ని మాటలలో ఒక అనుభూతి నిక్షిప్తమై ఉంటుంది.



ఆ మాటలు చెవి సోకగానే దానికి అనురూపమైన భావప్రకంపనం కలుగుతుంది. ఎంత గంభీరులూ ఆ సంచలనాన్ని దాచుకోలేరు. సుబ్బారావుకు, పాల, పెద్దావు, ఏరు, చిన పాలేరు పేరు ఇవి వింటేచాలు కళ్లల్లో భయోద్వేగం తాండవమాడుతుంది.

"నెమ్మదిగా నేను తీసుకెడతాను. వస్తావా నాయనా. చూద్దువుగాని" అడిగింది తల్లి. సుబ్బారావు క్షణం ఆలోచించాడు. తల్లిని నిరుత్సాహపరచలేదు. పెద్దావు దృష్టి కెదురై నిలబడలేడు.

* * *

"వస్తా"నంటూ లేచి కూర్చున్నాడు. తల్లి చెయ్యి పట్టుకోబోయింది. అక్కర లేదని మెల్లగా లేచి తల్లి వెంట వెళ్లాడు. వెనుక జయలక్ష్మి వెళ్లింది. సత్తిగాడు అక్కడే ఉన్నాడు. దూడను తలనుండి తోకకుచ్చు వరకూ తెగ నిమురుతున్నాడు. పెద్దావు ఒకసారి సత్తిగాడి చెయ్యిని కూడా దొరక పుచ్చుకొని నాకేస్తున్నది. లక్ష్మమ్మ, సుబ్బారావు, జయలక్ష్మి పాక చూరు కిందకు వచ్చారు. 'వచ్చిన వారెవరా' అని పెద్దావు తలెత్తింది. అంతే తోక తొక్కిన త్రాచులా కస్సుమంది. సుబ్బారావు అడుగు వెనకకు వేసి తూలిపడబోతే జయలక్ష్మి పట్టుకొంది. లేకపోతే పడిపోయేనాడే. ఆవు రెచ్చిపోయింది బుసలు కొడుతూ కట్టుకొయ్య చుట్టూ కల తిరుగుతున్నది. ఆ తిరగడంలో దూడను కూడా తొక్కి పారేస్తుందేమోననిపిస్తున్నది. సత్తిగాడు కొంచెం ఎడంగా తప్పుకున్నాడు. ఆవు సంరంభం ఎక్కువైపోయింది. ఆ తిరగడంతో కట్టుకొయ్య కదిలిపోతున్నది. మెడకన్ని సాగిపోతున్నది. ఏక్షణంలోనైనా కట్టుకొయ్య ఊడిపోవచ్చు. మెడకన్ని తెగిపోవచ్చు. అందరూ బొమ్మల్లా నిల్చున్నారు. ఏమి చెయ్యడానికి ఎవరికీ తోచలేదు. అసలిదంతా దేనికో కొంతసేపటి వరకూ ఎవరకూ అర్థమవ్వనేలేదు. సుబ్బారావుకు వళ్లంతా ముచ్చెమటలు పోసాయి. ఎండుటాకులాగ గజగజ లాడిపోతున్నాడు. కళ్లు గట్టిగా మూసుకొన్నాడు. కాళ్లు

వారఫలం

11-2-1966 శుక్రవారం మొదలు 17-2-1966 గురువారం వరకు.

మేషం : వృత్తి వ్యాపారాల్లో వారం ప్రారంభంలోనే వ్యయ ప్రయాసలకు గురి కాగలరు కాని వారాంతానికి అన్ని వ్యవహారాల్లోను అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. వ్యాపారంలో మీ అభిప్రాయాలు సరియైనవని రుజువు కావడంవలన పోటీవారిలో గౌరవం లభిస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా వారాంతంలో లాభిస్తాయి. ఉద్యోగంలో మీ పరిస్థితి యిదివరకటి కంటె బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషికి ఆటంకాలు వస్తాయి. మీ ఆరోగ్యం బాగానే ఉన్నా, సంతానానికి అనారోగ్యం చేయగల సూచనలు ఉన్నాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. బంధువుల వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలించగలవు.

వృషభం : ఇతరుల దృష్టిలో యీవారం మీకు యోగవంతమైనదే కాని మీకు మాత్రం అంత సంతృప్తికరంగా కన్పించదు. ఎప్పుడూ పదిమందితో తిరగడం, అందరూ మీ మాటకు వోహో అనడం జరుగుతుంది కాని దానివల్ల మీకు ఒరిగే దేమీ ఉండదు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి అందుతుంది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాలు బలహీనపడే సంఘటనలు జరుగుతాయి. వారం మధ్యలో చికాకులు కలుగుతాయి. కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం యిదివరకటికంటె బాగా ఉంటుంది. శుభ కార్యాల విషయంలో అనుకూల వార్తలను వింటారు.

మిథునం : ప్రయత్నించిన ప్రతి పని సులువుగానే నెరవేరుతుందిగాని ఫలితం మాత్రం సంతృప్తికరంగా ఉండదు. వ్యాపారంలో మీరు యిదివరకు నిర్లక్ష్యం చేసిన వ్యవహారాలకు యిప్పుడు ప్రాధాన్యత రావడంవలన మీరు పొందవలసిన లాభాన్ని పొందలేకపోవచ్చును. వృత్తి రీత్యా చేసే ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి. ఉద్యోగంలో కార్యభారం పెరిగినా, మీ కృషిని అధికారులు గుర్తించగలరు. కోర్టు వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగాఉంటాయి. ఆరోగ్యంసామాన్యంగా ఉంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధికవ్యయం జరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం : అన్నివ్యవహారాలు అనుకూలంగానే ఉన్నట్లు కన్పిస్తాయిగాని మీరు యేమాత్రం యేమరుపాటుగా ఉన్నా వృత్తి వ్యాపారాల్లో అవస్థ పడి, అనుభవం మరొకరిది కాగల పరిస్థితి యేర్పడుతుంది. మీరు స్వంతంగాచేసే వ్యాపారాలకంటె భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. వృత్తిలో కొంతమంది మిత్రుల వ్యవహారాల్లో జోక్యం చేసికోవలసివస్తుంది. ఉద్యోగంలో ఎవరితోను మాట పట్టింపులకు దిగడం మంచిదికాదు. కుటుంబ వ్యవహారాల్లో స్వల్ప భేదాభిప్రాయాలు వచ్చి సర్దుకొంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. అలంకార వస్తువులు కొంటారు. బంధు మిత్రులను కలుసుకొంటారు [illegible]

సింహం : వృత్తి వ్యాపారాల్లో పోటీవారితో పోటీ పెరగడంవలన తరచుగా మీకార్యక్రమాలను మార్చుకోవలసివస్తుంది. ఆర్థికవ్యవహారాల్లో తాత్కాలికమైన మొగమాటాలకు లొంగిపోవడంవలన ముస్ముందు యిబ్బందులకు గురి కాగలరు. వ్యాపార విస్తరణ ప్రయత్నాల్లో కొత్త కొత్త సమస్యలు తల ఎత్తగల సూచనలు ఉన్నాయి. ఉద్యోగంలో మీ మంచి తనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. సాంఘిక వ్యవహారాల్లో మెప్పుకురాని కార్యభారాన్ని వహిస్తారు. ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా, నిర్లక్ష్యం చేయ తగదు. పుణ్య కార్యాలు చేస్తారు.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు సంతృప్తికరంగా ఉంటాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించగలదు.

కన్య : వృత్తి వ్యాపారాల్లో ఆదాయం బాగానే ఉన్నా, అకారణంగా పోటీవారితో భేదాభిప్రాయాలు ఏర్పడడంవలన యీవారం సంతృప్తికరంగా ఉండదు. వ్యాపారంలో మీకు ముస్ముందు లాభించగల వ్యవహారాల్లో అనుకూలతను సాధించగలరు. వృత్తిలో యితరులమీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు. ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. రాజకీయ వ్యవహారాల్లో కొత్త సమస్యలు తల ఎత్తగలవు. ప్రయాణాలు కొంచెం శ్రమమీద ఫలిస్తాయి. కుటుంబవ్యవహారాలు బాగాఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉన్నా, అప్పుడప్పుడు బలహీనత కన్పిస్తుంది. బంధువులకు సహాయం చేస్తారు.

తుల : ఈవారం మీరు చేసే ప్రయత్నాలు కొన్ని వ్యర్థమై పోయినట్లు కన్పిస్తాయిగాని వాటి ఫలితాన్ని మీరు ముస్ముందు తప్పకుండా పొందగలరు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాల్లో అధికారులు మీ యెడల అనుకూలంగానే ఉన్నా, యితరుల జోక్యంవలన ఆలస్యం కావచ్చును. ఉద్యోగంలో మీ అభిప్రాయాలకు తగిన అవకాశాలు లభించడంవలన మీ శక్తి సామర్థ్యాలను రుజువుచేసికొనగలరు. ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆరోగ్యం బాగా ఉంటుంది.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమమీద నెరవేరతాయి. శుభమూలంగా వ్యయం జరుగుతుంది.

వృశ్చికం : ఈవారం చిత్రంగా ఉంటుంది. ఇతరుల నిమిత్తం మీరు యే ప్రయత్నం చేసినా సులువుగా నెరవేరుతుందికాని మీ స్వంత వ్యవహారాల్లో మాత్రం శ్రమ పొందవలసి వస్తుంది. వృత్తిలో కొన్ని అవకాశాలు ఆకర్షణీయంగా కన్పిస్తాయిగాని అవి వెంటనే కార్య రూపాన్ని ధరించడం కష్టం. వ్యాపారం భారీ ఎత్తున చేయడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. కోర్టు వ్యవహారాల్లో అనుకోని చికాకులు కలుగుతాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణించగలదు.

[illegible]

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. పోటీవారిలో గౌరవం బాగా పెరుగుతుంది. పుణ్య కార్యాలు చేస్తారు.

ధనుస్సు : వారం ప్రారంభంలో వృత్తి వ్యాపారాల్లో చికాకులు కలిగినా, సమయానికి కొంతమంది మిత్రుల సహకారం లభించడంవలన వారాంతానికి అన్ని వ్యవహారాల్లోను తగినంత అభివృద్ధి సాధించగలరు. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా వారాంతంలో లాభించగలవు. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. వారం ప్రారంభంలో ఉద్యోగంలో మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. దూరప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి.సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

మకరం : వృత్తి వ్యాపారాల్లో ఆదాయ వ్యయాలు రెండూ కూడా పెరుగుతాయి. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల్లో నూతనావకాశాలు లభించగల సూచనలు ఉన్నాయి. వృత్తిలో యిదివరకు పోటీవారితో ఏర్పడిన పోటీ చాలవరకు తగ్గుతుంది. వ్యాపారంలో యెవరిని విశేషంగా నమ్మి వ్యవహరించడం మంచిదికాదు. కొన్ని వ్యవహారాల్లో అధిక వ్యయం జరగడంవలన ఆర్థికంగా ఒత్తిడివస్తుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. కుటుంబ వ్యవహారాల్లో అవసరమైన వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. విలాస వస్తువులు కొంటారు.


కుంభం : గత వారం కంటే యీ వారం బాగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో మీకు యిదివరకు ఆందోళన కలిగించిన వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. వ్యాపారంలో మీ మంచితనాన్ని తమ స్వార్థానికి వినియోగించుకోవడానికి ప్రయత్నించే వ్యక్తులతో వ్యవహరించవలసివస్తుంది. వృత్తిలో మీకు ముస్ముందు ఉపయోగించగల సంభాషణలను జరుపగలరు. స్థిరాస్తి వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. బంధువుల వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలించగలవు. స్వల్ప అనారోగ్యం చేయవచ్చును.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మీనం : వృత్తి వ్యాపారాల్లో ఆదాయం కొంచెం పెరిగినా, దానికి తగినట్లుగా వ్యయం కూడా పెరగడంవలన మీరు అదనంగా సాధించినది యేమీ ఉండదు. వృత్తిలో మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని మోసం చేసే ప్రమాదం ఉంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాల్లో ప్రయోజనంకంటే ప్రయాస అధికంగా ఉంటుంది. ఉద్యోగంలో యితరులు చేసిన పొరబాట్లకు కూడా మీరే బాధ్యత వహించవలసి వస్తుంది. వారాంతంలో కొంచెం మంచి పరిస్థితులు యేర్పడతాయి. ఆరోగ్యం బాగాఉండదు. అధిక వ్యయం చేస్తారు.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. ప్రయాణాలు చేస్తారు. దైవకార్యాలు నెరవేరుతాయి.

కలకంఠి కంటినీరు



శ్రీలంగం రాజేశ్వరరావు

మైసూర్ శాండల్‌వుడ్ సబ్బులా వుంటుందో—ఆ ఆకారంలో వుండే కళ్ళు, డబ్బూ అందం వున్న అమ్మాయి మనసులో గర్వంలా గ్రాడ్యువల్‌గా పెరిగి ఒక్కసారి సూదిగా ఆగి క్రిందికి జారిపోయి ఎంతో అందంగా కనబడే ముక్కు, రెండు సున్నాలు కలిపి వాటికి గులాబి రేకులు అంటించినట్టుండే పెదవులు నల్లగా ఒత్తుగా లేచిన జుత్తు, ఎందుకో మైమరచిపోయి రెండు పాయలుగా చీలిపోయి ఓ పాయ ముందుకి మరో పాయ వెనక్కి జారి పిరుదుల్ని దాటగానే పటుక్కున ఏదో జ్ఞాపకమొచ్చి ఆగిపోయి ఒత్తుగా ఆశ్చర్యపోయి నల్లగా అతినల్లగా మెరుస్తూ నవ్వినట్టుండే ఓ రెండు కళ్ళు, నుదుటికి కొంచెం పైన అతిసున్నితంగా ఓ చిన్న కెరటంలాగ పైకి లేచి వెంటనే వెనక్కి జారిపోయిన ఓ చిన్న "పఫ్"

ఇవన్నీ కల్యాణి కున్నాయి.

ఇవి మాత్రమే కాక తెల్లని వొంటి రంగూ, ఓ రెండంతస్తుల అందమైన మేడ, సాధారణంగా రెండో అంతస్తు దిగని నాన్న వున్నారు. నాన్నకి బేంకులో ఓ రెండు మూళ్ళక్షల ఎకౌంటుంది. అంతేకాక బొంబాయిలో వుండి అప్పుడప్పుడింటి కొచ్చే అన్నయ్యా, ఓ చిన్నస్టాండర్డు కారూ, ఒక్కర్తే కూతురవడంవల్ల నాన్నకీ, ఒక్కర్తే చెల్లెలవడం వల్ల అన్నకీ కల్యాణంటే ముద్దు కూడా వుండడం వల్ల ఆ అమ్మాయికి చాలా గర్వం వుంది. అహంభావమంతా చూపుల్లో వుంది. తేలిక భావమంతా జీవితం మీదా మామూలు (కారూ డబ్బూ లేని) మనుషుల మీదా వుంది. ఇదంతా ఇలా వుంచితే ఆ అమ్మాయికి అద్భుతమైన కంఠం వుంది. చాలా బాగానూ అందంగానూ పాడగలదామె. ఐతే ఆమె పాటల్లో చాలామంది వ్యాపరిచిన ఆకలి ఘోషలూ చెరిగిపోయిన కలల నీడలూ వినిపించడంగాని కనిపించడంగాని జరగదు. పిల్లగాలులామె పాటల్లో పలకరిస్తాయి. కష్టమంటే తెలియనిదమ్మని జీవితం ఆమె పాటల్లో కళ్ళు తెరుస్తుంది. అంతమంచి

కంఠం వుండడం వల్ల ఆమె పాటల్లో గర్వం చాలా ఎక్కువై ఏపుగా పెరిగిపోయి కనురెప్పల్ని కలుసుకొని అక్కడ కాపురం పెట్టడంవల్ల— ఆ అమ్మాయి కళ్లతో కింద చూపు లెప్పుడూ చూడదు. కారులో వెళ్తున్నప్పుడు కల్యాణికి ట్రాఫిక్కూ, తప్పితే ఆకాశం అంతేకాని రోడ్డెప్పుడూ కనబడదు.

తనందాన్నీ, తనని వెర్రిగా చూసే కుర్రాళ్లన్నా జనమన్నా చాలా తేలికభావ మామెకి. సాధారణంగా ఎవరి పక్కా చూడని కల్యాణి ఎప్పుడో ఓసారి ఎవరి పక్కైనా చూసినా "ఏమిటీ మనుషులు? వీళ్లు మనుషులే? ఇలాంటి మనుషుల మధ్యా నా లాంటి 'బ్యూటీక్వీన్' వుండడం?" అనుకొంటుంది. అనుకున్నట్టు చూస్తుంది... రోడ్డు మీద కాని ఎవరైనా చిరిగిన బట్టల్తో, లేకపోతే మాసిన బట్టల్తో కనిపించినా చాలా అసహ్య మామెకి. ముష్టి వాళ్లెవరు కనబడ్డా వాంతి ముంగినలా పెట్టినట్టు చూసి వాళ్లని అతిసున్నితంగా అసహ్యించుకుంటుంది. అలా జరిగిన రోజు రాత్రి డిన్నర్ దగ్గర ఓ పెద్ద లెక్చరిచ్చి "డాడీ! ఐ డోంట్ లైక్ దిస్ డర్టీ ఎట్మాస్ఫియర్." అని ముగించి "హొన్ట్లీ! షెర్ట్లీ యువిల్ గో టు ఫారిన్." అని తల నిమిరిన తండ్రిని ఆప్యాయంగా చూసి అందంగా నవ్వేస్తుంది కల్యాణి.

ఆ విధంగా చాలా ముద్దుగా పెరిగిన కల్యాణి కొత్త వందరూపాయి నోటులా అతి హుందాగా వుంటుంది. పాతరోజుల్లో బంగారు కాసులా అతి అందంగానూ వుంటుంది.

అలా..నోట్ల కట్టల మీద 'నో వేకెన్సీ' బోర్డు చూసి కష్టాలు వెనక్కివెళ్లిపోవడం వల్ల మిగిలిన సుఖాల మధ్య అతిసున్నితంగా పద్దెండేళ్ళు పెరిగిందా అమ్మాయి.

ఆ ఏడే పి. యు. సి. పాసవడం వల్ల వాళ్ళ నాన్నగారామెని పిల్చి "ఏంతల్లీ ఏం చదువుతావ్?" అంటే ఆ అమ్మాయి చాలా అందంగా నిట్టూర్చి, "బియ్యే" అంది. ఎందుకంటే 'బియ్యే' చదవటం చాలా సులువనీ, సుఖమనీ అనుకుందామె.

పర్యవసానంగా .... కొద్ది రోజుల్లోనే ఆ వూళ్ళో వున్న కాలేజీ రోజా వుదయం పది గంటలకీ, సాయంత్రం నాలుగున్నరకి ఎర్రగా మెరిసేది అందరి కళ్ళూ ఒకే దిక్కు కాస్సేపు చూసి బాధగా సోలిపోయేవి.

ఎర్రని స్టాండర్డు కారు 'అప్పో'క్క కాలేజీకి వస్తూంటే అందరూ రోడ్డు మీదే ఆగిపోయి (సెంట్రల్ మంత్రి గారొచ్చిన ట్టుగా) కంగారుగా అతికంగారుగా వెర్రిగా మనసులో పట్టినంత ఆతృతని కళ్ళలోకి పంపించి చూసి, ఎర్రటి వెలుగు వెళ్లిపోయేక ఆ కొద్దిపాటి స్మృతుల్ని మళ్లీ ఆతృత మధ్య బంధించి—అప్పటికి మనసుని కమ్మేసిన నిరాశతో వెళ్లిపోయేవారు.


కాలేజీ కాంపౌండులో కారొచ్చిన తర్వాత అందరూ కారు చుట్టూ మూక్కపోయినా ఆగిపోయి అటే చూసేవారు. సాయంత్రం నాలుగున్నరకి స్టాండర్డు కారు ఎర్రగా రోడ్డుని వెలిగిస్తూ హృదయం మీంచి జారిపోతున్న ప్రేమలాగ డౌన్ దిగుతూంటే మళ్లీ అందరికళ్లూ ఎర్రగా వెలిగి వల్లగా ఆరిపోయేవి.

ఇలా కొన్నాళ్లయాక.... ఓసారేమైందంటే, కాలేజీలో పాటల పోటీ ఉంది. కల్యాణి పాడుతుందని తెలిసి జనం చాలామంది వచ్చేరు. ఆ తోపులాటలో టెర్లిన్ చొక్కాలు చిరిగేయి. చెప్పులు వేస్కొన్న కాళ్ళు బూట్ల కిందపడి నలిగేయి. జుత్తులు రేగేయి...కాని కల్యాణి పాడటం మొదలెట్టడంతో అన్నీ ఆగిపోయేయి. ఆ అమ్మాయికి డబ్బూ, కారూ, బోలెడందం వున్నాయని చాలామందికి తెలుసు కాని ఇంతమంచి కంఠం వుందని చాలామందికి తెలీదు...అసలందులో వాళ్లెవరూ ఆమె గొంతుక విననివారే కనుక వాళ్ళంతా ఆనందంతోనూ ఆశ్చర్యంతోనూ కెరటాల్లాగ పొంగేరు. అంత అందమైన డబ్బున్న అమ్మాయి అంత 'మెరిట్' చూపిస్తూంటే అమ్మాయికి జెలసీ అప్పటికప్పుడే కల్యాణితో కలిసి రామకృష్ణ పార్కులో పడుక్కొని దొర్లుతూ డ్యూయట్ పాడుతున్నట్టు గ్రాహించుకుంటున్న అబ్బాయిలకి పట్టలేని సంతోషం కలిగేయి. ఇంత లోనే పాటైపోయింది. అందరూ దీర్ఘంగా నిట్టూర్చేరు. ఒకరిపక్కొకరు చూస్కొన్నారు. కల్యాణి పక్క కొందరు చూసేరు. కొందరు బైటికెళ్లి సిగరెట్లు ముట్టించేరు. మిగతావాళ్ళు పాడుతున్నప్పుడు మాత్రం గోల చేయడం మొదలెట్టేరు.

కల్యాణికి అంతా సంతృప్తిగా సంతోషంగా వుంది. తనంటే పడిచచ్చే ఈ వెర్రి వాళ్ల సంగతి తెలుస్తూనే వుంది...... వెపూర్ క్రీపర్స్....బోలెడ్డబ్బు లేనివాళ్ళకి "మైండ్ కూడా వుండదేమో!" అనుకుని నవ్వుకుంది కల్యాణి. ఇలా ఆలోచిస్తున్న కల్యాణి సడన్‌గా హాల్లో గోలాగిపోవడం, ఓ సన్నని అతి మధురమైన కంఠం వినిపించడం విని స్టేజి పక్క చూసింది. ఆ కంఠం వినగానే ఆమెకు సడన్‌గా తనకి ఫస్ట్ ప్రైజు రాదేమోననిపించింది. అప్పుడు చాలా అభిమానం, కోపం, ఇంకా ఎక్కువ జెలసీ కలిగేయామెకి. అలా గోలాగిపోవ డానికి, కల్యాణికి భయం కలగడానికి ఓ ఐదడుగుల ఎనిమిదంగుళాల తెల్లని కారణం, స్టేజి మీద నిల్చొని పాడుతోంది. అటు చూసిన కల్యాణి అదోలా ఐపోయింది. అక్కడ ఓ తెల్లని అబ్బాయి నిల్చొని పాడుతున్నాడు. అతని పాటంత అందంగా అతనూ వున్నాడు. అతన్ని చూడగానే కల్యాణికి అదోలా అనిపించింది. అతని పాట మనసులోనూ రూపం కళ్ళలోనూ రికార్డైపోయినట్లనిపించింది. అతని పాట విన్నంతసేపూ అదోరకంగా అంతా మత్తుగా, మెత్తగా వున్నట్టు ఫీలయింది కల్యాణి. అతన్ని! క్షణంలో చూస్తుంటే మనసులో ముత్యాల వాన ముసిరినట్టు కురిసినట్టైంది. తెల్లని పాలరాతిలా పరుచుకున్న వర్తమానపు వెలుగులో అతను నీలిదీపంలా మెరిసేడు. ఆ క్షణంలో మనసులో రెండు తెగల్నీ, డబ్బున్నవాళ్ళూ లేనివాళ్ళూ అన్న దాన్ని మరిచిపోయింది కల్యాణి.

మరి కాస్సేపయ్యాక అతని పాటైపోయింది.

అప్పుడు కల్యాణికి చాలా బాధ వేసింది. మిగతా వాళ్ల పాటలు వినాలనిపించలేదు,



కలకంఠి కంటినీరు

గబగబా లేచి గరల్స్ రూంలోకివెళ్ళిపోయింది. ఆలోచనలు కాస్సేపు అందమైన పగటి కలల్తో ఆడుకున్నాయి...ఇంతలో ప్రోగ్రాం ఐపోయినట్టుంది. అందరూ వెళ్ళిపోతున్నారు. కల్యాణి కూడా బైటికి వచ్చేసింది.

ఇవాళ లేటౌతుందని డ్రైవర్ని రావద్దని చెప్పేసింది. మెల్లిగా రోడ్డు మీదకి వచ్చింది.

అప్పుడే చీకటి పడుతోంది. వచ్చీరాని వెన్నెల, హృదయంలో నిండీనిండని ప్రేమలా వుంది. దాని చూస్తోంది కల్యాణి. ఆర్టైంది. బస్సులో చాలా రష్‌గా వుంటుంది. అంచేత సరదాగా...జీవితంలో మొదటిసారి నడిచి వెళ్దామని నిశ్చయం చేస్కోంది కల్యాణి. ఐనా ఇంకా మరేదో కారణం కూడా వుంది. ఆ అబ్బాయి కనబడతాడేమోనని ఓ చిన్న ఆశ...మసగ వెన్నెల్లాగ మనసులో ఓమూల మెరిసింది. అంచేత కల్యాణి నడవడం ప్రారంభించింది...ఎప్పుడూ రాని ఆలోచనలీవేళ మనసులో మెరుస్తున్నాయి. అవి మాత్రం అందంగానే వున్నాయి. ఎందుకో ఎప్పుడూ తెలియని స్మృతి, కాపోతే ఆలోచన అతి మెత్తగా అతి సున్నితంగా మనసు చుట్టూ అల్లుకుంటోంది. ఇలా ఆమెకు తెలీకుండానే ప్రేమ విత్తనం ఆమె మనసులో చాలా అందంగా నాటుకు పోయి ఎమోనియా ఎరువుల్లాంటి ఆలోచనల అదుపు లేనితనంలో వెంటనే ఏపుగా పెరగడం ప్రారంభించింది. అలా ఆ అబ్బాయి గురించి ఆలోచిస్తూ కృష్ణానగర్ దగ్గర టర్నింగ్ తిరిగింది కల్యాణి....

అరే...ఏదో మెరుపు మెరిసినట్టు..అతను— ఇందాక అందమైన పాటపాడిన అందమైన అబ్బాయి. అదృష్టవశాత్తు ఆవేళ వెలిగిన స్ట్రీటులైటు కింద వెన్నెల్లా మెరిసేడు. వెన్నెల్లాగే వున్నాడు. తెల్లనిపేంటు తెల్లని షర్టు....పలకరిస్తే బావుణ్ను. ఒక్కసారి ఆ ఆలోచన మెదిలేసరికి కల్యాణి మనసులో చాలా మెరుపులు తియ్యగా అందంగా వొణుకుతూ మెరిసేయి.

"హల్లో..."

అతనాగిపోయేడు. ఆశ్చర్యంగా చూసేడు. సొగసుని చూసి అందమైన వెన్నెల ఆశ్చర్య పోయినట్టుంది.

"చాలా బాగా పాడేరు" అంది కల్యాణి.

"ఓ...అదా! థాంక్స్."

అలా అని అతను వెళ్ళిపోబోయేడు.

"అరే...వెళిపోతున్నారే?"

"మరేం చెయ్యమన్నారు?"

"మా ఇంటికి 'టీ'కి రండి. అదిగో ఆ కనిపిస్తున్న మేడ మాదే."

"సారీ! పనుంది....."

"ఊహుఁ! అలాకాదు. తప్పకుండా రావాలి. డాడీ క్కూడా పాటలంటే చాలా ఇష్టం. మీరు పాడి వినిపిస్తే ఆయనా మేడ రాసిచ్చేస్తారు."

అతనన్నేడు. "భూమిమ్మీదేదో అనుకోని మెరుపు మెరిసి ఆకాశాని కెగిరి వెన్నెలని రాసుకొని వెళ్ళిపోతే ఆ వెన్నెల ముక్క తెగి భూమిమ్మీదకు...సరిగ్గా ఇక్కడికే... జారి తెల్లబట్ట లేసుకొని నవ్వినట్టుంది." అనుకుంది కల్యాణి.

"చాలా మొగమాటంలో పెట్టేరు." అన్నాడు.

"నోనో... మీరొచ్చి తీరాలి..." అని నవ్వింది కల్యాణి.

అతను "సరే" అని కళ్ళతో నవ్వేడు. ఆ నవ్వు చాలా అందంగా వుండి కల్యాణి మనసు మీద ముద్రవేసి మరీ అందంగా మనసుని నవ్వించింది.

* * *

డ్రాయింగ్‌రూంలో ఎదురుగా కూర్చొన్న అతన్ని చూసి.

"మీ పేరు చెప్పేరు కాదు." అంది కల్యాణి.

కాలుమోపితే కరిగిపోయేట్టున్న మొజైక్ ఫ్లోరింగుని గోడల మీద బొమ్మల్ని ఖరీదైన ఫర్నిచర్నీ చూస్తున్నతను గబుక్కున కంగారుపడి.

"ఓ. అయాంసారీ! నా పేరు బాలరాజు." అన్నాడు.

"వెలరాజులా వుంది." అని అనుకుందా మనుకున్న కల్యాణి అనుకోకుండానే ఈమాట పైకనేసింది. అనేసి చాలా సిగ్గుపడింది.

"థ్యాంక్స్ ఫర్ ది కాంప్లిమెంటు" అని తలదించుకున్నాడతను. అప్పుడతని జుత్తు నల్లని అతినల్లని చీకటిని వంకీలు తిప్పి అక్కడక్కడ మెరుగులు దిద్దినట్టు కల్యాణి కళ్లలో మెరిసింది. అందువల్ల ఆమె కళ్లు కూడా మెరిసేయి.

"నా పేరు..."

"తెలుసు. కల్యాణి కదూ? ఫస్ట్ ప్రైజు మీాకే వచ్చింది."

"అరే." అని చాలాసేపు ఆశ్చర్యపోయింది కల్యాణి. "మీారే బాగా పాడేరు. మీాకు రావల్సింది." అంది.

ఇంతలో 'బోయ్' టీ తెచ్చేడు బిస్కట్ల ప్లేటతని ముందుంచి 'తీస్కోండి' అంది కల్యాణి. అతనతి మొగమాటంగా తినడం ప్రారంభించేడు. "మీారు తీస్కోండి." అన్నాడు. "తీస్కుంటాను" అని నవ్వుతూ అంది కల్యాణి. అని బిస్కట్టు ప్లేట్లోంచి తీస్కోంది.

"డాడీ పడుక్కున్నారు. వొంట్లో బావు లేదులా వుంది."

"ఓ. అయాంసారీ....."

"ఊహుఁ! సారీ చెప్పవల్సింది నేను. మరో రోజు మీారొచ్చి తప్పకుండా పాడాలి."

ఇద్దరూ టీ తాగేరు. కొంత నిశ్శబ్దం అతి సున్నితంగా అతి అందంగా కరిగి పోయింది.

"ఏమైనా మాట్లాడండి." అంది కల్యాణి.

అతను కాస్సేపాగి అన్నాడు. "వరద బాధితులకి సహాయార్థం ఓ పెర్‌ఫార్మెన్స్"

కల్యాణి మధ్యలో ఆ సంభాషణ తెంపేసింది.... "నో..నా అలాంటి వెందుకు... మనూళ్లో కొత్తగా ఓ నైటక్లబ్ పెడుతున్నారు. ఆ నైట్ చూశేరా? ఇటీజ్ సో నైస్" అందామె. అప్పుడు బాలరాజు అతివిచిత్రంగా ఆమె వేపు చూశేడు. మరి కాస్సేపేదో మాట్లాడేక "నే వెళ్తానండీ. థాంక్యూ వెరీమచ్." అని లేచేడు బాలరాజు. అతని ఫీలింగ్ మాత్రం దెబ్బతిందని కల్యాణికి తెలీలేదు.

"అప్పుడే వెళ్తారా?"

"ఊఁ! వెళ్లాలి."

"సరే కానీండి. మళ్లీ ఎప్పుడొస్తారు?"

"చెప్పలేను."

"అలాకాదు. ఎల్లుండాదివారం తప్పకుండా రావాలి."

"ఐ విల్ ట్రై"

"నోనో! తప్పకుండా రావాలి. ఆ షరతు మీాదే మిమ్మల్నిప్పు డొదుల్తున్నాను."

అతన్నవ్వి "అలాగే లెండి." అని గేటు వేపు నడిచేడు. అతన్ని గేటుదాకా దిగపెట్టి లోపలికి వచ్చిన కల్యాణి రూంలో ట్యూబ్ లైటు కాంతి తగ్గినట్టు ఫీలయింది. ఇంకా అప్పటిదాకా హృదయంలో ఏదో మూల మెల్లిగా అతి మెల్లిగా అతి మెలోడియస్‌గా వినిపించిన పాట ఆగిపోయినట్టు కూడా అనిపించిందామెకి.

* * *

"మార్వలస్. అద్భుతంగా పాడేరు."

చాలా మెల్లిగా వాచీలన్నీ తిప్పి, ఇంకా మెల్లిగా, అతిమధురంగా వచ్చిన ఆదివారం. సాయంత్రం ఐదున్నర దగ్గర కాస్సేపాగింది.

పాటపూర్తి చేసిన బాలరాజు "థాంక్స్" అన్నాడు.

"చాలా బాగా పాడేవబ్బాయ్. ఇటీజ్ వెరీ నైసిన్‌డీడ్" అన్నారు పైపు ముట్టించిన కల్యాణి నాన్నగారు. పైపు ముట్టించింది కల్యాణికాదు. వాళ్ళ నాన్నగారు.

కాఫీ తీస్కొని, కాసేపు కబుర్లు చెప్పిన్తరువాత, "డాడీ, మేమలా వెళ్లొస్తాం. ఓ. కే.?" అంది కల్యాణి.

"ఓయ్యస్." అని వాళ్ల డాడీ ఆరిపోయిన పైపుని మళ్లీ వెలిగించేరు.

"వెళ్తానండీ. నమస్కారం." అన్నాడు బాలరాజు.

"ఆఁ ఆఁ! అప్పుడప్పుడూ వస్తూండవయ్యా." అన్నారతను.


"అలాగేనండీ." అన్నాడు బాలరాజు.

స్టేండర్డు కారు స్టీరింగు దగ్గర కూర్చొని,

"ఎక్కడికెళదాం?" అంది కల్యాణి.

"అయాం సారీ. నేనింటి కెళ్లాలి." అన్నాడు బాలరాజు కారు బైట నిలబడి దూరంగా ఆకాశంలోకి చూస్తూ.

అప్పుడు కల్యాణి డోర్ దగ్గరగా జరిగింది. అతని వైపు అదోలా చూసింది.



"ఇక్కడ మీరెలా వున్నారో తెలుసా?" అంది.

"తెలీదు." అన్నాడు బాలరాజు చాలా సీరియస్‌గా.

"కాని వినండి. గ్రీకు శిల్పాలా చాలా గంభీరంగా వున్నారు. 'హీ లెఫ్ట్ ట్విస్ట్' సినిమాలో హీరోలా వున్నారు."

"ఏమో! నేను సినిమా చూళ్లేదు."

"పోనీ, తొందరేం లేదు కదండీ: వచ్చి కూర్చోండి. అలా రామకృష్ణా పార్క్‌కి వెళదాం."

"రాక తప్పదంటారా?"

"ఏమీకాదు తప్పదు."

"అరె! అక్కడ కాదిక్కడ" అని ఫ్రంటు డోర్ తలుపు తీసి స్టీరింగు పక్క సీటు చూపించింది కల్యాణి. బాలరాజు కూర్చున్నాక కారు కదిలింది.

"ఆడపిల్ల ఏమడిగినా కాదనకూడదు. అంటే, చాలా బాధ పడతారు." అన్నాడు బాలరాజు.

"ఓహో". అయితే అందుకనా మీరు వస్తున్నది?" అంది కల్యాణి. బాలరాజు మాట్లాడ్లేదు. "కాదనడానికి నోరు రాలేదనండి. నే నడిగిన తరువాత కూడా కాదన గలరా?" అని మళ్లీ ఆమే అంది. అలా అన్నప్పు డామె కళ్లు అతిగర్వంగానూ, అతి అందంగానూ మెరిసేయి.

కారు టర్నింగు తిరిగింది.

అప్పుడే వెన్నెల పెల్తిగా పరుచు కుంటోంది. దూరంగా పార్కు తీరని కోరికలా అతి మొండాగానూ, తీరబోయే కోరికలా అతి అందంగానూ కనబడుతోంది.

"మీ డ్రైవర్ లేడా?" అడిగేడు బాలరాజు.

"వున్నాడు. నేనే ఇవాళ రావద్దన్నాను."

కారు పార్క్ పక్కటాగింది.

బాలరాజు దిగి ముందుగానే ఇసకలోకి నడిచేడు. వెనగ్గానే కల్యాణి కూడా వచ్చింది. "కూర్చుందామా?" అంది. బాలరాజు కూర్చున్నాడు. కల్యాణి పక్కనే కూర్చొంది.

ఓ ఐదు నిమిషాలు గాల్లో కలిసిపోయేయి. ఏమీ మాట్లాడని బాలరాజుని చూసి కల్యాణికి చాలా బాధ వేసింది. "ఏమిటీ మనిషి నిర్లక్ష్యం? తనంటే లెక్కే లేదా? అందుకేనా తనకితనంటే ఇంతిష్టంగా వుంది." అనుకుందామె.

దూరంగా సముద్రంలోకి చూస్తున్న బాలరాజుని చూసి,

"ఏమైనా మాట్లాడండి." అంది.

"ఏం మాట్లాడమంటారు?" అని కాస్సేపాగి "నాది ఫైనలియర్. పరీక్షలు దగ్గర కొస్తున్నాయి." అన్నాడు బాలరాజు.

"అబ్బ! పరీక్షలు తప్ప మరో టాపిక్కే లేదా? ఫిలింఫేరవార్డ్స్, బినాకా గీత్‌మాలా, ఇవేమైనా మాట్లాడండి. లేపోతే క్రికెట్ స్కోరు, ఎల్విస్ ప్రెస్లే పాటలు—ఇవైనా సరే."

"అయాం సో సారీ. ఇవేవీ నాకు తెలీవు. దేశంలో దరిద్రం గురించి కావలిస్తే మాట్లాడతాను. ఇంకా మన వైజాగ్ సందుల్లో వున్న పరిశుభ్రత గురించైనా సరే!"

అతనలా అన్న తరువాత కల్యాణి నవ్వింది.

"చాలా విట్టీగామాటాడతారు." అంది.

అతనేమీ మాట్లాడలేదు. కనీసం కల్యాణి పక్క చూడనైనాలేదు. అందువల్ల బీచిలో పెరిగిపోతున్న వెన్నెల్లాగ కల్యాణి మనసులో బాధ కూడా పెరిగిపోయింది. "తనంటే ఈ నిర్లక్ష్యమేమిటి?" అనుకుంది. "తనకి మాత్రం బాలరాజంటే చాలా ఇష్టం" అని కూడా అనుకుంది.

కాస్సేపయ్యాక, "వెళదాం లెండి" అని లేచేడు బాలరాజు.

"మీతో ఏదో చెప్పాలనుకున్నాను." తెలి కుండానే అంది కల్యాణి లేచి నిలబడ్డ బాలరాజు సముద్రం పక్క చూస్తూనే "చెప్పండి" అన్నాడు.

కల్యాణి అతని 'ప్రొఫైల్'ని పరీక్షగా చూసింది. తెల్లని సిల్కు పంట్లాంలో గులాబీరంగు టెర్లిన్ చొక్కా 'టక్' చేసిన బాలరాజు, మంచుకొండల్లో గులాబీరేకులు పేర్చినట్టున్నాడు. పూర్తిగా పురివిప్పిన వెన్నెల్లో అతను మరో వెన్నెల్లా అతి అందంగా వున్నాడు.

"ఊహూ! ఇప్పుడు కాదు! మరోసారి." అని లేచింది కల్యాణి.



ఆ తరువాత రామకృష్ణా మిషన్‌హోమ్‌కి వెళ్ళని స్టాండర్డు కారులో దిగే అందమైన బంటుకి అతిగా అలవాటుపడిపోయింది. మూణ్ణెల్ల క్రితం పాత వాచీ ఓమూలపడేసి కల్యాణి కొత్తగా కొన్న స్క్వేర్ వాచీలో పదిహేనో తారీఖు రెండుమార్లు పూర్తిగా తిరిగి మూడోసారి మళ్ళీ కనిపించింది.

ఆరాత్రి బెడ్ రూంలో ఆకుపచ్చని బెడ్ రూం లైటు వేపు చూస్తూ, గుండెల మీద "టెంపెస్ట్" పుస్తకం పెట్టుకుని చాలా జాగ్రత్తగా బాలరాజు గురించి ఆలోచించింది కల్యాణి.

"అతనితో మూణ్ణెల్లు తిరిగేను. కనీసం యాభైసార్లైనా టీ ఇచ్చేను. అతనింకా స్పష్టంగా తీసుకోకపోయినా, మనసిచ్చేను. అతను అతి అందంగా వుంటాడు. అందంగా పాడతాడు. ఇవన్నీ కాక మరేదో ఆకర్షణ... ఔను. నిర్లక్ష్యం! తనని, తన మనువుని

విర్లక్ష్యం. చేసినట్టుంటాడు. అందుకే నేమో తనకంత ఆకర్షణ? ఏదేమైనా ఎందుకో తమిద్దరి గురించీ ఎన్నో అనుకుంటున్నారు. ఐనా అతను లెక్క చెయ్యలేదు. తనతో తిరుగుతూనే వున్నాడు అంటే...అతనూ తన్ని ప్రేమిస్తున్నాడన్న మాట....ప్రేమించకేం చేస్తాడు? తనందం, తన డబ్బూ, తనే అతన్ని కోరి ప్రేమిస్తే, అదతనదృష్టంకాదూ? ..... ఐనా రేపే ఏ విషయం. తెలుసుకోవాలి." అనుకున్నాక కల్యాణి మరి కాస్సేపు మధురమైన ఆలోచనలకీ, స్మృతులకీ మధ్య సొమ్మసిల్లి ఒక్కసారి లేచింది. తన డ్రాయర్లోంచి గులాబీరంగు కాయితం తీసింది. పెన్ను తీసి అతి జాగ్రత్తగా, అతి అందంగా రాసింది.

బాలరాజుగారూ,

మీరు నిజంగా బాలరాజులే! ఇన్నాళ్లూ మీతో తిరిగి, మీ పరిచయపు స్మృతుల నీడల్లో కలలని పరుచుకున్న, ఈ అమ్మాయి మనసు మీకింకా అర్థం కాలేదంటే నాకు నిజంగానే చాలా ఆశ్చర్యంగానూ, బాధగానూ వుంది. ఇంకా, మొదటిసారి, మీమనసు లాక్కున్న అదృష్టం నాదైనందుకు చాలా సంతోషంగా కూడా వుంది. ఏ క్షణం తీరిక దొరికినా నేనేం చేస్తానో తెలుసా? మనసులో ముద్ర వేస్కున్న మీ రూపాన్ని కళ్ల ముందు పరుచుకుని, రికార్డైన మీపాటల్ని వింటూంటాను. అయాం సారీ! మనసింకా నా దగ్గరే వుంది. మీ పెర్మిషన్ కోసం చూస్తోంది. అన్నట్టు డాడీ ఏమీ అనరు. నేనెంతంటే అంతే! ఏమంటారు?

మీ—కల్యాణి

అని వుత్తరం రాసి, చాలా గర్వంగా, సంతృప్తిగా, ఆకుపచ్చని బెడ్‌రూం లైటు నీడలో అంత అందంగానూ నిద్రపోయింది కల్యాణి.

*   *   *

మరో నాలుగురోజులు పోయాక ఆదివారం, వణుకుతూ, సున్నితంగా అందంగా, గర్వంగా వచ్చింది. సాయంత్రం బాలరాజొచ్చేడు.

"ఇవాళ ఎక్కడికీ వెళ్లొద్దు" అంది కల్యాణి.

"అలాగే. నాకోసారి ఎకనామిక్స్ టెక్స్టివ్వండి." అన్నాడు బాలరాజు.

"ఒక్క ఎకనామిక్స్ టెక్స్టేనా?"అంది కల్యాణి. అలా అన్నప్పుడామె కంఠం లీలగా, హాయిగా వణికింది.

బాలరాజు కొత్తగా చూసేడు. "ఊఁ" అన్నాడు.

కల్యాణి లోపలికెళ్లి పుస్తకం తెచ్చింది. "తీస్కోండి." అంది. బాలరాజు తీస్కున్నాడు. "మీ పాట పాడతారా?" అంది కల్యాణి.

"సారీ! పాడను.చదువుకోవాలి. వెళ్తాను" అని లేచేడు బాలరాజు.

"మీ ఇష్టం. మళ్లీ త్వరలో రండి. వస్తారు కదూ?"

"ష్యూర్—రెండు మూడ్రోజుల్లో మీ పుస్తక మిచ్చేస్తాను." అని వెనక్కి తిరిగేడు బాలరాజు.

ఆ తర్వాత మెల్లిగా నడుస్తూ వెళ్లిపోయేడతను.

కల్యాణి మనసు అతి మధురంగా, కొంచెం భయంతోనూ, అతి గర్వంగా కొంచెం వణుకుతూనూ నిట్టూర్చింది.

*   *   *

మరో సెలవురోజు బాలరాజు రావలిసిన రోజు డ్రాయింగ్ రూంలోనే సాయంత్రమయేసరికల్లా కూర్చుంది కల్యాణి.

"బాలరాజు. వస్తాడు. రోజూలా కాదు. ఇంకా అందంగా, కొత్తరకంగా వస్తాడు. వచ్చి......"

"హలో! గుడీవెనింగ్."

"అరే! వచ్చేరా?" అని లేచింది కల్యాణి ఆమె కెదురుగా బాలరాజున్నాడు. అతని మొఖం మీద చిర్నవ్వూ, చేతిలో ఎకనామిక్స్ టెక్స్టూ వున్నాయి.

"ఔను. బహుశా ఆఖరిసారి. మీ వుత్తరం చదివేను. ఏమీ చెప్పదల్చుకోలేదు అంతా రాశేను. మీ పుస్తకమిదిగో. థాంక్యూ వెరీమచ్!!" అని పుస్తకం టేబిల్ మీద పెట్టి అతను వెనక్కి తిరిగేడు. మెల్లిగా నడుస్తూ వెళ్లడం ఇష్టంలేనట్టు వెళ్లిపోయేడు. అప్పుడు కల్యాణి మనసులో వెయ్యి దీపాల వెలుగు మెరిసింది. అందులో బాలరాజు మెరిసేడు.

గబగబా అతితొందరగా తన రూంలోకి వెళ్లి పుస్తకం మధ్యనున్న కాగితం తీసింది కల్యాణి.

కల్యాణిగారూ!

మీ నెంబరు పదహారో, పదిహేడో జ్ఞాపకం లేదు. ఐనా మీకు జవాబివ్వాలి. ఇవ్వక తప్పదు. మీ రాసిన వుత్తరం చాలా బావుంది. గుడ్! కృషి చేస్తే మంచి కథలు రాయొచ్చు మీరు. మీకు బాగా



జబ్బా హిందీ కామెడీ చిత్రంలో హీరోయిన్ ఫాదర్‌లాంటి డాడీ వున్నారు. నాకేమీ లేవు. నాకు బోలెడు బాధ్యతా, మీ అంత డబ్బు లేనితనం వున్నాయి. మీరు నాతో మాట్లాడిన మాటలు బట్టి నా కో విషయం తెలిసింది. మీకున్న డబ్బుతో మీరేమైనా చేయగలరన్న అభిప్రాయం మీకున్నట్టు—న్స్ ! సో ఇన్సోలెంట్. మీలాగ గర్వం హోదా నాకవసరంలేదు. ఎక్స్‌క్యూజ్‌మీ! నా స్నేహితురాలిగా—మీకు స్థానం మాత్రం ఎప్పుడూ వుంది. మీ అందమన్నా పాటన్నా నాకు చాలా ఇష్టం. గర్వాన్ని జాగ్రత్తగా ఏపుగా పెంచేసిన మీ మనసంటేమాత్రం కాదు. మీ మనసు నాకిచ్చినా అదివెంటనే తిరిగొచ్చేస్తుంది. అంచేత జాగర్తగా మీ దగ్గరే దాచుకోండి.

డబ్బుతో ఏమైనా కొనగలరుకాని మనసునిమాత్రం కాదు.అంతే—మీ 'టీ'లకీ మగాళ్ళ కంపెనీకి నా థాంక్స్.ఉంటాను.

బాలరాజు.

ఉత్తరం చదివిన కల్యాణి అలాగా కాస్సేపుండిపోయింది. జీవితంలో మొదటి సారి—ఆమె కళ్ళు పొదుపుగా, అతి పొదుపుగా కన్నీళ్ళు కార్చేయి. అప్పుడామె డైరీతీసి వణుకుతున్న చేతులతో రాసింది.


“జీవితంలో మొదటిసారి ఓడిపోయాను. అతను.....అతన్నిమాత్రం మర్చిపోలేను. అతన్లో ఏదో ఆకర్షణుంది. ఏం చేయడం ? ఏమీ లేదు. కాని...... ఇన్నాళ్ళూ మనసుని పరుచుకుని ఏపుగా మల్లె పొదలా పెరిగిపోయిన ఏదో భావం మాత్రం—విరిగిపోయింది.”

అలా రాసి అలానే ఉండిపోయింది కల్యాణి.

ఆమె కళ్ళల్లోంచి రెండు కన్నీటి బొట్లు జారి డైరీ కాగితంమీదపడ్డాయి. అందువల్ల ఆమె రాసిన అక్షరాలు కొన్ని అలుక్కుపోయి అందంగా చెదిరేయి.

లైటు వేయకపోయినా—గదిలో వెల్లి వెన్నెల మాత్రం మత్తుగా పచ్చగా పరచుకుంటోంది.

మనుష్యుల మమతలు




మంగళా కందూర్

శీర్షికంచూసి ఇదేదో సినిమా పేరు లాగుంది, ఇదీ ఒక కథే కాబోలు అని మీరు అనుకొంటే పొరబడ్డట్టే. సహజంగా మనకు బంధువులపైన, స్నేహితులపైన ఎక్కువైన మమతలుంటాయి. ఇవేగాక ఇతర వాటిపైన, అనగా తోటపని, కుట్లు, ఇంటి అలంకరణ, బట్టలయందు శ్రద్ధ, రేడియో, పుస్తకాలు, వంటలు, రచనా వ్యాసంగం మొదలైన ఎన్నిటిపైనో మమకారాలు ఉంటాయి. ఈ మమతలపైన ఒక లిమిట్ ఉండాలి. హద్దు మీరామంటే లేనిపోని [illegible]కి గురి కావలసి వస్తుంది. మన మామూలు దినచర్య కాకుండా పైవాటిలో కొన్నింటిపైన మమతలుంటేగాని ప్రతిదినము మనము 'ఫ్రెష్' గ ఉండలేము. ప్రతి స్త్రీకి వంట, వార్పు కాకుండా కొంచం మార్పు కావాలి. ఈ మార్పుకోసమే స్త్రీ పై వాటిని ఆశిస్తుంది. దేనిమీద అభిమానముంటే దానిపైన శ్రద్ధ చూపి తన పనితనం చూపి ప్రతిఫలం అందుకొంటుంది.

తోటపైన ఒక్క మక్కువేగాక, దాని విషయం బాగా తెలిసివుండి, ఏ కాలంలో ఏ మొక్క వేయాలి, ఎప్పుడు ఎరువువేయాలి మొదలైన విషయాలు బాగా తెలుసుకొని మొక్కవేస్తే అది బాగా ఎదిగి పెంచినవారికి ఆనందాన్ని, ప్రతిఫలాన్ని అందజేస్తుంది. ఒకవేళ తెలియకపోయినా అగ్రికల్చర్ డిపార్టుమెంటుకువెళ్లి ఏ మొక్కకు ఏ ఎరువు ఎంత వేయాలి, ఎలా వేయాలి అని అడిగితే వారు తగు సలహాలు ఇస్తారు. తోట పెంపకానికి ఈ విషయాలేగాక స్వతహాగా నైపుణ్యం ఉండాలనే నిజాన్ని నేను కాదనలేను. కొన్ని సంఘటనలను నేను స్వయానాచూసి ఈఅభిప్రాయానికి వచ్చాను. ఇక్కడే మాకాంప్‌లో నా ఫ్రెండ్ ఒకామెవుంది. ఆమె ఏ చెట్టు వేసినా చావకుండా పెద్దవై పువ్వులు, కాయలు, పండ్లుపూస్తాయి. అదీ మామూలుగా పెరగడంకాదు. విచ్చలవిడిగా పెరుగుతాయి. ఆమెతోట రెండేళ్లలో ఎంత అభివృద్ధిగాంచినదో నేను చెప్పలేను మరి. ఆమె పేరుకు తగ్గట్టు ఇంటిలో అనేక రకాలపూలచెట్లు 3, 4 రకాల గులాబీలు, రకాల మల్లెలు, లిల్లీ, కనకాంబరాలు, మందార, గన్నేరు, డిసెంబరుపూలు ఇలా ఎవి రకాలో చెప్పలేను. ఆమె తలలో సీజనును బట్టి ఆయాపూలు వుంటాయి ఎప్పుడూ. జాజుల పరిమళం అయితే మరీ మత్తెక్కిస్తుంది. ఇక జామ, సపోటా, దానిమ్మ, నిమ్మ, దబ్బ, మామిడి పళ్ల చెట్లు. జామ పండయితే ఒక్కొక్కటి పెద్ద బత్తాయి పండంత వుండి ఎంతో మధురంగా వుంటాయి. ఇంటివెనక కిచన్‌గార్డెన్‌లో మంచి పళ్ల అరటి, మునగ, కరివేపాకు, పుదీన మొదలైన ఆకు కూరలు, సీజన్‌ను బట్టి కాయగూరలు. ఒక్కొక్క మునగకాయ అర గజం పొడ వుంటుందంటే మీరు నమ్మలేరు. వున్న స్థలమేమీ పెద్దదికాదు. కాని వున్న స్థలంలోనే పొందికగా పెంచారు తోటను. సీజన్ వస్తే ఒక్కొక్క గులాబి చెట్టుకుసుమారు50,60పూలుపూస్తాయి. అలాంటి చెట్లు సుమారు 15,20 వుంటాయి. అన్ని చెట్లలోను గులాబులుపూసి సువాసనలు వెదజల్లుతూ వుంటే, చూడ మనోహరంగా వుంటుంది. ఎప్పుడు వాళ్ల ఇంటికి వెళ్లినా ముందు తోటచూసి మరీ ఇంట్లోకి వెళ్తాను. అందుకే ఆమె అప్పుడప్పుడు [illegible] వహిస్తుంది "మీకు నాకన్నా నా తోటే ముఖ్యం" అని.

కుట్లు విషయానికొస్తే చాలా ఏళ్ల క్రితం "కుట్లు, తిట్లు, ఇక్కట్లు" అనే వ్యాసం గుర్తుకొస్తుంది. మన కుట్లు ఇంటివారిని మరీ ఇబ్బందిలో పెట్టేటట్టు వుండకూడదు. ఏదైనా కొత్త కుట్లు మొదలు పెట్టేటప్పుడు చూడాలి నాది పరిస్థితి. కుట్టు సక్కగా కుదిరిందంటే ఆ సంతోషంలో ఏపని చేయ బుద్ధిపుట్టక కుట్టిన దానిని పదేపదే చూడటం, కుదరక పోతే అయ్యో, ఎలాగబ్బా, గిలిని విరిచేయటం! అనే యావనలో అసలే పని చేయక పోవడం. ఎలాగైనా కుట్టుపూర్తి గా ముగిసే వరకూ ఇంట్లో పనులు సగం సగమే అవుతాయి. వాకైతే మరీనూ. కుట్టు కుదరక పోతే అస్సలు సహించదు, పైగా దిగులు, మనసు బాగుండదు. ఆ బాధ ముఖంమీదనే వ్యక్తమౌతుంది ఎంత ప్రయత్నించినా బాధను లోపలణచి పెట్టలేను. నా శ్రీవారు ఆఫీసుకు వెళ్లేటప్పుడు నేను కుట్టే కోలాటం గమనించి వుంటారు. సాయంత్రం వారు వచ్చినప్పుడు [illegible] ముఖం ప్రసన్నంగా వుండకపోతే అప్పుడే కనిపెట్టి ఎగతాళి పట్టిస్తారు. "చ్...చ్... పాపం. వెధవ మిషన్. ఇది వుండబట్టే నీ మనసులో వ్యథ. దీన్ని అమ్మేస్తే ఏబాధా వుండదు. ఏమండీ ఏదైనా ఫ్రాక్‌గాని జాకెట్టుగాని కుదరలేదా? అని నీ మాట వినలేదులా వున్నాయి. వాటికింకా నీ సంగతి

తెలీదు. "రేపెలాగూ దాన్ని రిపేరు చేసే దాకా నడుస్తుంది" అని అంటారు. ఆయన ఎగతాళికి లోన వుండుకొంటున్నా నవ్వడానికి ప్రయత్నించేస్తే "లేనినవ్వు రావాలంటే ఎలా వస్తుంది? వచ్చినా అది సహజంగా వుండదు. ఎందుకో ప్రొద్దుటే ఇవాళ ఏ మూడ్స్ బాగుండవు. అయితే నేనలా క్లబ్బుకు వెళ్ళి వస్తాను" అని తప్పించుకొంటారు. నాకదే మంచిది. నిదానంగా తప్పు వచ్చిన దానిని విప్పి రిపేరు చేసి అప్పుడు తృప్తిగా నిట్టూరుస్తాను. ఒక్కోసారి అనిపిస్తుంది, ఈ కుట్లపైన ఎందుకింత పిచ్చి నాకు? అని.





ఇంటిఅలంకరణవిషయం చెప్పాలంటే— ఏమాట కామాటే చెప్పాలి. నాకు మాత్రం ఇల్లు శుభ్రంగా వుండాలి బాబూ, నేల వారీ అద్దంలాగ మెరవ నక్కరలేదు గాని, నీటి మరక, లేపిమరక, బిడ్డ మరక, సున్నం మరకమొదలైనవి వుండక, కాగితంముక్కలూ ఎండుపూలు, చెత్తచెదారం వుండకుండా వుంటేచాలు. ఎక్కడి సామాను అక్కడ అమర్చింది అమర్చినట్లువుంటే ఇంటివారికీ బయటివారికీ తేలికగా వుంటుంది. ఇంటిని చూసి ఇల్లాలిని చూడు అన్న సామెత అక్షరాలా నిజం. ఇల్లాలు టిప్‌టాప్‌గ తయారయి వుంటే చాలదు. దానికి తగ్గట్లు ఇల్లు వున్నదాన్లోనే శుభ్రంగా వుంచుకోవాలి.

చిన్నపిల్లలు వున్న ఇంట్లో మరకలు, వాసన ఉంటాయి. కాని ఎప్పటికప్పుడు ఒద్దికించక సీరువేసి వీలయితే ఫినాయిలు వేసి బట్టతో తుడిస్తే మరకలు, వాసన వుండవు సరికదా, దోమలు, ఈగలు రావడానికి కూడ అవకాశముండదు. గంటకు 10 మార్లు ఎవరు తుడుస్తా రబ్బా అని నిర్లక్ష్యంచేస్తే ఇల్లు అశుభ్రంగా వుండటమే గాక ఎవరైనా ఆ నీళ్లలో కాళ్లు పెడ్తే జారిపడే ప్రమాదం కూడ వుంటుంది. కాగితం ముక్కలు ఏవైనా పడేస్తే ఎప్పటికప్పుడు వేసిన వారితోనే నయాన్నో, భయాన్నో చెప్పి తీయించాలి. లేదా సీరియస్‌గా చెబితే ఎవరైనా లొంగి తీసివేస్తారు. అప్పటికీ లొంగని ఘటమైతే మనమే తీసి వాటిని వేస్టుపేపరు బాస్కెటులో పడేస్తే సరి. పిల్లల్ని మరీ జైలులోలాగ కట్టడిలో పెట్టమనికాదు గాని, వారికి ఆడుకోడానికి కొంత టైము ఇచ్చి, తర్వాత శుభ్రంగా అంతా తీసేయమని చెప్పడం బాగు. నేను పిల్లల్ని శుభ్రం శుభ్రం అని గోలపెడుతుంటే మా అమ్మ "మరీనమ్మా. మగవారు లేదుకదా. (మా శ్రీవారు ప్రస్తుతం అస్సాంలో డ్యూటీ చేస్తున్నారులెండి) ఎప్పుడూ శుభ్రం అంటావేం ఇంత పెద్ద ఇల్లు వున్నా పిల్లల్ని ఒక్క ఐదునిమిషాలు కూడా ఆడుకోనియ్యవు" అంటుంది (రెండు గంటలు ఆడుకోనిచ్చినా ఆవిడకు ఐదు నిమిషాలలాగ వుండవు. ఏం చెయను?) ఇదే సమయం అని మా చిన్నది "అవును అమ్మమ్మా. మమ్మీ ఎప్పుడూ ఇంతే" అని తాళం వేస్తుంది ఎందుకైనా మంచిది అని. అయినా ఒకరకోసం కాదుగా మనం శుభ్రంగా పెట్టుకొనేది. మనకోసమే! వర్షాకాలంలో అయితే మరీను. బయటి బురదంతా ఇంట్లోకే వస్తుంది. అందుకే గదిలోకి రావడానికి ముందు వరండాలో ఒక రెండు గోనెలుంచుతాను. (శ్రీవారయితే బూట్లకు బురద వుంటే "రావచ్చునా లోపలికి" అని అడుగుతుండేవారు. రాకూడదంటె వాటిని అక్కడనే వదలి లోనికి వచ్చేవారు. ఇల్లు శుభ్రంగా వుండాలంటే ఆ బాధ్యత ఒక్క గృహిణిపైనే గాక, పిల్లలు, మగవారు సహకరిస్తే బాగుంటుంది.

కొన్ని ఇండ్లకు కిటికీలు ఎక్కువగా వుండి, రోడ్డుకు వుంటాయి. అలాంటప్పుడు వాటిని తెరవనూ లేము. మూయనూ లేము. మూస్తే చీకటి. తెరుస్తే బయటి వాళ్లకు కనబడటం. అలాంటప్పుడు ఎన్ని కర్టెన్స్, వున్నాచాలవు. అందుకే సిల్కు చీరలు ఏవైనా చినిగినవి వుంటే (కట్టుకోడానికి వీలుకానివి) ఆ విసుగులను సరిచేసి కిటికీ తెరగా వాడవచ్చును. అలాగే ఈ సిల్కు చీరలను తలుపులకు కూడ కర్టెన్స్‌గ వాడవచ్చు. తెరను రెండు భాగాలుగా కుచ్చెళ్లు ఎక్కువ వుండేట్లుగా ఒక స్ప్రింగుకు (ప్లాస్టిక్‌ది అయితే మరీ మంచిది.) ఎక్కించి వ్రేలాడదీసి పైన సుమారు 6 అంగుళాల పొడవుగల బట్టను ఇంకో స్ప్రింగుకు కుచ్చెళ్లుగా ఎక్కించి దీనిపైన వేస్తే చూడ్డానికి చాలా చక్కగ వుంటుంది. ముఖ్యంగా కర్టెన్‌కు వేసే తెర తెరలాగ కనిపించకూడదు. లేకపోతే చూడ్డానికి ఎబ్బెట్టుగ వుంటుంది. నేను సిల్కుతెరలు కొనేటప్పుడు ఇది చినిగిపోతే కర్టెన్‌లకు బాగుంటుందా అని ఆలోచించి మరీ కొంటాను. (నవ్వకండి ప్లీజ్) కర్టెన్, కొంత మంచి చీరలన్నీ చింపేస్తున్నావేమిటి కొంప తీసి అని మా శ్రీవారు ఎగతాళి చేస్తుంటారు అప్పుడప్పుడు. ఎప్పుడూ చెయ్యరులెండి. ఎప్పుడూ ఎగతాళిచేస్తే ఎలాగా అంటున్నారు కదా అని మంచిచీరలే కర్టెన్స్‌గా వాడేస్తానేమో అని భయం. ఈ తెరలను (పాతవిలేక చినిగినవి) ఇంకొక రకంగా కూడ వాడవచ్చును. ఈమధ్య అందరి ఇళ్లలో అలమార కన్నా గూళ్ళు

(45 వ పేజీ చూడండి)





మంచితనం

ద్విభాష్యం సూరీడు

(గత సంచిక తరువాయి)

నా ఎం. ఎస్‌సి. చదువు పూర్తయింది. అప్పటి కేదో రెండేళ్ళ నుంచి అన్నయ్య దగ్గర నుండి ఉత్తరాలు లేవు. బహుశా తీరికలేక రాసి వుండడనుకున్నాను. నేను వూరు బయల్దేరబోయే ముందు మాత్రం ఒక వుత్తరం వచ్చింది. చాలా సాధారణంగా ఏవో రెండు ముక్కలు రాశాడన్నయ్య, అన్నయ్య నుండి అంత చిన్న వుత్తరం రావడం అదే మొదటిసారి! మా వూరు వెళ్ళిన వెంటనే, 'అన్నయ్యను చూసి వస్తానమ్మా!' అంటూ ఆ వూరు బయల్దేరాను.

అన్నయ్యను చూడగానే షాక్ తిన్నంత పని అయ్యింది. అన్నయ్యతో ఒక్కరోజు గడిపే సరికి మతిపోయినట్లయింది! అన్నయ్య అంతకు ముందన్నయ్యలా లేడు! చాలా యాంత్రికంగా జీవితం నడుపుతున్నాడు! ఇంతకుముందు తన ముఖంలో ఎప్పుడూ తాండవించే చిరునవ్వు ఎక్కడికిపోయిందో కనుపించడంలేదు. ఎవరే పనిచెప్పినా, ఎక్కువ మాట్లాడకుండా చేసేస్తున్నాడు. తానుంటున్న పోస్ట్ మాస్టారింట్లో పిల్లలందరూ, అన్నయ్య వస్తూంటే, కోపంగా చూసి, "రామారావు మంచి కాదు!" అన్నారు ఏక కంఠంతో! ఆ మాటలు నా చెవులతో వింటానని నే నెప్పుడూ వూహించుకోలేదు. తానంతలా ఎందుకు మారిపోయాడని అన్నయ్యని అడిగాను ఆ సాయంత్రం అలా షికారు కెళ్ళినప్పుడు.

అన్నయ్య చెప్పాడు—"తమ్ముడూ, ఆమె లేని ఈ యిసుక తిన్నెలెంత పేలవంగా కనుపిస్తున్నాయో చూడు! ఇంక ఆమె ఇక్కడికి రాదు. వాళ్ళు లూఢియానాలో వుంటున్నప్పుడు వాళ్ళ నాన్నగారి క్రింద పనిచేసిన కో ఆఫీసరు ఆమెపై కన్నేశాట్ట! 'ఆమె'ను అతని కిచ్చి పెళ్ళి చేద్దామని వాళ్ళ నాన్నగారు కూడా అనుకునేవారుట, 'ఆమె' మా ప్రేమ విషయం ప్రస్తావించినా, వాళ్ళ నాన్నగారు తన నిర్ణయాన్ని మార్చుకోలేదుట. ఒక నాడా ఆఫీసరు ఇక్కడి కొచ్చాట్ట. ఆరోజున నేనిక్కడ లేను. ఆ మర్నాడు అందరూ కలిసి లూఢియానా వెళ్ళిపోయారు. ఆమె పెళ్ళి అక్కడ జరిపించడం కోసం! అక్కడి కెళ్ళిన వెంటనే 'ఆమె' ఒక వుత్తరం రాసింది. తన పెళ్ళి జరగడానికి అయిదు రోజులు వ్యవధి వుందనీ, నే నెలాగైనా సెలవు చేసుకుని అక్కడికి వెళ్ళగలిగితే దేనికైనాసరే తెగించి, ఆమె నాతో రావడానికి సిద్ధంగా వుందనీ ఆ వుత్తరంలో తెలియపరచింది! ధైర్యంగా బయల్దేరదామనుకున్నాను. సైకిల్ షాపు వెంకన్న వచ్చి నాకడ్డు తగిలేడు. తన భార్యకు చాలా సీరియస్‌గా వుందనీ వెంటనే విశాఖపట్నం తీసికెళ్ళి హాస్పిటలో చేర్పించక పోతే ప్రాణం దక్కదనీ బ్రతిమాలాడాడు. ఆమెను హాస్పిటల్లో చేర్పించి అక్కడి నుండైనా వెళ్ళవచ్చుననుకున్నాను. హాస్పిటల్ వాళ్ళు అడిగిన డబ్బు వెంకన్న దగ్గరలేదు. నేనే సర్దుబాటు చేయవలసి వచ్చింది. హాస్పిటల్ వాళ్ళు నేనక్కడ అధమం రెండు రోజులైనా వుండడం అవసరమన్నారు. అవతల లూఢియానా, ఇవతల విశాఖపట్నం రెండూ నన్ను చెరోవైపుకీ లాగాయి. పాపం వెంకన్న అతి దీనస్థితిలో వున్నాడు. 'ఆమె' లూఢియానాలో అంతకంటె దీనస్థితిలో వుందని తెలుసు! తీరా వెంకన్నకు సాయపడకుండా అక్కడికి పోతే మాత్రం నా ప్రయత్నం ఫలిస్తుందని హామీ యేది? పైగా నా దగ్గర సరిపోయేటంత డబ్బులేదు. ఇక్కడికి వచ్చి డబ్బు తీసుకు వెళ్ళేందుకు అధమం ఇంకో రోజు పడుతుంది. ఇంత ముఖ్యమయిన సమయంలో వెంకన్నకి సహాయం చెయ్యలేకపోతే, వూరంతా నన్నెంతగా దూషిస్తారోనని భయం వేసింది, అంతే విశాఖపట్నం నుండి కదల్లేకపోయాను. 'ఆమె' నుండి తిరిగి జాబు రాలేదు. వెంకన్న

భార్యకు భగవంతుడు ఆయువునిచ్చాడు. ఆమెను తిరిగి యీ వూరు తీసుకు రాగలిగినందుకు అందరూ నన్నెంతగానో మెచ్చుకున్నారు. ఆనాటికి ఆ సంతోషంలో ఒక్క ఘడియసేపు ఆమెను మరచిపోగలిగా నంతే! మరునాటి నుండి ఏమిటో జీవితం చప్పగా కనుపించింది! అసలిక్కడికి రాబుద్ధి పుట్టడంలేదు. నాలోని జడత్వమే ఈ అనర్థానికి కారణమనుకుంటాను. నే స్వార్థపరుణ్ని తమ్ముడూ! ప్రజల నిందా వాక్యాలకు భయపడి నా జీవిత జ్యోతినే పోగొట్టుకున్నాను! ఇంతకూ మా యిద్దరికీ వివాహం జరిగేందుకు భగవదేచ్ఛ లేదనుకుంటాను.. అందుకే ఎవరి తప్పూ లేకుండా యిలా జరిగింది.''

మొట్టమొదటి సారిగా నా కళ్లమ్మట నీళ్లు రాలాయి! నే సృష్టించుకున్న 'హీరో'కి, —నా 'రామారావు'కి—ఇంతవిషాదం సంభవించడం నేభరించ లేకపోయాను! అన్నయ్యని ఓదార్చడం కూడా మరచాను, నాహీరో నాకళ్ల ముందు విచారవదనంతో ప్రత్యక్షమయేసరికి!

నా స్థితి గమనించకుండా తన ఆవేశంలో తను చెప్పుకుపోయాడన్నయ్య. "తన చెలిమితో నా జీవితానికే నో నూతనత్వం ప్రసాదించింది. తన నవ్వులతో నాలోని ప్రతి అంగుళాన్నీ పులకరింపజేసింది. తన ఆటలతో, పాటలతో ఈ ప్రదేశాన్నే నో స్వర్గలోకంగా మార్చివేసింది. అలాటి 'రమ', ఇక్కడి కింకరాదు! ఆమె స్నేహానికి నోచుకోని నిర్భాగ్యుణ్నవుతానని ఎప్పుడూ అనుకోలేదు. అందుకే, నా గర్వాన్ని అణచడం కోసమే భగవంతు డిలాచేశాడు."

అన్నయ్య ఇంకా భగవంతుడి గురించి మాట్లాడ్డం నాకు చిరాకు కలిగించింది. వాడి చాదస్తమే వాడి దుస్థితికి కారణం. తనను నమ్ముకున్న ఓ అందాల పడుచు తనను కాపాడమని ఉత్తరం రాస్తే, కదలకుండా కూర్చున్నాట్ట! అంత చాతకాని తనం అన్నయ్యలో ఉంటుందని నే ననుకోలేదు. అన్నయ్య మీద జాలి కలగడానికి బదులు కోపం వచ్చింది. నా హీరో జీవితాన్ని పాడు చేశాడని!

"ఇప్పటికే చాలా ఆలస్యం చేశావు ఈ వూరు వదలిపో! సుఖంగా ఏ సిటీలోనో మంచి ఉద్యోగం చూసుకో, ఎందుకొచ్చిన అవస్థ లివన్నీ నీకు!'' అంటూ మందలించబోయాను.

కాని అన్నయ్య సంగతి మీకు తెలిసిందేగా! అనవసరంగా జీవితానికి ఒక ప్రాధాన్యత ఇస్తాడు. ఆ వూరి వాళ్ల మీద ఉరికే జాలి పడిపోతాడు. 'మానవసేవ' అనే పదంలో తనకు చాలా అర్థం కనిపిస్తుందంటాడు. వాళ్లందరికీ సహాయంగా ఉండగలిగే భాగ్యం తనకు భగవంతుడు ప్రసాదించినందుకు తానెంతో గర్వపడుతున్నానంటాడు!

అందుకే ఎంతో దర్జాగా జరగవలసిన తన జీవితాన్ని అలా పాడు చేసుకున్నాడు!!

ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. నా బాధ అన్నయ్య గురించికాదు నా'హీరో' గురించి! తిరిగి నా 'హీరో'లో నూతన జ్యోతి ప్రకాశించాలి! అప్పుడే నాకు నిద్ర పట్టాలి! నా 'హీరో' కథ ఎంతో అందంగా వుంటుందని సంబరపడ్డాను. తన చేతులారా పాడు చేశాడన్నయ్య. అన్నయ్య మీద అంతుపట్టని కోపం వచ్చేస్తోంది. నిద్ర పట్టక, లేచి మంచం మీద కూర్చున్నాను. ఎదురుగానున్న మంచం మీద అమాయకంగా నిద్రపోతున్న అన్నయ్య కనుపించాడు. పాలిపోయిన చంద్రుడు కిటికీలో నుండి విచారంగా అన్నయ్య వంక చూస్తున్నాడు. అన్నయ్య మీద కోపం అంతా ఒక్కసారి మాయమయ్యింది. "అన్నయ్య రమను మరచేలా చేస్తేగాని, తిరిగి అన్నయ్య మామూలు మనిషిగా మారడు!'' అనిపించింది. "అవును! నా శాయశక్తులా ప్రయత్నించి, ఎలాగోలాగ, నే నది సాధించాలి! అన్నయ్యకు కనీసం ఈ వుపకారమైనా, చెయ్యాలి!'' అని నిశ్చయించుకున్నాను.

నాకు తెలుసు పెళ్లి చేసుకోమని బతిమాలినా అన్నయ్య ఆ పరిస్థితిలో ఒప్పుకోడని! అందుకని ఆవిషయం గురించి నాన్నగారికి తెలియపరచడం కూడా అనవసరమే! మా అనుమతి లేనిదే మా పెళ్లిళ్ల విషయాల్లో జోక్యం కలిగించుకోనని నాన్నగారు ఎప్పుడో చెప్పారు మాకు!

'ఆమె'ను మరచిపొమ్మనీ, తిరిగి అంతకు ముందులా ఉత్సాహంగా కనుపించమనీ అన్నయ్యకు ఎన్నిసార్లు నూరిపోసినా, అన్నయ్యలో ఏమీ మార్పు కనుపించలేదు!

ఒకనాడు మామయ్య గారింటికి వెళ్లాను. శ్యామల ఆ మరునాడే ఆ వూరు వస్తున్నట్లు ఉత్తరం వచ్చిందని మామయ్య చెప్పారు. అన్నయ్య గురించి ఆలోచిస్తూ పాపం ఆమెకు అంతవరకూ ఉత్తరం కూడా రాయలేదని అప్పుడుగాని గుర్తు రాలేదు. ఆమె వస్తోందిగదా అని చాలా సంతోషించాను, నా భారాన్ని కొంతవరకు ఆమె కూడా భరిస్తుందిగదా అని!

ఆరాత్రి కలత నిద్రలో, మెరపులాటి ఒక ఆలోచన తట్టింది! బాగా ఆలోచించాను. ఆ ఆలోచన మంచి ఆలోచనే నని పించింది.

శ్యామల చాలా చురుకైన పిల్ల అని మీ కింతకుముందే చెప్పాను. నిజానికి రమ కంటె కూడా హుషారుగా కనిపిస్తుంది. దేన్నీ సీరియస్‌గా తీసుకోదు! ప్రేమ, జాలి, కరుణ, సేవ, మొదలైన పదాలకి నాకు లాగే ఆమెకూ అర్థం తెలియదు. జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకుంటుంది. తాను ఏదైనా సాధించాలని నిర్ణయించుకుందా—ఎలాగోలాగ తప్పకుండా సాధిస్తుంది! శ్యామల రాగానే, మా ప్రేమ విషయం పూర్తిగా మరచిపోయి, అన్నయ్యని ప్రేమించమని చెప్పాలి! తన ఆటలతో అన్నయ్యలో తిరిగి ఉత్సాహం రగుల్కొల్పమని బతిమాలాలి! అన్నయ్య 'రమ'ను మరచేలా చూసి, అన్నయ్యను వివాహమాడడానికి తను సిద్ధపడమని కోరుకోవాలి! అదే నా ఆలోచన!

శ్యామల నా కోర్కెను మన్నిస్తుందని ధైర్యపడ్డాను. మా యిద్దరిమధ్యా ఏర్పడిన ప్రేమ పెద్ద లెక్కలోదికాదు. మా మనస్తత్వా లొకటే గనుక, పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అనుకున్నాంతప్ప, ఒకరినొకరు అదే పనిగా ఎప్పుడూ ఆరాధిం

కోడం జరగలేదు.

మరునాడు శ్యామల వచ్చింది. పరీక్ష లయిపోయాంట గనుక నిజంగా నన్ను ప్రేమించేద్దామని తను వచ్చినట్లు ఇంటికి రాగానే నాతో వేళాకోళమాడింది! నే తిరిగి ఏమీ జవాబు చెప్పకపోయేసరికి కొంచెం ఆశ్చర్యపడింది!

ఆమెను సాయంత్రం కలుసుకుంటా నని చెప్పి, అన్నయ్య గదికి వచ్చేశాను. ఆరోజు అన్నయ్య ఆఫీసుకి వెళ్లలేదు. మధ్యాహ్నం రెండు గంటలవుతుంది. అన్నయ్యా నేనూ గదిలో ఉన్నాము. తలుపు కొట్టారెవరో! తలుపు తెరిచేసరికి శ్యామల ప్రత్యక్షమయింది ! కొంచెం ఆశ్చర్య పోయాము.

"హల్లో పెద్ద బావా! ఏమ్మా తమ్మైనా అసలు గుర్తున్నానా? అబ్బ! ఎంతలా మారిపోయావ్రా? మనం కలుసుకుని పదేళ్ల పైగా అయింది కదూ? ముందీ బొంబాయి హల్వా కానివ్వండి. తర్వాత కబుర్లు చెప్పు కుందాం" అంటూ ఓ పేకెట్టు నా చేతిలో పెట్టింది! ఆమె చనువు, ఆ చలాకీ తనం చూసి, అన్నయ్య కొంచెం తడ బడ్డాడు. వెంటనే సర్దుకుని, చిరునవ్వు తెచ్చించుకున్నాడు. పరమానందమయింది నాకు! ఫరవాలేదు! నా కార్యసాధనకి శ్యామల సరియైన సహాయం అనిపిం చింది. తరువాత ముగ్గురం కొంతసేపు సర దాగా కబుర్లు చెప్పుకున్నాం. అన్నయ్యలో కొంచెం మార్పు కనిపించింది!

ఆ సాయంత్రం నేనూ, శ్యామలా అలా నది వడ్డుకు వెళ్లాము. శ్యామల, పరీక్ష లయిపోయాక వచ్చిందేమో, చీకూ చింతా లేకుండా, మంచి హుషారుగా కనుపించింది. ఆమె వేళాకోళాలాడడం మొదలెట్టడానికి ముందే నే బరువుగా అన్నాను. "శ్యామలా నే నెప్పుడూ ఎవర్నీ ఏమీ కోరలేదు! నిన్ను మాత్రం ఒకే ఒక్క కోరిక కోరదల్చు కున్నాను—కాదనకుండా నా కోరిక తీరు స్తావా? తీరుస్తానంటేనే చెప్తాను!" అని.

"ఇంకా ఎందుకు బావా, ఈ ఉపోద్ఘాతా

తాలన్సి! నిన్ను ప్రేమించడానికే, నీ కోరిక తీర్చడానికే వచ్చానని చెప్పన్నాగా! నీవు కోరబోయేదేమిటో నాకు తెలుసు. ఏమిటో చెప్పుకోనా?— నా మనసు!" కొంటెగా శ్యామల జవాబిచ్చింది.

నే చెప్పదలచుకున్న విషయం ఆమె కెలా చెప్పాలో అర్థం కాలేదు. ఒక్క క్షణం ఆలోచించి, అన్నాను— "కాదు. నేను కోరేది నీ మనసుకాదు. నీ సహాయం!"

శ్యామల కొంచెం ఆశ్చర్య పడింది. ఏలాగయితేనేం, మరికొంచెం సేపటికి నే చెప్పదలచుకున్న విషయం చెప్పేశాను. ఆఖర్న శ్యామలను ప్రతిమాలాను. "ఆమె లేని అన్నయ్య జీవితం చాలా దారుణంగా కనుపిస్తోంది శ్యామలా! అన్నయ్య నాధారంగా చేసుకొని, ఎంతో ఉత్సాహంతో వ్రాద్దా మనుకున్నా నొక కథని! 'హీరో'ని చాలా శ్రద్ధతో సృష్టించుకున్నాను ఆ హీరో గతి ఇలా మారడం నే భరించలేను శ్యామలా! నా యందు దయ ఉంచి అన్నయ్యలో తిరిగి నూతన జ్యోతిని వెలిగించు. నీ స్నేహంతో అన్నయ్య ఆమెను తేలిగ్గా మరువగలుగుతాడు. పైగా, నువ్వు తలుచు కుంటే సాధించలేని పని ఉండదు."

శ్యామల కళ్ళవెంట నీళ్ళు కారడం మొదటిసారిగా చూశాను! అన్నయ్య కథ విని జాలిపడి దుఃఖిస్తోందనుకున్నాను. కాని, శ్యామల గద్గద కంఠంతో చెప్పింది. "నా కొంటె ప్రవర్తన చూసి బహుశా నువ్వు నన్ను అపార్థం చేసుకుని ఉంటావు! నా ప్రవర్తనలో కొంచెం చురుకుపాలు ఎక్కువగా కనుపించినా, నేనూ ఆడదాన్నే బావా! క్షమించు! నా మనసు నీ కెప్పుడో ఇచ్చేశాను. ఇప్పుడు మార్చుకోడం చాలా కష్టమైన పని! నీ అన్నయ్య విషయంలో నీ కంటె ఎక్కువ జాలిపడు తున్నాను. అయినా, నీ కార్యసాధనకి నే నుపయోగించలేను. నాయందు దయ యుంచి నా మనసును అంత తేలిగ్గా అర్థం చేసుకోకు!"

ఆశ్చర్యపోయాను! శ్యామల అంత సీరి యస్‌గా మాట్లాడు తుందని నే నెప్పుడూ ఊహించలేదు. అంతటితో శ్యామలను వదిలి పెట్టలేదు. ప్రతిమాలాను. అన్న య్యను ఆ స్థితిలో చూడ్డం నాకు భరించ శక్యం గాకుండా వుందని, తాను నాకీ విషయంలో సహాయం చేయక తప్పదని పట్టుపట్టేను.

"బావా, ఇంతకూ ఒక్క విషయం అడుగుతాను. జవాబు చెప్పు!" అంది శ్యామల. "పోనీ, నీకోసం పెద్ద బావని నే ప్రేమించడం మొదలెడతాననుకో! పెద్ద బావ కూడా నన్ను ప్రేమిస్తుంటే నా గతి ఏం గాను?"

"దానికి నా సమాధానం ఉంది! అన్నయ్య నిన్ను నిరాకరిస్తే, నే నుండనే ఉన్నానుగా! క్షమించు శ్యామలా. నిన్నొక పావు వులా ఉపయోగించుకుంటున్నానని అను కోకు! నీవు నా జీవిత భాగస్వామి కాబోతా వని నేనూ ఎంతో సంబరపడ్డాను! కాని, అన్నయ్యను చూసి, నిన్నీ విధంగా కోర వలసి వచ్చింది. ఎలాగైనా, నాకోసం ఈ కార్యం సాధించు" అన్నాను.

శ్యామల అయిష్టతతోనే అంగీకారాన్ని తెలియ పరచింది.


* * *

ఆ మరునాడు అన్నయ్యను అర్థం చేసుకునేందుకు కావలసిన సంగతులన్నీ శ్యామలకు వివరంగా చెప్పాను. అన్నయ్య గురించి నే రాసుకున్న విషయాలూ, అన్న య్య తిరిగి నాకు రాసిన జవాబు లన్నీ శ్యామలకు చూపించాను.

"ఏమవుతుందో చెప్పలేను బావా! ప్రయత్నించి చూస్తాను" అంది శ్యామల! నా కెంతో సంతోషమయింది.

ఏదైనా ఒక సమస్యను పరిష్కరించ డానికి మానవుడు చాలాసేపు ఆలోచించి ఏదో ఒక మార్గంలో ముందుకు సాగ డానికి ప్రయత్నిస్తాడు. తను తొక్కిన బాట సరియైనదేనని సంతృప్తిపడతాడు. మొదట్లో! పర్యవసానం తెలిశాకగాని తను పట్టిన మార్గం సరియైనదో కాదో తేలదు. అన్నయ్యలో మార్పు తెప్పించడానికి, శ్యామ లను ఆవిధంగా కోరడంలో తప్పేమీ లేదని, అదొక్కటే మార్గమని అప్పట్లో తోచింది. అందుకే అలా చేశాను. మరేమీ లేదు— నే చేసిన పనికి మీరు నన్ను తిట్టుకుంటారేమోనని, నన్ను అపార్థం చేసు కుంటారేమోనని, ఈ మాటలు రాయ వలసి వచ్చింది!

ఆ మరునాటి సాయంత్రం అన్నయ్యా, నేనూ గదిలో ఉన్నాము. శ్యామల వచ్చింది. మీరు మా ఇంటికి వస్తారేమోనని ఇంతవరకూ చూశాను. ఇంట్లో కూర్చుని ఏం చేస్తున్నారిద్దరూ? అలా షికారు కేనా వెళ్దాం పదండి?" అంటూ కుర్చీలో కూర్చుంది.



"నాకు కొంచెం తల నొప్పిగా వుంది. ఇప్పు డెక్కడికీ వెళ్ళాలనిలేదు. నన్ను క్షమించు శ్యామలా! అన్నయ్యా మీరు వెళ్ళిరండి!" అంటూ మంచంమీద కూల బడ్డాను.

అన్నయ్య కళ్ళు చిట్లిస్తూ నా కేసి చూశాడు. "అరే! ఇంతవరకూ బాగానే ఉన్నావు! అంత చప్పునెలా వచ్చిందిరా తలనొప్పి!" అన్నాడు.

"నువ్వలాగడుగుతావని తెలుసు! అప్పుడే చాలా సేపణ్నించితల నొప్పిగావుంది. అనవసరంగా నిన్ను బాధపెట్టాలని ఇంతవరకూ చెప్పకుండా కాలక్షేపం చేశాను. కావాలంటే చూడింకా! టేబ్లెట్ మింగుతున్నాను!" అంటూ ఓ టేబ్లెట్టు సునాయాసంగా మింగేశాను.

పాపం, అన్నయ్య నమ్మేశాడు. శ్యామల మరోసారి బ్రతిమాలింది. అన్నయ్యను రమ్మంటూ! కాదనలేక బయల్దేరాడన్నయ్య! మేడదిగి వెళ్తున్న ఇద్దర్నీ చూడగల్గినంత వరకు చూసి మనసులో ఏదో తెలియని అనుభూతి పొందాను.

మంచితనం


తిరిగి అన్నయ్య వచ్చేసరికి రాత్రి ఎని మిది గంటలయింది. వస్తూనే ఆత్రంగా నావంట్లో ఎలాగుందని ప్రశ్నించా డన్నయ్య! "ఫరవాలేదు. తగ్గిపోయింది. ఆకలికూడా అవుతోంది." అన్నాను. భోంచేసి రావడానికి ఇద్దరం బయల్దేరాం హోటలుకి! దార్లో, అన్నయ్య శ్యామలగురించి మాట్లాడేడు. "చాలా చలాకీ పిల్ల. బలేసరదాగా కబుర్లు చెపుతుంది!" అన్నాడు. పట్టలేని సంతోషం పొందాను మనసులో! అన్నయ్య ఇంకో మాట కూడా అన్నాడు. "చాలావరకు నీలక్షణాలే!" అని! ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. శ్యామలమీద నాకేమీ ఇంటరెస్ట్ లేనట్టు, ఆమాట వినీవిన్నట్టు ఊరుకున్నాను.

మరునాడు శ్యామలను కలుసుకున్నప్పుడు బ్రతిమాలు కున్నాను. "శ్యామలా! అన్నయ్య మనసెలాటిదో నీకు చెప్పాను. బహుశా నీమనస్తత్వం కూడా దానికిసరి పోయేలా మార్చుకోవాలి! ముఖ్యంగానీ అభిరుచులూ అన్నయ్య అభిరుచులూ ఒకటే కాని అన్నయ్య గ్రహించగలిగేలా నీవు ప్రవర్తించాలి!"

ముందు కోపంగా చూచి, పళ్ళు పటపట లాడించబోయినా తరువాత మెల్లిగా ఒప్పుకుంది శ్యామల!

రోజులు మెల్లిగా జరుగుతున్నాయి. వీలయినప్పుడల్లా వాళ్ళిద్దర్నీ ఏకాంతంగా వుంచి నే తప్పించుకుబయట పడ్డానికి ప్రయత్నాలు జరుపుతూనే వున్నాను. ఇద్దరి దగ్గర్నుండీ, ఒకరిపై మరియొకరి కేర్పడుతున్న అభిప్రాయాలు కూడా తెలుసుకుంటూనే వున్నాను. మొదటి కొద్దిరోజుల్లోనూ గ్రహించగలిగిన విషయాలని బట్టి నా ప్రయత్నం సఫల మవుతోందని సంతోషించి, శ్యామలతో చనువు తగ్గించుకున్నాను. ఎప్పుడైనా ముగ్గురం కలిసి మాట్లాడుకుంటూ కూర్చుంటే వాళ్ళిద్దరికీ చాలా విషయాల్లో అభిప్రాయభేదాలు కనుపించేవి. కావాలని, నేను అన్నయ్య వైపు మొగ్గేవాణ్ని. పాపం, శ్యామల నిస్సహాయ స్థితిలోపడి తప్పనిసరిగా మాతో ఏకీభవించేది.

ఒకనాడు మధ్యాహ్నం— అన్నయ్య ఆఫీసు కెళ్ళాడు. నేను ఒంటరిగా గదిలో వున్నాను. శ్యామలవచ్చింది. "క్షమించాలి బావా! నీకు మీఅన్నయ్య ఎంతో మంచివాడయితే అయివుండవచ్చు! కాని ఆమంచి తనాన్ని అర్థంచేసుకోడం నాకు తెలీదు. ఇన్నాళ్ళ పరిచయం లోనూ, పెద్దబావని ఒక్కలా అర్థం చేసుకోగలిగానంతే! తను సుఖపడ లేడు. తనవాళ్ళని సుఖపడనివ్వడు. ఎంత సేపూ పైవాళ్ళ బాధ్యతలు నెత్తినవేసుకోడం, విశ్రాంతిలేకుండా తిరగడం— ఇవే బావకు తెలుసు. రేపొద్దున్న తను పెళ్ళి చేసుకున్నాగాని ఇంటి బాధ్యత పట్టించుకునే రకంలా కనుపించటంలేదు. మనిషిమంచి వాడేకాని, ఈకాలంలో నెగ్గించుకువచ్చే వాడుకాడు. బహుశా నీవు చూస్తూనే వుంటావు. ఒక్కొక్కప్పుడు తెల్లవారకుండా ఇల్లువిడిచి పోతాడుట, తిరిగి వచ్చేసరికి రాత్రి పిపన్నెండు గంటలో అవుతుందట! ఇవన్నీ వినడానికే భయంగావుంది. రేపు కాపరం



కేయడం ఎంత కష్టంగా వుంటుందో ? నేనింతవరకూ సుఖంమరిగినదాన్ని! ఒక వేళ పెళ్ళాడినా గాని, బావని సుఖపెట్టలేనేమోనని భయంగావుంది.! ప్లీజ్ ! నామాట విను బావా! ఇంక ఈ ప్రయత్నం నుండి విరమించుకుందాం!'' అంటూ చాలా జాలిగా చెప్పింది.

నేను మెత్తబడలేదు. అన్నయ్యకూస్తదారి కోపపడుతున్నాడని సంతోషిస్తున్న నేను శ్యామలమాటలను హర్షించలేకపోయాను. శ్యామలను మళ్ళీ ప్రతిమాలుకున్నాను.నన్నింక మరచిపొమ్మని ప్రాధేయపడ్డాను. శ్యామల అర్ధాంగీకారంతో వెళ్ళి పోయింది.

నేచూసుకున్న ప్రయత్నం, నాకుతెలియకుండానే ఒక 'ఎటర్నల్ ట్రయాంగిల్'ని సృష్టించింది. ఒకనాడేదో ఆలోచిస్తూండగా ఉత్తనే ఆవిషయం తట్టిందినామనసులో! 'ఎటర్నల్ ట్రయాంగిల్'వున్న కథలను ఎన్నింటినో మీరు చదివివుంటారు. వాటితో మీలో చాలా మంది విసుగెత్తిపోయివుంటారు.! నిజానికి నేనూ అంతే! కానినేను కావాలని సృష్టించిందికాదు ఈ ట్రయాంగిల్! దానంతటదే సృష్టింపబడింది. కొంచెం జాగ్రత్తగా ఆలోచించాను. 'ఎటర్నల్ ట్రయాంగిల్'లో ఏదో క్రొత్తదనం గోచరించింది. విడమరిచిచెప్తే మీరూ ఒప్పుకుంటారు! శ్యామలకు అన్నయ్య మీద దృష్టిలేదు. నాకు శ్యామలమీద దృష్టిలేదు. అన్నయ్య అభిప్రాయం ఎలాగుందో తెలియదు! ఈవిషయం గుర్తుకు వచ్చాక మా కథ ఎలానడుస్తుందో, ఎలాఅంతమవుతుందోనని నాకుచాలా భయంగా వుండేది. నేవేసిన పథకంప్రకారం, వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకొని అన్నయ్య సౌఖ్యవంతమైనజీవితం గడుపుతూ కనుపిస్తేచాలునని ఎంతగానో కోరుకునే వాణ్ణి. ఇక్కడ మీలో చాలామందికితట్టినట్టుగానే నాకూ ఒకవూహతట్టేది అప్పుడప్పుడు—అన్నయ్యగాని శ్యామలగాని ఏదైనా అయిపోతారేమోనని! ఆ వూహతట్టినప్పుడల్లా గుండె గుభేల్‌మనేది. నాప్రయత్నంలోకి అనవసరంగా దిగేనేమోనని అనిపించేది!

ఒకనాడు రాత్రి ఎనిమిది గంటలయినా గాని, అన్నయ్య ఇంటికి రాలేదు. నాకు చాలా ఆకలయ్యింది. అన్నయ్యకోసం వేచి యుండడం లాభం లేదనుకొని హోటలుకి బయల్దేరాను. తిరిగి నే వచ్చేసరికి అన్నయ్య గదిలో ఉన్నాడు. అన్నయ్య చాలా అలసిపోయినవాడిలా, వాడిపోయిన వదనంలో కనుపించాడు. అన్నయ్యను ఆ వాలకంలో చూడ్డం మొదటిసారి కాదు నాకు. "బాగా ఆకలయ్యింది. నీ గురించి వెయిట్ చెయ్యకుండానే వెళ్ళిపోయాను. బాగా అలసటగా ఉన్నట్టున్నావు. కేరేజి మీల్సు తీసుకురానా?" అంటూ క్షమార్పణ చెప్పుకున్నాను.

"ఏం ఫరవాలేదు. భోంచేసివచ్చినందుకు చాలా థాంక్స్! తప్పు నాదే! చాలా ఆలశ్యం చేశాను. నేను కూడా భోంచేసి వస్తా" నంటూ బయల్దేరాడు!

రాత్రి పది గంటలయినా అన్నయ్య రాలేదు. ఏదో పుస్తకం చదువుకుంటూ నాకు తెలియకుండానే నిద్రపోయాను.

నాకు మెలకువ వచ్చేసరికి మరునాడు ఉదయం ఆరు గంటలయింది. అన్నయ్య గదిలో కనుపించలేదు. బహుశా ఎక్కడికేనా వెళ్ళివుంటాడనుకొన్నాను. ముఖం తొముకుని, కాఫీకోసం బయల్దేరదామనుకుంటున్నాను. టేబుల్‌మీద వో కవరు కన్పించింది. ఆత్రంగా విప్పి చూశాను. ఆ కవరులోనున్న ఉత్తరంలో ఇలా రాసివుంది.

"తమ్ముడూ! ఈ నెల్నాళ్ళూ నా దగ్గరుండి నా మనో వ్యధను కొంత మరపింపచేయగలిగావు. ధన్యవాదాలు. నేనే తెలివైన వాణ్ణని నేను గర్వపడుతూండేవాడిని! నన్ను మించిన తెలివి నీలో ఉందని తెలుసుకుందుకు సంతోషిస్తున్నాను.

శ్యామలను మొదటి రెండు రోజుల్లోనే అర్ధం చేసుకోగలిగాను. నీకు సరియైన సతీమణిగా ఉంటుందని అనుకున్నాను. భార్యా భర్తలుగా మీ రిద్దరూ రాణించగలరని మురిసిపోయాను. కాని, శ్యామల నాతో చనువుగా మాట్లాడ్డం నీవు ఆమెపై నిర్లక్ష్యం వహించడం చూసి ఆశ్చర్యం కలుగుతూండేది! నీవు బొంబాయిలో చదువుతున్నప్పుడు ఆమె గురించి రెండు మూడు విషయాలు రాసినట్టు గుర్తు! అప్పటినుండే అనుకునేవాణ్ణి మీ రిద్దరూ పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని!

రెండు మూడు రోజుల్నుండీ శ్యామల చాలా వింతగా ప్రవర్తిస్తోంది. నాకేమీ అర్ధం కాలేదు ముఖా ముఖిగా నిన్న సాయంత్రం అడిగేసింది. "బావా, నన్ను పెళ్ళి చేసుకోడం నీకిష్టం లేదా?" అని. కొంచెం తబ్బిబ్బయాను. నా అభిప్రాయాల్ని శ్యామలకు చెప్పేశాను. "నాకంటె తమ్ముడే నీకు సరియైన వరుడుగా ఉంటాడు! నన్ను పెళ్ళి చేసుకుందుకు నిర్ణయించుకున్నావెందుకు శ్యామలా? నీకు కష్టం కలిగించకపోతే ఒక చిన్న కోరిక—నీ అభిప్రాయం మార్చుకో! తమ్ముడిని ప్రేమించు!" అన్నాను. శ్యామల దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. ఎందుకో అర్ధం కాలేదు నాకు. ఏదో దాచి వుచ్చుతోందని తెలుసుకోగలిగాను. కళ్ళల్లోకి విదానంగా చూసి, నిజం చెప్పమని ప్రతిమాలాను. ఆవేశంలో రెండే రెండు మాటలు అనేసింది శ్యామల—"నేను శూర్పణఖలా కనుపిస్తున్నానేమో మీ యిద్దరన్నదమ్ములకీ! నిన్ను ప్రేమించమని ఆ బావ చెప్తాడు. ఆ బావని ప్రేమించమని నువ్వు చెప్తావు! నా మనసు నీకో ఆట వస్తువులా కనపిస్తోందనుకుంటాను! మానేయ్యండి! మీలో ఎవరూ నన్ను పెళ్ళాడనద్దు!" కళ్ళనీళ్ళు తుడుచుకుని గబ గబ నడిచి వెళ్ళిపోయింది. ఆశ్చర్యంగా అలాగే నిలబడిపోయాను తమ్ముడూ! ఇంటికి వచ్చేసరికి నీవు గదిలోలేవు. ఏదో తెలియని ఆవేశంలో నీ పెట్టె తెరిచి, నీ డైరీ చదివేశాను! ఈ పనికి నన్ను క్షమించు తమ్ముడూ! నాకోసం నీవు చేయబోయిన త్యాగానికి ఎన్నో ధన్యవాదాలు!

ప్రేమించిన యువతిని పోగొట్టుకొన్న నిర్భాగ్య స్థితిని అనుభవించిన వాణ్ణి నేను. ఆ దుస్థితి నా తమ్ముడు కూడా అనుభవించడం నే చూడలేను! నీ కా స్థితి కల్పించడానికి కారణం నేనే కనుక, ఈ నిర్ణయానికి వచ్చాను—ఇంక మీ యిద్దరి సాధ్య

ముందే నే తప్పుకోవాలని! నీ ప్రయత్నం సఫలమై, ఆమెతో సుఖంగా జీవించు— నే కనుపించనులే!

శుభాశీస్సులతో

నీ అన్నయ్య."

చేతులు గజగజలాడాయి. ఏమి చేయాలో అర్థం కాలేదు. వెంటనే వెళ్ళి శ్యామలని కలుసుకున్నాను. శ్యామల నాపై జాలిపడింది. మా ఎటర్నల్ ట్రయాంగిల్ మాట గుర్తుకు వచ్చింది. మంచివాడైన అన్నయ్య ముఖం పెద్దదై, మరింత పెద్దదై ఆకాశంలో కనుపించింది!

జరిగిన విషయం నాన్నగారికి ఎలా చెప్పాలో అర్థం కాలేదు. ఇంత మంచి పుత్రుణ్ణి పోగొట్టుకున్నామని తెలిస్తే అమ్మ, నాన్నగారు ఎంతలా దుఃఖిస్తారో ఊహించుకొని నా మనసొకటే కలవర పడిపోయింది. ఆ సాయంత్రం వరకూ ఊరందర్నీ అన్నయ్య గురించి వాకబు చేశాను. అన్నయ్యలేని ఆ వూరు—ఎంతో నిర్జీవంగా కనుపించింది. ఆ సాయంత్రం బండికి మా వూరు వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. స్టేషనుకి శ్యామల కూడా వచ్చింది.

బండీ ఎక్కుతూన్న నన్ను ఆత్రంగా పిలిచింది శ్యామల—"బావా! పెద్దబావ!" అంటూ ఒక వైపు తన చెయి చాచి చూపించింది. అటువైపు చూశాను! అన్నయ్య!! వెంటనే బండిదిగి, మా వైపు వస్తున్న అన్నయ్యను గాఢంగా కౌగలించుకున్నాను! "తమ్ముడూ!" అంటూ అన్నయ్య నన్ను దగ్గరకి తీసుకున్నాడు. అన్నయ్య స్పర్శతో నా ఒళ్ళంతా ఒక్కసారి ఝల్లుమంది. అన్నయ్య తన వెనుక వస్తున్న 'రమ'ని చూపించాడు వెంటనే నిర్ఘాంతపోయాను!!

"కంగారుపడకు తమ్ముడూ, ముందు వాళ్ళ నాన్నగార్ని కలుసుకో. ఆమె వెనుకనే వస్తున్నారు చూడు. ఆయనే!" అంటూ అన్నయ్య నన్ను ఆయనకు పరిచయం చేశాడు. ఆరడుగుల పొడవున్న ఆ డిఫెన్స్ ఆఫీసరుగార్ని చూస్తే, ఆయనకు అరవై యేళ్ళుంటాయా అనిపించింది!

"వెల్! అందరం ముందు ట్రావెలర్స్ బంగళాకు వెళ్దాం! ఈ రాత్రికి మే మిప్పుగం అక్కడవుండి, రేపు ప్రొద్దున్నే మా

వూరు వెళ్దాం. రాత్రి భోజనాలు మాతో పాటే మీరంతా తీసుకొందురుగాని సావకాశంగా కబుర్లు చెప్పుకోవచ్చు!" అంటూ సామానంతా కూలివాడి నెత్తిన వేశారాయన.

* * *

హోటలయ్యరే మా అందరికీ భోజనా లక్కడికి తెచ్చి ఏర్పాటు చేశాడు. భోజనాలయాయి. పూల మొక్కల మధ్య అయిదుగురం కూర్చున్నాం. మంచి చుట్ట వెలిగించారా డిఫెన్స్ ఆఫీసరుగారు. "జరిగినసంగతంతా నే చెప్తాను, ఇఫ్ యు పెర్మిట్ మి!" అంటూ అన్నయ్యకేసి, రమ వైపు చూశారు. "యస్ ప్లీజ్!" అన్నారు. వాళ్ళిద్దరూ చిన్నగా నవ్వారు ఆయన ప్రారంభించారు.

"మీరంతా పుత్రవాళ్ళు! కాని, రాటుకి పోటుకి ఆగే శక్తి మీలో ఒక్కళ్ళకు కూడా ఉన్నట్టు కనుపించదు. పిరికితనానికి, ఈ వయసులో రానియ్యకూడదు! రామారావులోని ఆ పిరికితనమే నాకు నచ్చలేదు. క్షమించాలి. సూటిగా మాట్లాడు తున్నందుకు! ఒకనాడేదో మాటల సందర్భంలో తను రామారావుని ప్రేమిస్తున్నట్టు చెప్పింది అమ్మాయి. ఒక్కగా నొక్క కూతురు! దానికి రాబోయే భర్త నాకు కూడా నచ్చాలిగదా! ఆమరునాడే ఈవూరొచ్చి రావు గురించి బాగా ఆరాతీశాను. ఎవర్నడిగినా రామారావు దేవుడివంటి వాడనే సమాధానం చెప్పారు. దూరాన్నుంచి అతని ప్రవర్తన కూడా చూశాను. కుర్ర వాడు మూర్ఖానికి చాలా దూరన్నాడుగాని, ఆ వయసుకి అతనిలో ఉండవలసిన కరుకు తనం కనిపించలేదు. పైగా అంత మెత్తగా వుండే వ్యక్తిని మెచ్చుకునే వాళ్ళెవ్వరూ! అలాంటి వాడిని పెళ్ళి చేసుకున్నందుకు మాత్రం ఏం సుఖ పడగలదు? అని అనుకున్నాను. అయినా అతన్ని పరీక్షించి మరీ ఒక నిర్ణయానికి వద్దామనుకొన్నాను. నాకు చాలా కావలసిన స్నేహితు డొకడు లూధియానానుండి ఉత్తరం రాశాడు. వాళ్ళమ్మాయి వివాహానికి నేను తప్పకుండా రావాలని! నిజానికి నాకు కూడా కొన్ని స్వంత పనులుండి

పోయాయి. సకుటుంబంగా అక్కడకు వెళ్ళడం తప్పనిసరియ్యింది. ఆ అవకాశాన్ని రామారావుని పరీక్షించడానికి వినియోగించు కొందామనిపించి, అమ్మాయి రాసినట్టు ఆ ఉత్తరాన్ని నేనే రాసి పోస్ట్ చేశాను. రామారావు ఆ ఉత్తరం చూసి అక్కడికి పరు గెత్తుకుంటూ వస్తాడేమోననుకున్నాను. అతను రాకపోయేసరికి కొంచెం నిరాశ చెందాను కూడా! పాపం అమ్మాయి అతనికి రాసే ఉత్తరాలన్ని పోస్ట్ కాకుండా చేశాను రెణ్ణెళ్ళపాటు. అతన్ని ఎలాగోలాగ మరచి పోతుందని! అమ్మాయి ధోరణి మారక పోయేసరికి ఒకనాడు జరిగిన సంగతంతా చెప్పి, అతను తనకు తగిన వరుడు కాదని, అతన్ని మరచిపొమ్మనీ అమ్మాయిని బతిమాలాను! అమ్మాయి అంతలా బాధపడు తుందని నే ననుకోలేదు. నాకు కూతురుగా పుట్టిన ఆమెలో అంత జాలి, ప్రేమ, సేవాబుద్ధి ఎలా కలిగాయో తెలియక ఆశ్చర్యపోయాను. ఆమె కళ్ళమ్మట నీళ్ళు చూడలేకపోయాను. ఆమె నిర్ణయం ప్రకారమే జరగడానికి బయల్దేరి వచ్చేశాం. ఇక్కడుంటే అబ్బాయి పాడవుతాడని, అబ్బాయిని అక్కడే స్కూల్లో చేర్పించేశాను! అంతే! అంతకంటె మరేమీ పెద్ద బ్రహ్మాండమైన దేదీ జరిగిపోలేదు."

ఎంతో తేలిగ్గా మాట్లాడేశా రాయన! ఆశ్చర్యపోయాం మేమిద్దరం. వెంటనే 'రమ' చెప్పింది. "నాన్నగారూ! చిన్న పాయింట్! నిజమైన ప్రేమతో ప్రజాసేవ చేస్తే, మన కష్టాల్లో భగవంతుడే సహాయపడతాడు! ఆ సైకిల్ షాపు వెంకన్న ఏదో కారణంగా రమణా రావును నిన్న విశాఖపట్నంలో ఆపుచేయక పోతే మనం ఆ స్టేషన్‌కు రాకముందే రమణా రావు ఆ ముందు బండిలోనే ఎక్కడికో వెళ్ళిపోయేవాడు. అప్పుడు పరిస్థితులెంత బాధాకరంగా ఉండేవో మీరే ఆలోచించండి! రమణారావు నిష్కళంకమైన వ్యక్తి! స్వీట్ లెవ్ పర్సన్!" అంది.

"హియర్! హియర్!" అంటూ ఆయన చప్పట్లు చరిచారు నవ్వుతూ! అప్రయత్నంగానే అందరం ఒకసారి నవ్వేశాం. మంచితనం అంటే ఏమిటో నాకు మాత్రం బోధ పడనేలేదు.

ఎక్కువగా కట్టున్నారు. అందులో ఏవి వుంచుకొన్నా అందరికీ కనిపిస్తాయి. కొన్ని చూడదగ్గవి, ఇతరులు చూడదగనివి కూడ వుంటాయి. అలాంటప్పుడు ఈ చీరలను ఆ గూళ్ళకు అడ్డంగా కర్టెన్‌లాగ్ ప్లాస్టిక్ స్ప్రింగ్‌కు ఎక్కించి వేస్తే చూడ్డానికి అందంగానూ వుంటుంది, మనం దాచిన వస్తువులు కనిపించనూ కనిపించవు. ఇతరులు చూడదగిన వస్తువులు పై గూడులో వుంచి, క్రింది వాటికి మాత్రం కర్టెన్ వ్రేలాడదీస్తే స్టయిల్‌గ వుంటుంది. నా పిల్కు చీరలన్ని కర్టెన్స్ క్రిందే (కిటికి, తలుపు, గూళ్ళు వుపయోగిస్తున్నా. పని మనిషి పాతచీర ఇమ్మని అడిగితే "తల్లీ పాతచీరలులేవు. కావాలంటే సంవత్సరానికో కొత్తచీర ఇస్తాను" అని దాన్ని బుజ్జగించవలసి వస్తున్నది ఇప్పుడు.

ఇకపోతే, పాత దుప్పట్లను ఎన్నో రకాలుగా వుపయోగించవచ్చు. చినిగిపోయిన వాటిని కుట్టివేస్తే కుట్టు కనిపిస్తూ అసహ్యంగా వుండటమేకాక, కుట్టిన చోట తిరిగి చినుగుతుంది. అలాంటప్పుడు వీటిని పిల్లో కవర్సుకుగాని, చిన్నచిన్న న్యాప్‌కిన్స్‌కు గాని ఉపయోగించవచ్చు. టీపాయ్ క్లాత్ కూడ కుట్టవచ్చు. భోజనమైన తర్వాత కడుక్కొన్న చేతులను టవల్‌కు తుడిస్తే ఖరాబవుతాయి. తిరిగి అదే టవల్‌ను ముఖం తుడుచుకోడానికి వాడవలసి వస్తుంది. అలా కాకుండా భోజనం అయిన తర్వాత చేతులు తుడుచుకోడానికి ఈ న్యాప్‌కిన్స్ వుపయోగిస్తే పొదుపుగా వుండి, టవల్స్ శుభ్రంగా వుండి, ఎక్కువకాలం మన్నుతాయి. ఈ న్యాప్‌కిన్స్‌కు నా ఫ్రెండ్ ఇంకొక తెలివి కనిపెట్టింది. మగవారి బనియన్స్, వుంటాయి చూశారూ? అవి సహజంగా చంకల దగ్గర ఎక్కువ చినుగుతాయి. అవి కుట్టినా ప్రయోజనం వుండదు. (అక్కడక్కడ రంధ్రాలు కూడ పడ్తాయనుకోండి.) బనియన్‌ను చొకుగ కత్తిరించి రెండు పొరలు కలిపికుట్టి మూలల చిన్నచిన్న ఎంబ్రాయిడరి

మనుష్యులు మమతలు

(37 వ పేజీ తరువాయి)

పూలుగాని లతలు గాని కుట్టి న్యాప్‌కిన్స్ క్రింద వుపయోగిస్తుంది. మొదట్లో తమాషాగావున్నా, రానురాను ఇదికూడా ఒక పొదుపే సుమా అని అనిపించింది. ఇలాంటి చిన్నచిన్న మార్పులు చేస్తే, అటు పొదుపు చేసిన వారూ అవుతాము. ఇటు కాలాన్ని సద్వినియోగ పరిచినవారమూ అవుతాము. వున్న దాన్లోనే మట్టసంగా ఇంటిని అలంకరించి నలుగురిని ఆకర్షించిన స్త్రీయే చక్కటి ఇల్లాలని బుజావు పరుచుకొంటుంది. చీర నలగకుండా చక్కగ వుండాలనే మమత గల వారు నిజంగా అదృష్టవంతులు.

శుభ్రమైన దుస్తులు ధరించి, చెక్కు చెదరక వున్న వారిని చూస్తే, వారితో ఇట్టే స్నేహం (లేక పరిచయం) చేసుకోవాలని అనిపించడం సహజం. వున్న బట్టలనే శుభ్రంగా, జాగ్రత్తగ వాడుకోవచ్చు. వీలయితే యిస్త్రీ పెట్టుకోవచ్చు, లేకపోతే జాగ్రత్తగ మడతపెట్టి బరువుక్రిందపెడ్తే ఇస్త్రీలో కాకపోయినా మరీ అధ్వాన్నంగా మాత్రం వుండవు. నేత, వాయల్ చీరలయితే గంజి, ఇస్త్రీవుంటే గాని అందంగ వుండవు. సిల్కు వాటికైతే ఈ బాధలు వుండవు. జాగ్రత్తగ మడతలు సరిచేసి ఆరవేస్తే ఇస్త్రీ కూడ అవసరంలేదు. ఎటొచ్చి మాటి మాటికీ జారుతాయని చికాకు. కాని కొన్ని రోజులు అలవాటయితే జారుట తగ్గుతుంది. చీరలను బాగా పిండి ఆరవేసేటప్పుడు జాడించి మడతలు లేకుండా చేసి బార్డరు సరి దిద్ది ఆరవేయాలి. తర్వాత చక్కగ మడచి తలగడ క్రిందగాని, ఏదైన బరువు సీటలు మొదలైనవాటి క్రిందిగాని పెట్టి వుంచితే కట్టుకొనేటప్పుడు ఇస్త్రీ లేకపోయినా ఫరవాలేదనే లాగుంటాయి. నేత వాటికి ఇస్త్రీ లేకపోయినా ఫరవాలేదుగాని గంజి లేకపోతే వాటిని కట్టలేము. కుచ్చిళ్లన్నీ అతుక్కొనిపోయి చూడ్డానికి అసహ్యంగా వుంటుంది. రోజూ గంజి తయారు చేయడం కష్టం అనుకొంటే, బియ్యం రెండు, మూడు మార్లు శుభ్రంగా కడిగి, అన్నం వేసి, శుభ్రమైన పాత్రలో గంజి వంచుకొని, దానికి తగినన్ని నీరు పోసి చీర పిండితే తేలిగ్గా గంజి పట్టి పెళపెళ లాడుతుంటుంది చీర.

అమధ్య కొన్ని రోజులు ఇస్త్రీపని నా మీద పడింది. రోజూరోజూ చేయాలంటే, బొగ్గులు సర్దడం, పెట్టె వేడి చెయ్యటం కష్టమని వారానికి 1—2 సార్లు పెట్టుకొనే కొనే వాన్ని. రాశిగ వున్న బట్టలు ఇస్త్రీ చేయాలనుకొంటే చేయడానికి ముందు రోజు, చేసిన రోజు కొంచెంగ జ్వరం వచ్చేది. అది భ్రమే అనుకోండి, కాని ముఖం అంతా పీక్కుపోయేది. నా బాధ చూడలేక మా అమ్మ "ఈ అడవిలో (మేము వూరికి) దూరంగా వుండే వారంతేండి విన్నెవరు చూస్తారే. ఇస్త్రీలేక బట్టలు కట్టుకోరాదు? నీ బాధ నేను చూడలేను. సహాయం చేద్దామంటేనా చాతకాదు అని కేక" వేసేది. అలవాటయిన తర్వాత కష్టమయినా ఫరవాలేదు ఇస్త్రీ లేకుండా కట్టుకోవాలంటే కష్టంగ వుండేది. విధిలేక కట్టుకొన్నా రోజుకు 10, 12 సార్లు ఆ చీరను చూసుకొని చికాకు పడేదాన్ని. ఇస్త్రీ బాధ ఇప్పుడు లేనందువల్ల ఎంతో తేలికగా వుంది. మొన్న మా మరదలు ఇస్త్రీ పెట్టుకొంటూ అలసటవల్ల జాకెట్లు, చేతికొన కాల్చుకొంది. ఇప్పటి ఫ్యాషన్ ధర్మమా అంటూ రెండుచేతులూ కట్టుచేసి (జాకెట్టు సుమండీ!) తిరిగి పైకి కుట్టుకొంది. ఇలా మన మమతల వల్ల లాభనష్టాలు రెండూ వున్నాయి. కాని జాగ్రత్తగ చేస్తే, ఏ పనిలోనైనా లాభాలు మాత్రమే కనిపిస్తాయి. మిగతా వాటిపైన మనుష్యులకు గల మమతలు ఇంకొకసారి ప్రస్తావిస్తాను.

అలో విచిక్షితమైన భాష సుబ్బారావు కొక్కడికే తెలుసు. పెద్దావు కళ్ల నుండి రాలువడుతున్న అగ్నిజ్వాల సుబ్బారావు మాత్రమే చూడగలడు. గంగన్న రావటం కట్టుకొయ్య ఊడిపోవటం ఒకేసారి జరి గాయి. బండి చక్రాన్ని చేటలా చెరగగల గంగన్న చేతులు పెద్దావును నిలువరించచ లేతే సుబ్బారావు..........

"అమ్మగారూ. చినకాపుగార్ని తీసికెళ్లి పోండి గమ్మున" గంగన్న కర్తవ్యం చెప్పాడు. లక్ష్మమ్మా, పత్తిగాడూ సుబ్బారావును మోసికొని పోయినట్లు తీసుకొనిపోయారు ఇంట్లోకి. సుబ్బారావు కనుమరుగయ్యేంత వరకూ పెద్దావు బుసలు మానలేదు.

"నారుమడి మేస్తుంటే అదలించబోతే వింత పగబట్టిందీ" అందరూ ఈ దారిలోనే ఆలోచించారు.

రోజులు గడుస్తున్నవి. సుబ్బారావు నిజంగా కోలుకోవడంలేదు. శారీరకంగా కొంత శక్తి సమకూరింది. కాని ముఖంలో కళ్లల్లో కాంతిలేదు.

ఒక సాయంత్రం పెరట్లో కూర్చుని పెద్దావు దూడ మెడ పట్టుకొని దాని కళ్లల్లోకి గుచ్చిగుచ్చి చూస్తున్నాడు. ప్రక్కనే లక్ష్మమ్మ ప్రత్తిగింజలు కొలు స్తున్నది. జేరవేసి ఉన్న దొడ్డి తలుపు ఛళ్లున తెరుచుకొంది. పెద్దావు బుసలు కొడుతూ మెరుపులా వచ్చేసింది. "అమ్మ కొడుకోయ్" అని లక్ష్మమ్మ సుబ్బారావును చుట్టేసుకొంది. ఆవు రోజుతూ పాకలోనికి పోయింది.

మర్నాడు ఉదయం పొరుగింటి వియ్యపు రాలు ప్రయాణమై లక్ష్మమ్మతో చెప్పి పోదామని వచ్చింది. లక్ష్మమ్మ పెద్దావు పాలు పితుకుతున్నది.

'వెళ్లొస్తాను వదినే' అంది వియ్యపు రాలు.

"రెండు రోజులైనా ఉండకుండా ప్రయాణం కట్టేశావు. వచ్చిందేదీ. వెళ్లిందేదీ వదినా' అంది లక్ష్మమ్మ పాలు పితుకుతూనే.

"ఏదమ్మా నిన్ననే రాలేదని మీఅన్నయ్య గారప్పుడే లాళ్ళు కొరుకుతూ ఉంటారు.

మహాసేపడా జయంసీకు

(26వ పేజీ తరువాయి)

అది సరేగానీ మా పిల్లది చెప్పింది. సుబ్బా రావు కొంచెం లేచి తిరుగుతున్నాడా ?" వియ్యపురాలు వాక్యం పూర్తి చేయలేదు. లక్ష్మమ్మ మోకాళ్ల మధ్య పాలచెంబు పదిగజాల దూరంలో దొర్లుతున్నది. ఒలి కిన పాలలో లక్ష్మమ్మ వెల్లికిలాపడి పోయింది. పెద్దావు బుసలు కొడుతున్నది.

లక్ష్మమ్మ ఒక నిశ్చయానికి వచ్చింది. రాత్రి దొరయ్య ఇంటికి రాగానే "పెద్దావును కోడలి పుట్టింటికి తోలించెయ్యండి" అంది. దొరయ్య ఏదో అందామని పెదవి విరిచే లోగా గదిలో నుండి సుబ్బారావు అన్నాడు.

"వద్దమ్మా. పెద్దావును ఎక్కడకూ తోలించవద్దు"

తల్లితండ్రులకు కొడుకు అంతర్యమూ, ఆవు విపరీత ప్రవర్తనా అంతుపట్టలేదు. ఆ సాయంత్రం నుండే పెద్దావును ఏటి వార పొలంలో కట్టేయడానికి, పాలేరే పాలు పితికి తేవడానికి ఏర్పాటు చేసింది లక్ష్మమ్మ.

సుబ్బారావు కొంచెం లేచి తిరుగుతున్నాడు ఇంటిలోనే. తల్లి బలవంతం మీద రెండు రోజుల నుండి వీధిలో కూర్చుంటున్నాడు. తను ఒక్కడూ అయితే కొంతసేపు కూర్చుం టాడు. రెండోవాడు చేరితే లోనికి వచ్చే స్తాడు. పరధ్యానంగా కూర్చున్నపుడు ఎవ రైనా వచ్చి పలకరిస్తే, వారివంక అకస్మా త్తుగా కళ్లు వచ్చిన జాత్యంధుడిలా, కలలో బీభత్స దృశ్యం చూచి మేల్కొన్నవాడిలా చూస్తాడు. చిరపరిచితమైన ముఖాలనే జన్మలో ఎరుగనట్లు వెర్రిగా చూస్తాడు. ఎవరిని చూచినా, ఎవరు పలకరించినా కాళ్లు గజగజ వణికిపోతాయి. మాటలు తడబడిపోతాయి. వీధి మెట్లు దిగి ఒక్క అడుగు వెళ్లలేడు. అతను చూచిన వస్తు వల్లా భగ్గున మండిపోతుంటే, అతని కెదు రైన కళ్లు నిప్పుకణాలు వర్షిస్తుంటే అతను నిలచిన చోటల్లా భూమి కృంగి పోతుంటే మిన్ను పెళపెళమని విరిగిపోతుంటే ఎక్కడకుపోతాడు?

ఒంటరిగా వీధిలో కూర్చున్న సుబ్బా రావు అల్లంత దూరాన సూరయ్యను చూచి వెంటనే గదిలోనికి పోయి తలుపు వేసుకున్నాడు. సూరయ్య దొరయ్యగారి ముందువాలోకి వచ్చారు. దొరయ్య చుట్టలు చుట్టుకుంటున్నాడు.

'ఎప్పుడొచ్చావు బావా' అన్నాడు దొరయ్య. సూరయ్య ఈమధ్య గ్రామంలో లేడు.

"రాత్రే వచ్చానుగాని.. సుబ్బారావు చేలోకి పోతున్నాడా"

"అబ్బే. ఏదీ. వీధిలోకైనా సరిగ్గా పోవడంలేందే. మనిషింకా సరిగ్గా తేలలేదు గదా. ఎక్కడ తగిలిందో ఏమో బొత్తిగా నొక్కుకుపోయాడు బావా"

"దిక్కుమాలి నావు ఎంత చేసింది.. ఫొటో అదీ తీయించి చూసావా. ఎక్కడన్నా ఎముక లేమన్నా విరిగాయేమో."

"అన్నీ అయినాయి. వంట్లో ఏమీ లేదన్నాడు డాక్టరు."

ఎముక విరిగింది ఎదతో. అది ఫోటో ఎలా చూపగలదు? డాక్టరు ఎలా చెప్ప గలడు? దొరయ్య చుట్టిన చుట్టల్లో ఒకటి తీసి సూరయ్య కిచ్చాడు. సూరయ్య అందు కొని దొరయ్యకు దగ్గరగా జరిగి గొంతు కొంత తగ్గించి "ఇది నీకు చెప్పానా బావా" అన్నాడు.

'ఏదీ' అన్నాడు దొరయ్య సూరయ్య వంక చూసి.

"అయితే నీకు చెప్పలేదన్న మాట. కాంతయ్యగారి సత్తిబాబు శవాన్ని పట్నంలో కోసి చూసారుగా"

"అవును. విన్నాను."

"మా పెద్దల్లుడూ ఆ డాక్టరుగా వీడి శవం కోసి పరీక్ష చేసినాయన కలిసి చదువుకున్నారటలే ఆయన చెప్పాడట. మీ అల్లుడు మా అనసూయతో చెబు తుంటే విన్నాను" కొంచెం ఆగి అందు కొన్నాడు "సత్తిబాబు కణత ఎముక పగిలి ఉందట. అదీగాక మెడనరాలు అన్నీ నాసుకు పోయి కనుగుడ్లు పైకి వచ్చేసి ఉన్నా యంట. ఇంకా ఏదో చెబుతుంటే నేను వెళ్లాను గదిలోకి. ఇంక చెప్పలేదు. తర్వాత వివరంగా అడుగుదామనుకొన్నానుగాని ఆయన తెల్లవారుఝామునే అర్జంటుగా వెళ్లి

పోయాడు. సత్తిబాబు తాటిపక్కె వంతెన దాటుతూ ఏట్లో పడిపోయి ఉంటాడను కున్నాంగద బావా"

"దాని దేం ఉంది. ఏట్లో కొట్టుకు, పోతుంటే ఏరాయో తగిలి కణత బద్దలై ఉంటుంది"

"మరి మెడనరాలు వాచుకుపోవటం ఏంటి"

"వంకల్లో ఆ రాయికీ ఆ మోడుకీ కొట్టుకుంటే వాచుకుపోవటయ్యా"

ఆరిపోయిన చుట్టను అంటించడానికి సూరయ్య అగ్గిపుల్ల గీస్తున్నాడు. గదిలో ఏదో దభేలున పడ్డ శబ్దం వినిపించింది. దొరయ్య సుబ్బారావు గదిలోనికి వెళ్ళాడు. ఒక్కదూకులో. గదిలోనికి వెళ్ళిన దొరయ్య 'సూరయ్య బావా' అని కంగారుగా కేక వేసాడు. సూరయ్య వెళ్ళాడు. లక్ష్మమ్మ వచ్చింది. సుబ్బారావు మంచం మీదనుండి కిందకు బోర్లాపడిపోయాడు. సచేల స్నానం చేసినట్లు వంటిమీద పంచె, బనీను తడిసి పోయాయి. గుప్పిళ్ళు బిగించి, పళ్ళు గిట్ట కొరుచుకొని ఉన్నాయి. శరీరం ఆపాద మస్తకం మలేరియా జ్వరం కుదుపులాగ వణికిపోతున్నది. దొరయ్యా, సవురయ్యా పొయింపట్టి మంచంమీద పడుకోబెట్టారు. సుబ్బారావు కళ్ళు తెరిచే ఉన్నాయి. కాని అవి దేనినీ చూడటంలేదు. భయాన్నంతా ముద్ద చేసి దానితో మనిషి ముఖం మలిచి నట్లయితే అది ఇప్పటి సుబ్బారావు ముఖంలా ఉంటుంది. కడకిది మూర్ఛలోకి దింపిందే మోనని పాదలిపోయింది లక్ష్మమ్మ.

'ఏ వంట్లో ఎలా ఉంటున్నది నాయనా' అని లక్ష్మమ్మ రోజా కెన్నిసార్లు అడుగు తున్నది. ఏమని చెప్పగలడు ఎలా చెప్ప గలడు. వంటిమీద గాయాలు చూప గలడు. కడుపునొప్పి అని చెప్పగలడు. కాని తనలోని నరకాన్ని ఎలా వివరించగలడు. అంతర్గతమైన సంక్షోభాన్ని వర్ణించ గల భాష ఇంకా ప్రపంచంలో పుట్ట లేదు. భాష కందని అనుభూతులెన్నో.

సంజ దీపం తెచ్చి గదిలో పెట్టి వెళ్ళింది లక్ష్మమ్మ. సుబ్బారావు మంచంమీద వెల్లకిలా పడుకొన్నాడు. దృష్టి ఆశ్రయ

పసివాడా జయంనీకు

త్వంగా గోడ మీద పటం మీద విరిచింది. రెండు నిముషాలు స్థిరంగా పటం వంకే చూసాడు. తనకు తెలియకుండానే కెవ్వు మన్నాడు. పటంలో మార్కండేయుడు శివలింగాన్ని రెండుచేతులా కౌగలించుకున్నాడు. అతని మెడకు బిగించి ఉన్న పాశం ఒక కొనను పట్టుకొని లాగుతున్నాడు. దున్నపోతు మీద కూర్చున్న యముడు. లింగోద్భవుడైన రుద్రుడు ఒకచేత మార్కండేయుని తల నిమురుతూ, రెండో చేతిలో ఉన్న త్రిశూలాన్ని యమునికి గురిపెట్టి నిమురుతున్నాడు. ముక్కంటి మూడు కన్నుల నుండి ప్రళయానల జ్వాలలు యముని పైకి దూకుతున్నాయి.

లక్ష్మమ్మ ఒక్క అంగలో వచ్చింది గది లోనికి. సుబ్బారావు రెండు చేతులతోనూ కళ్లు కప్పుకున్నాడు. ఎండుటాకులా రెపరెపలాడిపోతున్నాడు.

"ఏం నాయనా" తల్లి పలకరించింది. సుబ్బారావు మాట్లాడలేదు. కొడుకు శరీరాన్ని స్పృశించి మళ్లీ అడిగింది. వేలి వ్రేళ్ల సందుల్లోంచి తల్లివంక బిత్తరి చూపులు చూసాడు. లక్ష్మమ్మ గుండె నెవరో ఉక్కు గుప్పెటల్లో పట్టిపిండారు. అది నీరై రెండు కన్నుల నుండీ జారిపోయింది.

దిగులుగా దినాలు, వారాలు, నెలలు గడిచాయి.

దాలిచాలని చర్మాన్ని సాగదీసి కుట్టిన ఎముకల మూటలా తయారయ్యాడు సుబ్బారావు. అతని వడి తిరిగిన కండరాలు గాలిలో పెట్టిన కర్పూరపు బిళ్లల్లా, సూర్య రశ్మికి మంచుబిందువుల్లా హరించుకొని పోయాయి.

జయలక్ష్మి తండ్రి మళ్లీ ఉత్తరం వ్రాయించాడు, ఒకవారం రోజుల్లో అమ్మాయిని తీసుకెళ్లడానికి వస్తున్నానని. సుబ్బారావు ఈ వారం రోజుల్నించీ కొంచెం కదలికగా తిరుగుతున్నాడు. అప్పుడప్పుడు వీరుగు వారి అరుగు మీదకు కూడా వెళ్తున్నాడు. మునుపటి చైతన్యం తిరిగి పుంజుకొంటున్నాడు. చూపుల్లో ఇదివరకున్న బెరుకు, వెర్రి లేవు. లక్ష్మమ్మ కొంత కుదుటపడింది.

జయలక్ష్మికి నెలలు నిండాయి. తండ్రి వచ్చాడు. ఇప్పుడైనా పంపకపోతే వీలులేదని గట్టి పట్టుపట్టాడు. ఇదివరలో ఒకసారి వచ్చి ఎవ్వరినీ ఒప్పించలేక కడకు జయలక్ష్మి కూడా సుముఖంగా లేనిమూలాన తిరిగి వెళ్లాడు. ఇప్పుడు లక్ష్మమ్మ మెత్తబడింది. దొరయ్య అంగీకరించాడు. జయలక్ష్మి మౌనం వహించింది. జయలక్ష్మి పురిటికి పుట్టింటికి వెళ్లింది.

అన్నిరాత్రులలా తెల్లవారుతాయి. అమావాస్య రాత్రి తెల్లవారుతోంది. తెల్లవారు ఝామున పోతున్న చీకటీ రానున్న వెలుగూ పెనుగులాడుతున్నాయి. లక్ష్మమ్మ లేచి పెరట్లోకి వచ్చింది. పెరటి తలుపులకు లోన గడియ వేసిలేదు. "అయ్యో రాత్రి గడియ వేయడం మర్చిపోయాను గాబోలు. నా మరుపు కూలా" అనుకుంది. గంగన్న తలుపు తోసుకొని వచ్చాడు. లక్ష్మమ్మ లోనికి వెళ్లి పాలచెంబు తెచ్చి గంగన్నకిచ్చి "బేగీరారా గంగన్నా మీ బాపుగారు కాకినాడ వెళ్తారట" అంది.

రోజూ ఉదయమూ, సాయంత్రమూ గంగన్నే పాలలో ఉన్న పెద్దావు పాలు పితికి తెస్తున్నాడు. గంగన్న సాల దగ్గర కెళ్లేటప్పటికి వెలుగు చీకటినిపూర్తిగా కబళించివేసింది.

గంగన్న సాల గేటు తలుపులు తోసి పెద్దావు కట్టి ఉన్న పంచమూలకు చూసి విల్చున్న చోటనే నిలువునానాతి బొమ్మైపోయాడు.

పెద్దావు మొండిదారికాళ్ళ మొరడు విసిరేసినట్లున్న కాలు చేతులలో వెల్లకిలా పడి ఉన్నాడు సుబ్బారావు. పెద్దావు కట్టు కొయ్యనే ఉంది. సుబ్బారావును మూచూస్తున్నదల్లా గేటు చప్పుడు కాగానే తలఎత్తి గంగన్నను చూసి తిరిగి సుబ్బారావుపై తల దించింది. దాని చేరెడేసి కళ్లు క్షణంలో సగంలో గండ్లు పడబోయే చెరువుల్లా ఆ కంపించిపోతున్నాయి. సుబ్బారావు కుడి చేతి సమీపంలో పడి ఉన్న 'ఎండ్రిన్' డబ్బా అతని హృదయ దళన విషాద జీవిత కావ్యానికి 'స్వస్తి' చెబుతున్నది.

క్షణికమైన ఆవేశాలకు, ఉద్రేకాలకు లొంగి ఏ మానవుడు ఏ దుర్ముహూర్తాన ఏ దుష్కృత్యం చేసేస్తాడో ఎవ్వడూ చెప్పలేడు. తెలిసి చేసినా, తెలియక చేసినా దానిని వెంట వేసుకొని అంతఃకరణ వేయి గొంతులతో వెన్నాడి అహర్నిశమూ జీవితాన్ని కోటి రంపాలతో కోస్తుంది. మానవు డెవ్వడూ దానికి తట్టుకోలేడు.

పెద్దావు మళ్లీ తల ఎత్తేటప్పుడు గండ్లు తెగిన చెరువులు పొర్లిపోయాయి. వెల్లువ లాంటి ఆ అశ్రుజలంతో సుబ్బారావు గుండెలో కొంతకాలంగా చెలరేగిపోతున్న దావాగ్ని పూర్తిగా ఆరిపోయింది.

పెద్దావు తలఎత్తి 'అంబా' అని మూలిగింది.

పొలపొలంతా పునాదులతో కదిలి కరిగిపోయింది.

పొలలో ఉన్న పశువులన్నీ మూలిగాయి.
పైన విహరిస్తున్న పక్షులు మూలిగాయి.
చుట్టూ ఉన్న ప్రకృతి మూలిగింది.

ప్రక్కనే ప్రవహిస్తున్న, సర్వమూ తెలిసిన చిరంతన యాత్రికురాలు "మానవుడా! జయం నీకే" నే పల్లవి పాడుకుంటూ మెల్లగా సాగిపోతున్నది. ●

మదరాసుకు మంచిరోజులు
వసంతసేనతో నాగేశ్వరరావు



నాగేశ్వరరావు

చరిత్ర పునరావృతం కావటం, జరిగిన సంఘటనలే మళ్లీ మళ్లీ జరగటం ప్రకృతి సహజం. సరిగా నాలుగు సంవత్సరాల క్రితం 1962లో అనుకుంటా తెలుగువారి పుట్టినిల్లు, మెట్టినిల్లు అయిన హైదరాబాద్‌కు వెళ్లిన శ్రీ అక్కినేని నాగేశ్వరరావు మదరాసుకు మళ్లీ వచ్చారు. 'వసంతసేన'లో మదరాసులో కూడా పనిచేయటానికి ఆయన అంగీకరించారు. అంటే మదరాసుకు మళ్లీ మంచి రోజులు వచ్చాయన్నమాట!

నిజంగా చాలమంది విస్తుపోయారు. నాగేశ్వరరావుగారేమిటి? మదరాసు రావడమేమిటి? అనుకుని ముక్కున వేలేసుకున్నారు. కాని మొన్న సోమవారంనాడు విక్రమ్ స్టూడియోలో అపురూపసుందరుడైన చారుదత్తునిగా ఆయనను చూసిన తర్వాత అందరి సందేహాలు పటాపంచలయ్యాయి. మమతలు గూళ్లు కట్టుకున్న హృదయాలున్నవారంతా యిది చూసి ఎంతో మురిసిపోయారు.

అసలు నాగేశ్వరరావుగారికి మదరాసుకు అనుబంధం ఎలా పోతుంది? ఆయన పసివాడుగా ఉన్న రోజుల్లో మదరాసు మహానగరమే తన బంగారు ఒడిలో కూర్చో బెట్టుకున్నది. రోజులు గడుస్తున్నకొద్దీ వాటితోపాటు పెంచి పెద్దవాణ్ణి చేసి తెలుగు చిత్రసీమకు నాయకుణ్ణి చేసింది మదరాసు నగరమేకదా! ప్రపంచమెంత విశాలమైంది! ఈ ప్రపంచాన్ని చూస్తుంటే మనం ఎంత చిన్నవాళ్లమో తెలుస్తున్నది, అంటూ శ్రీ అక్కినేని తరచుగా చెప్పే అనుభవ వాక్యాలకు పునాదులు పడింది యిక్కడేకదా.

'వసంతసేన'లో నటించడానికి మదరాసు రావటానికి క్రొత్తగా చెప్పుకోతగిన ప్రత్యేకమైన కారణాలు లేవంటారు శ్రీ నాగేశ్వరరావుగారు. 'వసంతసేన' నిర్మాతలు, దర్శకులు శ్రీ బి. ఎస్. రంగాగారికి నాగేశ్వరరావుగారిమీద తొలినుంచీ ఎంతో ప్రేమ, అభిమానం ఉన్నాయి. తెనాలి రామకృష్ణ చిత్ర నిర్మాణంనుంచీ ఈ అభిమానం పెంపొందుతూ వచ్చింది. దీనికితోడు శ్రీ బి. ఎస్. రంగా, శ్రీ నాగేశ్వరరావుతో తీసిన చిత్రాలన్నీ విజయవంతమయాయి. ఇటీవలనే తీసిన అమరశిల్పి జక్కన కూడా ఆ కోవలోనిదే.

భరణీవారి తదుపరి చిత్రంలో మద్రాసులో నటించడానికి శ్రీ నాగేశ్వరరావు అంగీకరించారనేది మరో వార్త. ఇదే విషయం శ్రీ నాగేశ్వరరావుతో ప్రస్తావించగా, భరణీ సంస్థ తనపై ఎలాంటి వాత్సల్యం చూపుతున్నదీ వివరించారు. ఆ సంస్థ తయారు చేసిన చిత్రాలలో చాల వాటిల్లో శ్రీ నాగేశ్వరరావు నాయకుడు. అందువల్ల యీనాడు ఆ సంస్థకు మదరాసులోనే నటించడానికి అంగీకరించడం ఆశ్చర్యంలేదని ఆయన తెలిపారు.

పైగా పై యిద్దరి నిర్మాతలకు స్వంత స్టూడియోలు మదరాసులోనే ఉన్నాయి. వీరు ఉన్న స్టూడియో వదలిపెట్టుకొని మరొక నగరానికి రావటం అంటే చాల ప్రయాసతో కూడిన పని. ఇలాంటి పరిస్థితుల్లోను హైదరాబాద్‌లో స్టూడియోలు సందడిగా ఉంటున్నాయి. శ్రీ నాగేశ్వరరావుకు కూడా ఎప్పుడూ షూటింగ్ ఉంటున్న కారణంగా కొన్ని కాల్‌షీట్లు, మదరాసులో పనిచేయుటానికి అంగీకరించినట్లు వారు తెలిపారు.

శ్రీ నాగేశ్వరరావు మదరాసుకు రావటం శుభ సూచకం.


—ధర్మాజీ



తప్పక చూడండి!
సువర్ణా ఫిలింసు వారి
ఆటబొమ్మలు
నిర్మాత... టి.సి. సుబ్బన్న
దర్శకత్వం. జి. విశ్వనాథం
రచన.... జి. కృష్ణమూర్తి B.A
పాటలు.. జి. కృష్ణమూర్తి B.A
డా॥సి. నారాయణరెడ్డి.
సంగీతం.. కోదండపాణి
PARTHAN.
డిస్ట్రిబ్యూటర్స్: ఆంధ్ర: గౌతమి. సీడెడ్: జయలక్ష్మి. నైజాం: శ్రీనేషనల్ ఆర్టుపిక్చర్స్
Vijaya

ఉత్సాహశీలి

భన్ బాబు



బొమ్మలో బొమ్మలు—వీరాభిమన్యులో శోభన్‌బాబులతో శోభన్‌బాబు

విశాలమైన ప్రపంచంలో రకరకాల తత్వాలు, విభిన్నరకాల వైఖరులు కనిపిస్తాయి. సమర్థుడైన దర్శకుడుంటే, వీటన్నింటిని ఆయా వెలుగుల్లో ప్రేక్షక మహాశయులకు సమర్పించటానికి అవకాశాలు మిక్కుటంగా ఉంటాయి.

కాని, అంతకంటె పెద్ద సమస్య పాత్రధారులు కావాలి. పాత్రపోషణ చేసికొంటూ, ఆ పాత్రకుండే హావభావాలను వ్యక్తపరచగల్గిన సామర్థ్యముండే వ్యక్తులు కావాలి. అలాంటి శక్తి, సామర్థ్యాలు కలిగిన అందమైన యువకుల్లో శ్రీ శోభన్ ఒకరు.

శ్రీ శోభన్‌బాబు నటించిన 'వీరాభిమన్యు' చిత్రాన్ని మొన్ననే చూశాం. అందులో ప్రధాన పాత్ర అయిన 'అభిమన్యుడు' గా ఆయన నటించారు. మహాభారత కథలో అభిమన్యుడు చాలా ముఖ్యుడు. మహా పరాక్రమవంతుడైనప్పటికీ, పాండవ పక్షపాతి—ఆ నల్లనయ్య పథకాలకు అర్పించబడ్డాడు. కౌరవసమూహమంతా ఆ పరాక్రమవంతుణ్ణి బలిగొన్నది. మంచి విలాసపురుషుడు అభిమన్యుడు.

'ఉత్తర' మమతను, ప్రేమను తనలో దాచుకున్న వ్యక్తి .... ఇన్ని రకాల తత్వాలున్న ఆ అభిమన్యుని పాత్రను సమర్థవంతముగా పోషించి, అందులోనూ ఆ ఠీవి, ఆ రాజరికం, ఆ లాలిత్యాలను అగుపరచిన ఖ్యాతి దక్కించుకొన్న బహు కొద్దిమందిలోనూ శోభన్‌బాబు కూడా ఒకరు. 'వీరాభిమన్యు' తెలుగు దేశంలో 13 కేంద్రాలలో, శత దినోత్సవాలు జరుపుకొని, తెలుగువారి ఆదరాభిమానాలను విశేషంగా చూరగొనడానికి శోభన్‌బాబు మంచి పాత్రను నిర్వహించాడు.

కాని, దురదృష్టవశాత్తు, సామర్థ్యానికి, ప్రతిభకు, అవకాశాలకు మన తెలుగు సినిమా ప్రపంచంలో సంబంధంలేదు. అందమైన విగ్రహం, చక్కని రూపురేఖలు—వీటికి మించిన మంచితనం—ఆయనకు పెట్టని ఆభరణాలు.

వినయమూర్తి శోభన్‌బాబు

శోభన్‌బాబు గత ఆరు ఏడు సంవత్సరాలుగా మద్రాసు చలనచిత్ర పరిశ్రమకు సన్నిహితులై ఉంటున్నారు. ఆనాడు అవకాశాలు కొద్దిగా ఉండేవి. ఈనాడవి ద్విగుణీకృతం అయ్యాయి. కాని, నాడు కనిపించిన వినయమే శోభన్‌బాబులో నేటికీ కనిపిస్తుంది. అందుకే ఆయన్ని అభిమానించే వారు ఎప్పుడూ 'శోభన్‌బాబు వినయమూర్తి' అంటూ ఉంటారు.

ప్రవేశం

కళాకారుడన్న వాడు జన్మతః కళాకారుడే. కళారాధన అనేది నిజమైన కళాకారులకు వెన్నతో పెట్టిన విద్య. శ్రీ శోభన్‌బాబుకు కూడా సరిగ్గా అదే జరిగింది. బాల్యం నుంచి ఆయనకు నాటకాలన్నా, సినిమాలన్నా వల్లమాలిన అభిమానం. చిన్నతనంలో మేనమామ గారలు ఇచ్చిన ప్రోత్సాహాన్ని వూతగా తీసుకొని, ఆయన 13వ ఏట 45 సంవత్సరాల వయస్సుగల వేషం 'మా భూమి' నాటకంలో వేశారు. చూచినవారంతా 'ఎవరీ పెద్దాయన' అనుకున్నారు. కాని తెలిసినవారు 'మన శోభన్‌బాబేనా' అనుకొని ముక్కున వేలు వేసుకొన్నారు.

ఆనాడు మొదలయిన కళారాధన ఎప్పటికప్పుడు రూపాన్ని మార్చుకొంటూ, స్థాయిని సంపాదించుకొంటూ శోభన్‌బాబును మెట్లు

మెప్పు సభావాల విశ్వాసం కావటానికి, ఆయన మంచి నటులు కావటిగాదు అందుకే శ్రీబాబు తనకు యీ ఆసక్తి కలిగించినవారికి, ఇందులో ప్రోత్సాహమిచ్చినవారికి కూడా కోటి ప్రణామాలు చెల్లించుకుంటూ ఉంటారు

తొలి ప్రవేశం

1960 లో అనుకొంటా—భక్త శబరి చిత్ర నిర్మాణం వేంచి వరుగులతో సాగి పోతున్నది అందులో మునికుమారుని వేషం ఒకదాన్ని ప్రత్యేకమైన శ్రద్ధతో రూపొందించారు ఇలాంటి ప్రత్యేకమైన పాత్రలకు, ప్రత్యేకమైన వ్యక్తులున్నప్పుడే, అవి రక్తి కడతాయి. శ్రీ శోభన్‌బాబుకు యీ పాత్ర లభించేవరకూ శబరి నిర్మాత, దర్శకులు ఆ పాత్రకు తగిన వ్యక్తి గురించి అన్వేషిస్తూనే ఉన్నారట దీనిని బట్టి ఆయన ఈ పాత్రకు ఎంత బాగా సరిపోయారో ఊహించుకోవచ్చును.

'శబరి' లో శోభన్‌బాబుగారు [illegible] పెద్దల దృష్టికి వెళ్ళారు ఇంతలో శ్రీ ఎన్. టి. రామారావుగారి స్వంత చిత్రం 'సీతారామ కళ్యాణం' నిర్మించడానికి తగిన ఏర్పాట్లన్నీ జరుగుతున్నాయి. 'ఆ దశరథ నందనునికి తగిన ఆమణుడు ఎవరా ?' అని వెదుకుతున్న సమయంలో—వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు 'శబరి' లో మునికుమార పాత్రధారి శ్రీ శోభన్‌బాబు కనిపించారు. క్షణంలో ఆ పాత్రకు ఆయన ఎన్ని కయ్యారు. శ్రీ ఎన్. టి. రామారావు చిత్రములో లక్ష్మణుని పాత్ర ధరించటం శ్రీ శోభన్‌బాబు స్థానాన్ని [illegible] ప్రముఖ [illegible] వృద్ధిపరిచాయి.

తదనంతరం 'భీష్మ' లో ఆయనకు [illegible] మంచి వేషం లభించింది [illegible] 'నర్తనశాల' లో కూడా శ్రీ శోభన్‌బాబుకు, దర్శకులు శ్రీ కమలాకర కామేశ్వరరావుగారు మంచి పాత్రనిచ్చారు లలితా శివజ్యోతివారి 'లవకుశ' లో శత్రుఘ్నుడుగా ఆయన చూపిన పరాక్రమం, ఆ చిత్రానికి మరికొంత నిండుదనాన్ని చేకూర్చింది

'వీరాభిమన్యు'

ఎట్టకేలకు తను కలలుకన్న వేషం 'వీరాభిమన్యు' లో దొరికింది. నిర్మాతలు సుందరలాల్ నహతా, డూండీలు శ్రీ శోభన్‌బాబును ఆ పాదమస్తకం పరీక్ష చేశారు దర్శకులు శ్రీ మధుసూధనరావు కూడా ప్రత్యేకమైన కృషి ద్వారా శోభన్‌బాబు—అభిమన్యు అను రెండు తత్వాలను ఏకం చేశారు అదే 'వీరాభిమన్యు' కు విజయమైన ప్రాణం పోసింది. ఈనాడు శోభన్‌బాబు గారికి తెలుగు సినిమా రంగంలో అంతటి స్థానాన్ని ఇచ్చింది కూడా 'వీరాభిమన్యు' చిత్రం కావటం అతిశయోక్తి కాదు.

ఆయన ప్రస్తుతం నటిస్తున్న చిత్రాలు కూడా చిరివిగానే ఉన్నాయి శివప్లిక్ ప్రొడక్షన్స్ వారి 'సత్యం—శివం—సుందరం', గౌరీ ప్రొడక్షన్సువారి 'లోగుట్టు పెరుమాళ్ళకెరుక' తదితర చిత్రాల్లో కూడా ప్రధాన పాత్రలు వేస్తున్నారు రేఖా అండ్ మురళి ఆర్ట్సువారి తాజా చిత్రం 'పాట్ల ప్లీడర్' లో ద్విపాత్రాభినయం చేస్తున్నారు ఇందిరా రమణావారి క్రొత్త చిత్రం, వై. ఆర్. స్వామిగారి దర్శకత్వంలో తయారవుతున్న చిత్రంలోను, శ్రీ తిలక్ దర్శకత్వంలో తయారవుతున్న 'కాంభోజరాజు కథ' చిత్రంలోనూ రామకృష్ణ — ఎన్. వి. ఎస్. కంబైన్సు 'శ్రీ కృష్ణ పాండవీయం' ద్వారాను చిత్రాల్లోనూ ఆయన నటిస్తున్నారు. భారత్ పిక్చర్సువారు నిర్మిస్తున్న 'భక్త పోతన' లో శ్రీనాథుడు, శ్రీ దేవి ప్రొడక్షన్సువారి 'పరమానందయ్య శిష్యులు' కథ' లో శివుడు పాత్రం శ్రీ శోభన్‌బాబు వేస్తున్నారు.



శోభన్‌బాబు

చదువు—లోకానుభవం

చదువు అన్నాడు [illegible] సంస్కారాన్ని [illegible] శ్రీ శోభన్‌బాబు అభిప్రాయం. గుంటూరు ఎ. సి. కాలేజీలో విద్యాభ్యాసం [illegible] శోభన్‌బాబుకు ఆ విద్య [illegible] సంస్కారాన్ని ప్రసాదించింది. ఆ సంస్కారమే ఆయనకు శ్రీరామరక్ష.

తెలుగుదేశంలో క్రొత్త కళాకారులు [illegible] చాలా తక్కువని అంటున్నారు. ఈ [illegible] పురస్కరించుకొని [illegible] [illegible] శోభన్‌బాబులాంటి [illegible] ఉన్నారు. [illegible] సమయానికి [illegible] [illegible] కూడా [illegible] [illegible] బాధ్యత

[illegible] శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారిలో మంచితనము శ్రీ శోభన్‌బాబు [illegible] అంటే శ్రీ నాగేశ్వరరావు మెచ్చుకొన్నారు. [illegible] [illegible] నిర్మించిన 'పరువుతున్న అనుబంధాలు' చిత్రంలో వేషం లభించింది.

అన్ని పద్ధతులు [illegible] వ్యక్తి శోభన్‌బాబు మంచి మార్గాన శోభన్‌బాబుకు ఏడవట్లులో ఉంటాయి


వచ్చేవన్నీ మంచి రోజులే ! తెలుగులో నాయకుల కొరత బాగా కనిపించే రోజులు ముందున్నాయి ఇలా ఇలా పెరుగుతూ, వెళ్ళే శోభన్‌బాబు, ఆ తారాపథాన్ని అందుకోవటానికి ఎక్కువ రోజులు పట్టదు. కారణం ఎక్కువ మెట్లు లేకపోవటమే !


కొల్లూరు ప్రభాకర్.













రాజాశాండోని సినీనటునిగా మార్చిన సంఘటన

దక్షిణాదిన మల్లయుద్ధ వీరునిగా పేరు పొందిన రాజాశాండో 1920—25 ప్రాంతంలో చలన చిత్ర పరిశ్రమలో తన అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు బొంబాయి వెళ్లాడు. నెలల తరబడి బొంబాయిలో ఉన్న స్టుడియోలన్నిటి చుట్టూ కాళ్లరిగేలా తిరిగాడు, కానీ ఒక్క నిర్మాత కూడా యితని పట్ల ఆసక్తిని కనపరచలేదు. చివరికి ఎలాగో అలా బొంబాయిలో పేరు పొందిన కోహినూర్ స్టుడియోలో ఎక్స్‌ట్రాగా ఉద్యోగం సంపాదించగలిగాడు. కానీ ఎక్స్‌ట్రాగా జీవితాన్ని కొనసాగించటం అతనికి దుర్భరమై పోయింది. హతాశుడై తిరిగి మద్రాసు వెళ్లిపోవాలని అనుకున్నాడు. సరిగ్గా యిదే సమయంలో కోహినూర్ స్టుడియోలో జరిగిన ఒక సంఘటన రాజాశాండోకి సహాయకారి అయింది. ఆ స్టుడియోలో ఉన్న ఫిలిం లేబరేటరీ భవనానికి ఒకనాటిరాత్రి నిప్పంటుకుంది. లేబరేటరీని అగ్ని జ్వాలలు చుట్టుముట్టాయి. ఆ భవనంలోని ఓ గదిలో కొత్తగా నిర్మించిన, విడుదలకు సిద్ధంగా ఉన్న ఓ చిత్రం తాలూకు ఫిలిం రోల్స్ భద్రపర్చబడిఉన్నాయి. వాటిని అగ్నికి ఆహుతి కాకుండా ఎలా రక్షించాలో ఎవరికీ అంతు పట్టలేదు. ఆ ఫిలిం రోల్స్ తగులబడి పోవటం నిర్మాతకు కొన్ని వేల రూపాయల స్థితిలో రాజాశాండో మంటలలోకి జొరబడి, భవనం పై భాగంలో ఫిలిం రోల్స్ ఉన్న గదికివెళ్లి, వాటిని తీసుకుని, కిటికీలోనుంచి ఆ భవనం ప్రక్కగాఉన్న బావిలోకి దూకేశాడు. ఈ సాహసకృత్యంతో కోహినూర్ స్టుడియో నిర్మాతకు రాజాశాండోపై సదభిప్రాయం, అభిమానం ఏర్పడి తాను తీసే చిత్రాల్లో కొద్ది కొద్దిగా ప్రాముఖ్యత గలిగిన పాత్రలను యివ్వటం ప్రారంభించాడు. రెండు సంవత్సరాలావిధంగా ఉత్సాహవంతంగా గడచిపోయిన తర్వాత ఆ నిర్మాత నిర్మించిన చిత్రంలో నాయకపాత్ర ధరించాడు రాజాశాండో. తన కిచ్చిన ప్రతి పాత్రనూ కృషితో సమర్థవంతంగా పోషించి ప్రేక్షకుల మన్ననలందుకున్నాడు. అభిమానులు అతనికి 'ది కింగ్ ఆఫ్ ఇమోషన్స్' అని పేరు పెట్టారు. ప్రఖ్యాత సినీ నటుల్లో ఒకడుగా దాదాపు ఒక దశాబ్దంపైగా రాజాశాండో బొంబాయి చలన చిత్రరంగంలో రాణించాడు. అనంతరం 1935 లో తిరిగి మద్రాసు వచ్చి ఎన్నో తమిళ చిత్రాలలో కూడా ప్రధాన పాత్రలను సమర్థవంతంగా పోషించాడు.

—వి. ఎస్. సుక్తాంకర్.

సినిమావార్తలు

'భక్త పోతన'లో శ్రీనాథుని చాటువులు

ఈమధ్య భారత్ ఫిలింస్ వారు తమ చిత్రం 'భక్తపోతన' లో చిత్రీకరించుటకు శ్రీనాథుడు వ్రాసిన,

'కవిరాజు కంఠంబు కౌగిలించెనుకదా...'

'కాశికా విశ్వేశు కలిసె వీరారెడ్డి...'

అను రెండు చాటువులను రికార్డింగ్ చేశారు. ఈ రెండు పద్యాలు శ్రీనాథ పాత్రధారి యస్. వి. రంగారావుతో చిత్రీకరిస్తారు.

'బాల రసాల సాల నవ పల్లవ...'

అను పద్యాన్ని పోతన వ్రాసినట్లు అందరికీ తెలిసినదే. ఈ పద్యాన్ని కూడ రికార్డింగ్ చేశారు. ఈ పద్యాన్ని మల్లన పాత్రధారి హరనాథ్‌తో చిత్రీకరిస్తారు.

సినిమా వార్తలు

భరణి స్టూడియోలో రికార్డింగ్ చేశారు. సంగీతం — యస్. రాజేశ్వరరావు సమకూర్చారు.

ఈ చిత్రంలో యింకా గుమ్మడి, అంజలీదేవి, నలం, వాసంతి, బాలయ్య, పద్మిని ప్రభాకరరెడ్డి, రాజబాబు, వాసుదేవ్ గిరిరాజా, శారద, జయశ్రీ మొదలగు ప్రముఖ తారాగణం అంతా పాల్గొంటున్నారు.

ఈ చిత్రానికి నిర్మాత—టి. విశ్వేశ్వరరావు, దర్శకుడు — బి. రామినీడు.

జగపతివారి 'ఆస్తిపరులు'

జగపతివారు తీయ దలచుకున్న సాంఘిక చిత్రం 'ఆస్తిపరులు' షూటింగ్ శీఘ్రంగా ప్రారంభంలో కాగలదు. ఈచిత్రం కథానాయకుడు అక్కినేని నాగేశ్వరరావు. ఇంకా యీ చిత్రంలో జగ్గయ్య, రేలంగి, పద్మనాభం, జయలలిత, జి. వరలక్ష్మి, సూర్యకాంతం మొదలగువారు నటిస్తారు. గుమ్మడి గెస్టుగా నటిస్తారు.

ఆచార్య ఆత్రేయ సంభాషణలుకూర్చారు. సంగీతం— కె. వి. మహదేవన్. నిర్మాత రాజేంద్రప్రసాద్. దర్శకత్వం—వి. మధుసూదనరావు.

—ధర్మాజీ ●

dited Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6&7 Thambu chetty Street


NIVEA
creme

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA

